ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఆడపడుచులు - పెళ్ళిళ్లు

1-2-61

25 నయాపైస





'కలంకారి'

చిత్రకారుడు - కాశి ధర్మారావు (విజయనగరం)

ఉత్తరాలు

రంగుటద్దాలు

సంక్రాంతి సంచికలో శ్రీ అక్కినేని నాగేశ్వరరావు వ్రాసిన "రంగుటద్దాలు" వ్యాసం చాలా బాగుంది. అది చదివిన ప్రతి వ్యక్తీ తనే విధమైన రంగుటద్దాలు ధరించి వున్నాడో స్పష్టంగా తెలుసుకో గలుగుతాడు. జీవితంలోని సుఖదుఃఖాల్ని, వెలుగు నీడల్ని విడమర్చి, వాటి పరిమాణాల్ని చక్కగా చిత్రీకరించారు రచయిత.

బి. మన్‌మోహన్ (సికింద్రాబాదు)

* * *

ముచ్చట గొలిపే ముఖచిత్రంతో సంక్రాంతి సంచిక అందించిన మీకు నా ధన్యవాదములు. అక్కినేనివారి భావాలు "రంగుటద్దాల"లోంచి చూస్తే చాల బాగున్నాయి. "లక్ష్యం మంచిదైనపుడు స్వార్థం తప్పదు" అనడం ఎంతో సమంజసంగావుంది. దయచేసి నాగేశ్వరరావుగారికి నా అభినందనముల అందజేయండి.

గూడెపు శ్రీనివాసరావు (గుంటూరు)

* * *

"సంక్రాంతి సంచికలోని ఈసారి 'రంగుటద్దాలు' శుదదండుగ. రచయితకి ఆ 'టైటిల్' తప్పితే వేఱొకటి దొఱకటం లేదనుకొంటాను. నటుని విధి తనకు నచ్చిన పాత్రను గురించి వ్రాయటం...అంతే గాని సంఘసంస్కర్తలా జీవితసమస్యలను లోకులదృష్టికి తేవటానికి ప్రయత్నించటం అతనికర్తవ్యం కానే కాదు. అసలలా ప్రయత్నించటం కూడా అనవసరం. పత్రికలో మిగిలినవన్నీ బాగున్నాయ్.

అందే గోపాలకృష్ణ (రాజమండ్రి)

* * *

నా అభిమానపాత్రరావణ

సంక్రాంతి సంచికలో 'నా అభిమానపాత్ర-రావణ' అనే వ్యాసం శ్రీ రామారావు చెబుతూన్నట్లు గాక, సాక్షాత్తూ రావణాసురుడే పలుకుతూన్నట్లు భ్రమ కలిగింది. రావణుని వ్యక్తిత్వాన్ని చాల నిశితంగావిమర్శించిన ఈ విజ్ఞానాత్మక వ్యాసాన్ని రచించిన శ్రీ రామారావుగారు అభినందనీయులు.

చెరుకూరి గురవయ్యనాయుడు (పాకాల.)

* * *

సంక్రాంతి సంచికలో ఎన్. టి. రామారావుగారు రచించిన "నా అభిమానపాత్ర, రావణ అనే రచన చాలా బావుంది. నిజంగా రావణపాత్ర ధరించి, రామారావుగారు సఫలీకృతులయ్యారు. లోకకంటకుడని పేరుపొందిన రావణాసురుని రసజ్ఞునిగా, జ్ఞానిగా ప్రేక్షకులకు చూపెట్టి ఆ పాత్రలో లీనమై, ప్రేక్షకులు తనయందు లీనమయ్యేట్లు చేసిన రామారావుగారు నిజంగా అభినందనీయులు.

వి. వి. రమణారావు (విశాఖపట్నం)

* * *

ఆదివారం...ఆదివారం...

శ్రీమతి శంకరమంచి జానకి చక్కని వ్యాసం వ్రాశారు. వారన్నట్టు, సినిమా లోకంలో వ్యవహరించే, నటీనటులుకూడా మామూలు వాతావరణంలో, జీవించాలని కలలు కనడం సహజమే.

చక్రవర్తి లక్ష్మి (నెల్లూరు)

* * *

సంక్రాంతి సంచికలో శంకరమంచి జానకిగారు వ్రాసిన వ్యాసము (ఆదివారము...ఆదివారము) సగము చదివే సరికి విసుగొచినది. అటువంటి అర్థంలేని వ్యాసాలను ప్రచురించి, మీ పత్రికకున్న విలువను పోగొట్టుకొనరని ఆశిస్తున్నాను.

కందిరెల్లి గోపాలకృష్ణ,
(రాజమహేంద్రవరం) ★

గమనిక

కార్టూన్ పోటీలో పాల్గొనగోరేవారు తగుమాత్రపు సైజు కాగితంపై ఇండియన్ ఇంకుతో కార్టూన్ వ్రాసి పంపాలి. క్రింద చిరునామా స్పష్టంగా వ్రాయాలి. చాలీచాలని కాగితాలపై పెన్సిల్‌తోను, కలంతోను వ్రాసే బొమ్మలు పోటీకి స్వీకరించడం లేదు.

—సంపాదకుడు.


వనితలకు వినతి

'వనితాలోకం' శీర్షికకు రచనలు పంపగోరేవారు కవరుపైన స్పష్టంగా 'వనితాలోకం శీర్షికకు' అని వ్రాయాలి. లేకపోతే అసంఖ్యాకంగా వచ్చే రచనలలో వనితల వ్యాసాలు విడతీయడం కష్టసాధ్యం.

వనితలు పంపే వ్యాసాలు తగుమాత్రపు పరిమితికి – అంటే అచ్చులో రెండు పేజీలకు మించకుండా ఉండాలి.

వ్రాసే రచన గానీ, చేసే సూచనగాని సమకాలీన సాంఘిక పరిస్థితులకు సంబంధించేదిగా ఉండాలి. ప్రయోజనాత్మకమైన వ్యాసాలకు ప్రాధాన్యంలభిస్తుంది.

కాగితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిన రచనలే అంగీకార పాత్రం కాగలవు. డిజైనులు, పంపేవారు అవి పావుతావు సైజు డ్రాయింగు పేపరుమీద ఇండియన్ ఇంకుతో వ్రాసి పంపవలెను. రచయిత్రుల చిరునామా లేని ఏ రచన ప్రచురణార్హం కాదు.



చిత్రకారుడు—సుసర్ల (గుంటూరు)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపుటము 55
సంచిక 21

1-2-61
బుధవారం

శార్వరి ఫాల్గుణ శుద్ధ విదియ

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
ఎస్. ఎ. టి. వారి 'సీతారామ కళ్యాణం'లో
బి. సరోజ

ముచ్చటైన ముఖచిత్రం!


1961 ఫిబ్రవరి 8వ తేదీ సంచికనుంచి "ఆంధ్ర సచిత్రవార పత్రిక" ముచ్చటైన ముఖచిత్రంతో పాఠకులకు అందుతుంది. తమ అభిమాన వారపత్రిక ఎప్పటికప్పుడు క్రొంగ్రొత్త అంశాలు సంతరించుకోవాలని పాఠకులు కోరడం సహజం. ఈకోరిక తీర్చ డానికి ఆసంచిక మొదలుకొని ముఖచిత్రాలు ఒక నూతనపద్ధతి ననుసరించి రూపొందించ నిశ్చయించాము. ఈ ఆకర్షణ పాఠకులఆదరాభిమానాలు ఇతోధికంగా చూరగొనగలదని విశ్వ సిస్తున్నాము.

—సంపాదకుడు.

వచ్చే వారం......

బలీయసీ కేవల మీశ్వరాజ్ఞా — కథ

మనం ఒకరింటికి వెళ్ళినా.... — వనితాలోకం



బుర్ర పరీక్ష
ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేయదలచిన వారి తెలివి తేటలు పరీక్షిస్తారు-
- వార్త -
ఏమి కలవిస్తారు డాక్టరుగారూ?
కాంగ్రెసు అభ్యర్థి కాదలచిన వారు
ఇలాగేటండీ నీరుపెట్టడం!
ప్రచారం
ప్రణాళిక
అది నా బొమ్మేనా!
ప్రణాళిక ప్రచారం
టోపీ చిత్రకళ
సహకార వ్యవసాయం అమలు అయ్యాక
మేనేజర్లు
పెద్ద భూస్వాములు
సన్నకారు రైతులు



తెలుగు వెలుగులు 69

పదిహేనేళ్ల నాటి ముచ్చట. పెదపూడిలో ఏర్పాటయిన సాహిత్య పాఠశాలలో ఆంధ్రదేశం నాలుగంచులనుంచి వచ్చిన పండిత వతంసులు దినమొకరుగా ఉపన్యసిస్తున్నారు. వారు మరచిన ప్రతి విషయాన్ని "అదా! అసలసలసలది" అంటూ తడుముకోకుండా అందిస్తూ, అందిస్తున్నట్టు చేతులు తిప్పుతూ, అందరికీ సంభ్రమాశ్చర్యాలు కలిగించేవారు ఒకరు; తమ ధారణాశక్తితో, సద్యస్స్ఫూర్తితో. ఆయన స్ఫురద్రూపమూ, సరళతర ప్రవర్తనా మరింతగా అందరినీ ఆకర్షించేవి. ఆయనే శ్రీ నిడదవోలు వేంకటరావుగారు.

విజయనగరంలో పట్టభద్రులైన తర్వాత, అప్పూ సప్పూ చేయక గడవని సంసారం, ఉక్కుతెరలమధ్య బ్యాంకులో ఉద్యోగం, నిత్యకృత్యాలకూడా నియమబద్ధమైన కాలపరిమితి, తండ్రి శ్రీ సుందరం పంతులుగారి "తాళిదళ సంపుట ప్రకరకాంతారం"లో నిర్నిద్ర పరిశ్రమ–ఈ విధంగా సాగింది కొంతకాలం ఈయన జీవితము, సాహిత్యజీవితమూను. ఈ నియమబద్ధతవల్లనే కాబోలు ఈయన ధారణ రాటుదేరి, ఏకసంతతోనే అన్ని విషయాలను మెదడులోని అరలలో చేర్చుకుని, అవసరమైనప్పుడు వెంటనే ప్రదర్శిస్తూ ఉంటుంది.

'నేనూ చదివాను'అన్నట్టు కాక కంటబడ్డ ప్రతివిషయమూ ఈయన ఒంటబట్టిపోతుంది. ఆయా గ్రంథాల ముద్రణాది వివరాలతో సహా ఏ విషయమైనా అడిగిందే తడవుగా చెప్పడంలో ఈయనకు ఈయనే సాటి. తీగ కదిలిస్తే డొంకంతా కదులుతుందంటారు–అది ఈయన ఎడ సార్థకం. ఒక్క పదాన్ని ప్రస్తావించండి: నన్నయ మొదలు నేటివరకు అన్ని గ్రంథాలలోని ఆ పదప్రయోగ సరళి నిర్ఝరపాతంగా పడవలసిందే; ఝుంఝుమారుతంగా వీచవలసిందే అందుకనే ఎవరో ఈయనను అన్నారు "ప్రయోగ మూషిక మార్జాల" అని. ఈయన తెలుగుసాహిత్యంలో చదివి మరచిందిలేదు; ఒడలు మరచి చదవంది లేదు. తెనుగుభాషలో ఏ మూల ఏముందో చూపగల జగాదీవిటీ ఈయన.

నలభైయేళ్ళ నాడు పరవస్తు రంగాచార్యుల ప్రశంసా పద్యాలతో ప్రారంభమైన ఈయన సారస్వతపరిశోధన, ధారణ బ్యాంకు ఉద్యోగం వదలిన పిదప సూర్యారాయాంధ్ర నిఘంటు కార్యాలయంలోను, తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయంలోను బహుముఖంగా విరిశాయి. ఈయన వీరశైవ వాఙ్మయం మథించారు; ఈ మతసాహిత్య ప్రాభవం వల్లనేనేమో ఈయన వాఙ్మాత్రంగా కాక, వాస్తవంగా సంఘసంస్కర్త అయ్యారు. ప్రాచీన గ్రంథ పరిష్కరణలో మానవల్లి, వేటూరి వార్లకు దీటు రాగలిగారు. తెలుగు కవుల చరిత్ర, దక్షిణాంధ్ర వాఙ్మయం, ఉదాహరణ వాఙ్మయం, వచన వాఙ్మయం మొదలైన ఉద్గ్రంథాలు రచించారు. ఇక వ్యాసాలు, పీఠికలు కొల్లలు. "తెలుగునుడుల బెడగు నడకలయొడికము వడి వడితనంబు నుడివోవని కూర్పుతో" మించుపల్లె కావ్యం సంతరించారు. ఈయన శబ్దరత్నాకరానికి చేర్చిన అనుబంధం అపారవైదుష్యానికి తార్కాణం.

నేటి పరిశోధన అంతా కళ్ళం ఊడ్చు వంటిది. ఏమిటి మహాపరిశ్రమ! వట్టిగుమాస్తా చాకిరి! మౌలికత ఏముంది?అని అనే వారు ఉన్నారు."ఏగతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరేగదా!" అన్నాడు చేమకూర వేంకటకవి; ఈలాటి వారిని గురించే. కాని, మౌలికతను మదింపు వేయడం కష్టం. అది ఎంత మోతాదులో ఉన్నా గొప్పే. శ్రీ వెంకటరావుగారి పరిశోధనలో ఈ మోతాదు చాల ఎక్కువంటే అతిశయోక్తి కాదు.

ప్రతి పదానికీ ప్రయోగం చూపి, ప్రామాణికమయిన గొప్ప నిఘంటువును, అదిన్నీ "అనుకూల సాధనసాహాయ్యసంపత్తి లభించిన ఒకే సంపుటమున పదునైదు వందలు లేక రెండు వేల పుటలతో" రచించి ఆంధ్ర మహాజనులకు అందజేయ గలనని ఈయన ప్రతిజ్ఞ. ఆలాంటి ప్రతిజ్ఞను ఈ "పరిశోధన పరమేశ్వరుడు" నెరవేర్చుకోగలడనడం నిస్సంశయం. ★

ఆమెజీవితమే ఆతనిపాట. ఆపాటే ఆమె జీవితం. ఆమె రహస్య హృదయ నిధి. నలుగురికీ ఎలా వినిపించగలదు?

నర్మద విశాల వినీల నేత్రాలు తెరిచి సారథివంక చిలిపిగా చూచింది.

ఆమెకళ్ళలోని కాంతులు ఆతని హృదయంలో కాంతులు వెదజల్లాయ్.

నర్మద పాడింది. అద్భుతంగా పాడింది. శ్రోతలు తన్మయు లయ్యారు. మంత్రరుద్ధ భుజంగాలకుమల్లే నిస్తబ్ధు లయ్యారు.

హాలంతా ఏదో తీయని మాధుర్యంతో నిండి పోయింది. నర్మద పాట ఆపి సభికుల కేసి చూసి చేతులు మోడ్చింది. కరతాళ ధ్వనులతో హాలు దద్దరిల్లిపోయింది. మళ్ళా నిశ్శబ్దం ఆవరించింది. హాలు బయట చూరుకింద మాధుర్యం భరించలేనట్లు, నిర్భరానందంతోనన్నట్లు పిచ్చుకలు కువకువ లాడాయి.

ఒక రిద్దరు కుర్రాళ్ళు వన్సుమోరని అరిచారు. సంగీతపు పోటీలు నిర్వహిస్తున్న పెద్దల మొహాలమీద చిరునవ్వు లంకురించాయ్. పోటీ సంఘపు కార్యదర్శి కులుకుతూ, వణుకుతూ లేచి నుంచున్నాడు. సభికుల రసికత్వానికి జోహారులర్పించాడు. పోటీదారులు ఒక పాటకంటె ఎక్కువ పాడడానికి వీలులేదనీ, వన్సుమోర్లు కాలాతీతానికి కారణమవుతాయనీ చెబుతూ మరో పోటీదారుపేరు పిలిచాడు. మళ్లీ ఎవరో పాడడానికి ఉపక్రమించాడు.

శ్రోతల గుంపులో సారథి కూచున్నాడు. నర్మద పాట చెవులకు ఇంకా వినవస్తోంది. అతని లోకంలో లేడు. నందనవనంలో గంధర్వకన్య పాట వింటున్నాడు. ఏమి పాట అది ? ఎంత గొప్పగా పాడింది ! ఏదో గానామృతస్రవంతిలో ఆతడు తలమునుకలయ్యాడు. మెత్తని, తెల్లని వెన్నెల ఆతనిని తాకింది మృదువుగా. తెల్లని తెరల లాంటి మబ్బులు మెత్తగా కావిలించుకున్నా. ఇదేదో విచిత్రానుభూతి. గంధర్వకన్య అరుణారుణాధరంతో ఆతని నిశ్శబ్దంగా మృదులంగా చుంబించింది. సుమధుర సుందర లోకానికి నర్మద శ్రోతల్ని ఆహ్వానించింది.

సారథి విట్టూర్చాడు.

సంగీతపోటీల కార్యక్రమం ముగిసింది. ఎవరో ఉపన్యాసచక్రవర్తి మాట్లాడుతున్నాడు. సంగీతమంటే అలా ఉండాలి, ఇలా ఉండాలి, అని తనకు తోచిన రీతిలో నిర్వచిస్తున్నాడు. తన హాస్యానికి తనే నవ్వుకుంటూ సభికుల్ని బోర్ చేశాడు. కుర్చీలో కూర్చుంటూ తనకు వేసిన పూలహారాన్ని తీసి భద్రంగా ఒడిలో పెట్టుకున్నాడు. అతని ప్రయోజకత్వానికి ప్రతిఫలం పూలహారం.

సారథి నవ్వుకున్నాడు.

ఫంక్షన్ ముగిసింది. బయటకి వచ్చాడు. ప్రతివాడూ నర్మదను మెచ్చుకుంటున్నాడు. ఒకరు లతా మంగేష్కరుతో పోలిస్తే మరొకరు జిక్కీతో పోల్చారు. విమర్శలు వింటూ పార్కువేపు వెళ్ల సాగాడు. నర్మద పాట ఇంకా ఆతని చెవుల్లో గింగురుమంటోంది.

"రాధికారాధికా
నావేణూదయగీతికా
నాగానామృతవీచికా"...

కృష్ణుడి వలపు పిలుపు.

నర్మద తనకు కొత్తకాదు. గుంటూరులో చదివేరోజుల్లో తన చెల్లెలి క్లాసుమేటు. అడపాదడపా తన చెల్లెలు రమ కోసం ఇంటికి వచ్చేది. కానీ అదేమిటో తను నర్మదను పలుకరించడానికి భిడియపడేవాడు. కళాకారులూ, కవులూ, గాయకులూ అంటే సారథికి చాల గౌరవం. అలాంటి వాళ్ల స్నేహంకోసం అతని హృదయం పరువులెత్తేది. నర్మద బాగా పాడగలదని అప్పుడే తనకు తెలుసు. తరువాత తెలిసిందల్లా స్కూలు ఫైనలు పాసై టీచరుశిక్షణ పొందడానికి వెళ్లిపోయిందని.

సారథి ఎం. ఏ. పాసయ్యాడు. జర్నలిజంలో శిక్షణపొంది కేంద్ర ప్రచారశాఖలో రిపోర్టరుగా చేరాడు. వెళ్లి జాయినయిన వారంరోజుల తరువాత నర్మదను మ్యూజిక్ హాలులో చూశాడు, మొదటిసారి. అప్పుడే ఆమెపాట వినటం జరిగింది. ఆ పాటే అతని హృదయంలో క్షీరసాగర మథనానికి కారణ మయింది. నర్మదను గురించిన ఏదో భావతరంగం తన మనోసాగరంలో వరవళ్ళు తొక్కింది.

పార్కులో ప్రవేశించాడు సారథి.

పూలపరిమళం ఆహ్వానిస్తోంది. లైటు వెలుగులో పచ్చని గడ్డి వింతగా మెరుస్తోంది. రేడియోలోంచి కమ్మని సంగీతం వినవస్తోంది. చల్లగాలి హాయిగా వీస్తోంది. పూలమొక్కల పక్కన సిమెంటుబెంచీమీద కూచుని సిగరెట్ ముట్టించాడు. పావుగంట నిశ్శబ్దంగా గడిచింది. రేడియో సంగీతం సారథి వినడంలేదు. మనస్సనే రేడియోలోంచి నర్మదపాట వినిపిస్తోంది.

పరధ్యానంగా కూచున్న సారథి భుజంమీద ఎవరో చేయివేశారు. ఉలికిపడి వెనక్కు తిరిగిచూశాడు. విష్ణుమూర్తి. కాలేజీలో చదివే రోజుల్లో తన క్లాసుమేటు.

"ఆలోచన లేమిటోయ్, హరిణలోచనా" అంటూ సారథి చేతిలోని సిగరెట్ ప్యాక్ అందుకున్నాడు. సిగరెట్ ముట్టించి పొగ గుప్పుమని వదులుతూ—

"ఇవ్వాళ పొద్దున్న వినిపించిన నాటిక రేడియో వాళ్లకి పంపావా" అన్నాడు మూర్తి.

"లేదు. కొంత మార్పు చేయాలి. నాయికా నాయకులు ఉద్యానవనంలో కాకుండా సముద్ర తీరంలో మొదటిసారి కలుసుకున్నట్లు. ఎంచేతంటే సముద్రపు హోరు విషాదవాతావరణ సృష్టికి సరిగ్గా సరిపోతుంది." ఆలోచిస్తూ అన్నాడు సారథి.

"కావొచ్చు. సాయంకాలం సముద్రపు ఒడ్డున కలుసుకోవడంకంటే ఉద్యానవనం సీనే బావుంటుంది. నీ ఇష్టం. నాటిక నీదిగా" అంటూ దూరాన గేటువేపు చూశాడు.

"అమ్మాయిలోయ్." వెన్నెముక నిటారుగా సాగించి కూచున్నాడు విష్ణుమూర్తి.

మూర్తి అవస్థ చూసి సారథి చిరునవ్వు నవ్వాడు. గేటువేపు చూశాడు. అతని గుండె జల్లుమంది. నర్మద, మరో అమ్మాయి— మూర్తి, తనూ కూచున్న వేపే వచ్చారు.

సారథి సర్దుకుని కూచున్నాడు.

అతనివేపు చూసింది నర్మద. కళ్లతో ప్రశ్నించింది. మూర్తిని చూసి ముందుకు వెళ్లిపోయింది.

వాన వచ్చి వెలసినట్లయింది. ఒక్క సారిగా విద్యుద్దీపాలు వెలిగి మళ్లీ ఆరిపోయినట్లయింది.

విష్ణుమూర్తి నవ్వాడు. కారణంలేని నవ్వు. సారథి అనుమానించాడు. చిరాకు, చిరుకోపం వచ్చాయ్.

"ఏమిటి నవ్వుతున్నావ్" అన్నాడు సారథి మొహం చిట్లించి, చిరాగ్గా.

"ఇప్పుడు వెళ్లిన అమ్మాయిని గురించే" అన్నాడు తాపీగా మూర్తి.

"ఎవరూ ? నర్మదా. చంపావ్ బాబూ. నీదృష్టి ఆ అమ్మాయిమీదకూడా పడింది కాబోలు. ఏమిటి విశేషాలు ?" క్యూరియాసిటీ, కుతూహలం. సారథి రెండు కళ్లల్లోనూ కనిపించాయ్ మూర్తికి.

"ఆ అమ్మాయిని గురించి బోలెడు విన్నాన్లే! పూర్తిగా రూమర్, వదంతి అని కొట్టి పారెయ్యడానికి వీలులేదు. పరిస్థితులలా ఉన్నయ్" సీరియస్‌గా మొహం పెట్టి అన్నాడు మూర్తి.

సారథికి అర్థమయింది. అపవాదు. నింద. స్కాండల్. అసహ్యం వేసింది.

ఆలోచించాడు. నర్మదది తన ఊరే కదా. తనకు తెలియని విశేషాలు మూర్తికేం తెలుసు ?

"నీ మొహం" అంటూ మూర్తివేపు చూసి లేచాడు. ఇద్దరూ హోటలువేపు బయలుదేరారు.

సిమెంటురోడ్డు మీదుగా వెళ్తూంటే పక్కనే ఉన్న గార్డెన్‌లోంచి పూల పరిమళంతో గాలి చల్లగా వీస్తోంది. చర్చి దాటారు. ఆడపిల్లల

జీవితగీతం

టి. రాఘవేంద్రరావు



హోస్టళ్ళు. ఏదో రణగొణధ్వని. సినిమా థియేటరు, బస్సు స్టాండు దాటి హోటల్‌లోకి ప్రవేశించారు. సారథి లోపలికెళ్ళి భోజనం చేసి వచ్చేదాకా బయట కూచున్నాడు మూర్తి, రేడియో వింటూ. భోజనం అయ్యాక సారథి, మూర్తి ఇంటికి బయలుదేరాడు. సారథి మనస్సులో నర్మదనుగురించి మూర్తి ఏమి చెబుతాడో వినాలని ఉంది.

మూర్తి సారథిని మేడమీద గదిలో కూచో బెట్టి భోజనం చెయ్యడానికి కిందకు దిగి వెళ్ళాడు.

గదిలో బాగా వేడిగా ఉంది. ఉక్కబోస్తోంది. కిటికీ తెరవాలన్న ఆలోచన కలుగలేదు సారథికి. ఏదో పుస్తకం చూస్తూ కూచున్నాడు. మనస్సు దోలా ఉంది. పేజీలు తిప్పుతూ ఉన్నాడు.

మూర్తి భోజనంచేసి పైకి వచ్చాడు. ఇద్దరూ గది బయటికి వచ్చి డాబామీద కుర్చీల్లో కూచున్నారు. విష్ణుమూర్తి చెప్పసాగాడు.

సారథి సిగరెట్ ముట్టించాడు.

"ఈ ఊళ్ళో ఒక యువజన సమాజం ఉంది. స్త్రీలుకూడా సభ్యులుగా ఉన్నారు. సమాజ స్థాపనలోని ఉద్దేశ్యం గ్రామాభ్యుదయానికి, పతిత స్త్రీజనోద్ధరణకు కృషి చెయ్యడం. సభ్యుల్లో ఒక లెక్చరరు ఉన్నాడు. అందమైనవాడు. సంగీత ధోరణీ, నటనా చాతుర్యమూ ఉన్నవాడు. మంచి వక్త. సమాజం నాటకాలు వేస్తే ఈ లెక్చరరు దర్శకత్వం వహిస్తాడు" విష్ణుమూర్తి గొంతు సవరించుకున్నాడు.

మరో సిగరెట్ ముట్టించి "అసలు విషయం ఏమిటంటే నర్మదకు, ఆ లెక్చరరుకూ మధ్య ఏదో వ్యవహారం నడుస్తోందన్న వదంతి" అని ముగించి ఊరుకోలేదు అంతటితో మూర్తి.

"ప్రేమ వ్యవహారంరోయ్. అదే అయి ఉంటుంది." అని తేల్చి చెప్పాడు న్యాయమూర్తి భోజులో, ఈ రహస్యం లోకోద్ధరణకోసం చెబుతున్నట్లు.

సారథి మనస్సు చివుక్కుమంది.

ఎంత తేలిగ్గా మనుష్యుల శీలంమీద దుమ్మెత్తి పోస్తోంది లోకం ? అది వాళ్ళ హృదయాలలో రేపే మానని గాయాలనుగురించి ఆలోచించదు.

విష్ణుమూర్తి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు తనరూముకు, ఆ చీకట్లో సారథి.

* * *

రోజులు దొర్లుతున్నయ్.

ఆఫీసుపనుల్లో నిమగ్నుడయ్యాడు సారథి.

ఓ రోజు ఉదయం సారథి ఆఫీసులో ఉండగా కృష్ణమూర్తిగారు ఫోనుచేశారు.. సాయంత్రం తనను కలుసుకోమని. కృష్ణమూర్తిగారు బెజవాడనుంచి వచ్చారు. వారికి ముడిఇనుము వ్యాపారంలో పెద్ద వాటా ఉంది. సారథిని చూడాలని వారి కోరిక. సారథి నాన్నగారూ, కృష్ణమూర్తిగారూ బాల్యస్నేహితులు.

ఆ సాయంత్రం సారథి కృష్ణమూర్తిగారిని కలుసుకున్నాడు. ఆప్యాయంగా పలుకరించి హోటలుకు తీసుకెళ్ళాడు.

జీవితగీతం

"శేషాచలపతి కూతురు నర్మద ఈ ఊళ్ళో ట్రెయినింగ్ చదువుతోందిట. నీకు తెలుసా" అన్నారు కృష్ణమూర్తిగారు, కాఫీ త్రాగుతూ.

సారథి మనస్సాగరంలో మధుర భావ తరంగాలు ఉవ్వెత్తుగా లేచింది. కాఫీకప్పు టేబుల్‌మీద పెడుతూ సర్దుకుని కూచున్నాడు.

"ఓసారి చూశాను" అన్నాడు, పైకి ఏమీ ఇంటరెస్టు లేనివాడల్లే.

"ఆ అమ్మాయిని చూడాలోయ్. లేకపోతే శేషాచలపతి బాధపడతాడు. నా దగ్గర ఆ అమ్మాయి అడ్రసు కూడా ఉంది" అన్నారు కృష్ణమూర్తిగారు.

నర్మద పరిచయం కావాలని సారథి మనస్సు గాఢంగా వాంఛిస్తోంది. తీరా కృష్ణమూర్తిగారు వెళ్దామన్నాక సారథి మనస్సు వెనుకంజ వేసింది.

> ఉపాధ్యాయుడు—ఒరేయి కొండన్నా నూనె అంటే హిందీలో ఏమంటార్రా ?
>
> కొండన్న—తేల్ సార్.
>
> ఉపా—రామూ, నెయ్యిని ఏమంటార్రా ?
>
> రాము—పాము సార్.
>
> వై. సూర్యనారాయణరెడ్డి (గుత్తి)

ఎలా పలుకరించాలి ? ఏముంది మాట్లాడడానికి ? అతని హృదయంలో ఎన్నో ప్రశ్న లుదయించినై.

తన మనస్సులోని ఆందోళనను పైకి కనపడనివ్వకుండా కృష్ణమూర్తిగారిని అనుసరించాడు సారథి. అవ్యక్తానందం ఏదో అతని మనస్సును అలలు, అలలుగా ఆవరించుకుంది.

నర్మద యింటిని సమీపించారు. సారథి గుండె వేగంగా కొట్టుకొంటోంది. కొన్నిరోజుల క్రితం మ్యూజిక్‌హాల్లో నర్మద పాడిన పాట జ్ఞాపకానికి వచ్చింది.

వాకిట్లో ఇద్దరినీ చూసి ఆశ్చర్యపోయింది నర్మద. కుర్చీలో కూచుని పేపరు చూస్తోందల్లా లేచి దగ్గరగా వెళ్ళి ఆహ్వానించింది.

కూచోడానికి కుర్చీలు చూపించి లోపలకెళ్ళింది. మరో రెండు నిమిషాల్లో ఫ్లాస్కులోని కాఫీ రెండు కప్పుల్లో తీసుకువచ్చి ఇద్దరికీ చేరో కప్పు అందించింది.

కాఫీ త్రాగుతూ కుశల ప్రశ్నలు వేశారు కృష్ణమూర్తిగారు. సమాధానాలు చెబుతూ అప్పుడప్పుడు సారథివేపు చూస్తూ నుంచుంది నర్మద. సారథి ఇబ్బందిపడసాగాడు, ఆమెతో సంభాషణ ఎలా మొదలుపెట్టాలో తెలీక.

ముందు నర్మదే పలుకరించింది.

"రమ ఎలా ఉందండీ ?" సారథివేపు చూసింది. ఆమెకళ్ళు వింతగా మెరిశాయ్.

"బావుంది" ముక్తసరిగా అన్నాడు సారథి. తన సంభాషణ తనకే అసహజంగా తోచింది. ఏదో ఆత్మీయత లోపించింది.

నర్మద కృష్ణమూర్తిగారితో మాట్లాడే సమయాల్లో ఆమెవేపు దీక్షగా చూస్తూ కూచున్నాడు సారథి. అంత దగ్గరగా ఇదివరకెప్పుడూ ఆమెను చూడలేదు.

తెల్లని జార్జెటుచీర కట్టుకుంది. నల్లని షిఫాన్ చోళీ వేసుకుంది. ఎర్రగా, సన్నగా, నాజూగ్గా ఉంది నర్మద. నల్లని నొక్కుల జుట్టు, వింతకాంతితో మెరిసే కళ్ళు సారథిని సన్నిటి జలకమాడించినై. విస్తుపోయాడు. ఆమె చుట్టూ ఏదో వింత కాంతిని చూశాడు. ఆ కాంతి పుంజంమధ్య ఊర్వశిలా మెరుస్తోంది. బేలూరు దేవాలయంలో తను చూసిన మదనిక అని పిలువబడే శిలాబాలిక జ్ఞాపకానికివచ్చింది. ఆమెను చూస్తూ వేసవికాలంలో హంపీ దగ్గర తుంగభద్ర చల్లని నీళ్ళల్లో స్నానం చేస్తున్న వాడికి మళ్ళీ ఆహ్లాదకరంగా ఫీలయ్యాడు సారథి.

వెళ్ళడానికి లేచారు కృష్ణమూర్తిగారు. సారథికి కాస్సేపు ఉండాలని ఉంది. విధిలేక లేచాడు. వాకిటిదాకా వస్తూ సెలవు తీసుకుంది నర్మద.

సారథివేపు చూసి "మరోసారి ఎప్పుడేనా తీరిక ఉంటే రండి" అంటూ అతని కళ్ళల్లోకి చూసి చప్పున కళ్ళు కిందకు వాల్చింది.

"అలాగే" అంటూ కృష్ణమూర్తిగారితో కలిసి బయటికి వచ్చాడు. సెలవుతీసుకుని రూముకేసి వెళ్ళాడు సారథి.

* * *

ఆరోజు మొదలుకొని హోటల్లో, పార్కులో ఎక్కడ రేడియోలో సంగీతంవిన్నా నర్మద జ్ఞాపకానికి వస్తోంది. రోజులు గడుస్తున్నయ్. ప్రచార శాఖలో ఉద్యోగమూ, కథలూ, నాటికలు రాయడమూ, ఇలా గడుపుతున్నాడు సారథి కాలాన్ని.

ఆరోజు ఆదివారం ఉదయంలేచి స్నానం ముగించి హోటలుకు బయలుదేరాడు. కాఫీ త్రాగుతూ కూచున్నాడు. హఠాత్తుగా నర్మద తాలూకు జ్ఞాపకాలు అతని మనస్సు నాక్రమించుకున్నై. నిరుత్సాహపడ్డాడు సారథి. విష్ణుమూర్తి చెప్పిన విషయాలు అతని హృదయాన్ని కెలుకుతున్నై. బాధపడ్డాడు. ఆ నిందను ఎలా నమ్మటం ? ఆరోజు తను చూసిన నర్మదరూపం కళ్ళముందు మెదిలింది. ఎవరో గొప్పశిల్పి చెక్కిన పాలరాతివిగ్రహంలా సౌందర్యాన్ని, కాంతినీ విరజిమ్ముతూ, అమాయకంగా నుంచున్న నర్మద జాలిగా తన వేపు చూసినట్లు ఫీలయ్యాడు.

వీలయినప్పుడల్లా తన ఇంటికేసి వస్తుండమని ఆహ్వానించింది ఆరోజు నర్మద. అది తలుచుకుని ఉత్తేజితుడయ్యాడు.

(61-వ పేజీ చూడండి)



జూల్స్ వెర్న్ నవల

౮౦ రోజులలో భూప్రదక్షిణం

(గతవారం తరువాయి)

రైలు వేళకే బయలుదేరింది. ప్రయాణికులలో చాలమంది ఉద్యోగు లున్నారు. సైనికోద్యోగులు, ప్రభుత్వోద్యోగులు కూడా. నల్లమందు, నీలిమందు వగైరాల వర్తకు లున్నారు. తూర్పుసీమవా రందరికీ వర్తక వ్యాపారా లున్నాయి.

పాస్పార్తు, తన యజమాని ఎక్కిన పెట్టెలోనే ఎక్కి బుద్ధిగా ఓమూల కూర్చున్నాడు. అందులో వీ రిద్దరూ కాక మరో పెద్దమనిషి ఉన్నాడు. వీరికి ఎదురుగా అవతల చివర కూర్చున్నాడు. ఆయన బ్రిగేడియర్ జనరల్ సర్ ఫ్రాన్సిస్ క్రోమార్టీ. వీళ్లకి క్రొత్తేమీకాదు. సూయజు నుంచి బొంబాయి వరకూ ప్రయాణంలో ఫిలియాస్ ఫాగ్‌తో పట్టువిడవకుండా పేకాడిన ముగ్గురిలోనూ ఈయన ఒకడు. బెనారస్ దగ్గర ఉన్న తన సైనిక కేంద్రానికి వెళ్తున్నాడు.

సర్ ఫ్రాన్సిస్ మంచి పొడగరి. పచ్చని శరీరం. వయస్సు యాభై ఉంటుంది. సిపాయిల తిరుగుబాటు సమయంలో సమర్థంగా వ్యవహరించి మంచి పేరు తెచ్చుకున్నాడు. ఆయనను భారతదేశీయుడే అనవచ్చును. జ్ఞానం వచ్చిన నాటినుండీ ఇక్కడే ఉంటున్నాడు. స్వదేశం చుట్టపు చూపుగా వెళ్ళిరావడమే తప్ప ఈ దేశమే ఆయనకు స్వదేశం అయిపోయింది. ఇక్కడి ప్రజల జీవన విధానాలూ, ఆచారవ్యవహారాలూ, చరిత్ర, కథలు, గాథలూ, దేశ స్వరూప స్వభావాలూ మొదలైనవన్నీ సర్ ఫ్రాన్సిస్‌కు బాగా తెలుసును. వాటిగురించి ఫిలియాస్ ఫాగ్ ముచ్చటపడి అడిగేవాడయితే, ఈయన అంతకన్నా ముచ్చటగా చెప్పేవాడే. కాని, ఫాగ్ అలా అడిగే తరహావాడు కాడు. దేశాటనలు చేసే ప్రయాణికుల సరదా, ఆ ధోరణి లేవు. అసలు ఫిలియాస్‌ఫాగ్ చేస్తున్నది ప్రయాణం కాదు. భూమి అనే గోళం చుట్టూ ఒక చక్రం చుట్టడం. ఈ ప్రయాణంలో అతను ప్రయాణికుడు కాడు. భూగోళం చుట్టూ పరిభ్రమిస్తున్న ఒక ఉపగ్రహం. ఆ గ్రహాన్ని ఒక మార్గంలో నడిపే సూత్రాలు ఎంత శాస్త్రీయ మైనవో ఈ 'గ్రహా' న్ని ఈ మార్గంలో నడుపుతున్నవీ, అంత శాస్త్రీయ మైనవీ, సహేతుక మైనవీను.

అనువాదం:

ఎస్. పార్థసారథి

ఫిలియాస్ ఫాగ్ లెక్కలు వేస్తున్నాడు మనసులో. లండన్‌నుంచి బయల్దేరిన తరువాత ఇప్పటికి ఎన్ని గంటలు ఖర్చయినట్లు అని చూసుకుంటున్నాడు. ఫలితం తేలిన తరువాత అతనికి సంతోషం కలిగింది. ప్రయోజనం లేని పనులు చేసేరకం మనిషి అయితే ఆ క్షణంలో అతను ఉత్సాహంగా చేతులు రుద్దుకుని నవ్వేవాడే.

కాని అలాటివాడు కాడు. కాదని, ఎదురుగా కూర్చుని అతన్ని చూస్తున్న సర్ ఫ్రాన్సిస్ కోమర్టీకి కూడా తెలుసు. ఈ మనిషితో విశిష్టత—లేదా విలక్షణత, ఇతని స్వభావం ఆయనకు బాగా బోధపడిపోయింది. ఉన్న పరిచయం పేకాట దగ్గరే అయినా. ఎక్కడా తొణుకూ, బెణుకూ లేకుండా ఆనందం, విచారం లేకుండా, చిరునవ్వు, నిట్టూర్పు లేకుండా అంత స్థిమితంగా, కుదురుగా కూర్చొని ఆడినవాడిని సర్ ఫ్రాన్సిస్ ఎక్కడా చూడలేదు. పోతపోసిన విగ్రహంలా ఉన్న ఈ మనిషిలో హృదయం నిజంగా కొట్టుకొంటోందా ? కన్నార్పకుండా, నవ్వకుండా, చలనం లేకుండా కూర్చున్న ఈ వ్యక్తిలో ప్రకృతి సౌందర్యాన్ని చూచి ఆనందించగల శక్తి, ఆసక్తి ఉన్నాయా ? ఆశయాలూ, ఆదర్శాలూ అనే వాటి పట్ల ధ్యాస ఉండి ఉంటుందా ? ఏమో. సర్ ఫ్రాన్సిస్‌కు నమ్మకం కుదరటంలేదు. ఆయన వింత వ్యక్తులను ఎందరినో చూశాడు గాని మనిషిగా చెలామణి అవుతున్న ఇంత వింతశాలీ, ఇలాటి విద్వారం ఎక్కడా తటస్థపడలేదు. ఇంతగా కొరుకుడు పడని ఆసామి ఎక్కడా ఉండడు. అయితే కొరుకుడు పడకపోవడానికి, ఫాగ్ గుట్టుగా ఉంటుందేమీ లేదు. తాను భూ ప్రదక్షిణం చేస్తున్నట్టు చెప్పాడు. ఏ పరిస్థితులలో, ఏ కారణాలవల్ల తాను ఈ ఉద్యమం ఆరంభించిందీ కూడా వెల్లడి చేశాడు. కాని సర్ ఫ్రాన్సిస్ క్రోమార్టీకి ఇది వట్టి పనికిమాలిన వింత పనిగా కనపడింది. వింతకీ కూడా ఆవంతేనా ప్రయోజనం ఉండాలి. సబబు తెలిసి నడుచుకునే ఏ మనిషైనా ఏదో ఒక లక్ష్యం ప్రయోజనం లేకుండా ఏ పనీ చెయ్యడు. ఇందులో సబబేమిటో, లక్ష్యం ఏదో సర్ ఫ్రాన్సిస్‌కు బోధపడలేదు. ఫాగ్ ప్రయాణం దాని వరసా, చూడగా అందువల్ల అతనికి గాని, మరెవరికి గాని, ఏమాత్రం ప్రయోజనం చేకూరేలా తోచలేదు.

80 రోజులలో భూ ప్రదక్షిణం

బొంబాయి వదలిన ఒక గంట తరవాత రైలు సాల్సెట్ దీవి దాటి, ప్రధాన భూభాగం ప్రవేశించింది. కళ్యాణ్ స్టేషను తరువాత ఖండ్లా పూనాల మీదుగా ఆగ్నేయ భారతానికి పోయే దారిని వదలివేసింది. నెమ్మదిగా పడమటి కనుమల గంద్రగోళంలో జారబడి రాళ్లను దొలిచి తీసిన గుహలలో చీకటిని దొలుచుకుంటూ పోతోంది.

సర్ ఫ్రాన్సిస్, ఫిలియాస్‌ఫాగ్ ఉండుండి ఒకటో అరో పలుకాడుకుంటున్నారు. కాని చర్చ అనర్గళంగా సాగటంలేదు.

"ఇదే రెండు మూడేళ్ల క్రితం అయితే, ఇక్కడ ఎంత ఆలస్యం అయేదో తెలుసా? అసలు మీ యాత్రే దెబ్బతినే దన్నమాట" అన్నాడు సర్ ఫ్రాన్సిస్ క్రోమార్టి ఎక్కడో ఆగిపోయిన సంభాషణని తిరిగి ఆరంభించబోతూ.

"ఎంచేత?" అన్నాడు ఫాగ్.

"ఏముంది. రైలు ఈ పర్వతాల మొదలు దగ్గర ఆగిపోయేది. ఇక్కడ నించి పల్లకీయో, గుర్రమో ఎక్కి కొండ అవతలివాలు చేరుకుని ఖండ్లాలో మళ్లీ రైలెక్కాల్సి వచ్చేది."

"అలాటి జాప్యం వల్ల నా కార్యక్రమం భంగపడేది కాదు. అందుకు ముందుగానే జాగ్రత్త పడేవాడిని" అన్నాడు ఫాగ్.

"ఏం జాగ్రత్త పడతారు. మీవాడు ఇందాక చేసినలాటి ఓఘాయిత్యాలు ఇంకో రెండు చేస్తే మీపనేంగానూ?"

ఒంటినిండా ముసుగుదన్ని నిద్రపోతున్న పాస్పార్టుకి ఆ క్షణంలో కలలు ఏవి వచ్చాయో తెలీదు గాని, ఇప్పుడు తన గురించి చర్చ జరుగుతూందని మాత్రం కలగని ఉండడు.

"మీకు తెలుసో తెలీదో. ఇలా గుళ్లూ, గొప్ప

రాలూ, మతాలూ, మర్యాదలూ విషయంలో బ్రిటిష్ ప్రభుత్వం చాలా నిక్కచ్చిగా ఉంటుంది. వాటిని ఉల్లంఘిస్తే కఠినంగా దండిస్తుంది. మీవాడు గనక ఇందాక పట్టుబడి ఉంటే—"

"ఉంటే ఏమవుతుంది" అన్నాడు ఫాగ్. 'ఏముంది పట్టుబడితే ఏదో శిక్ష వేస్తారు. అదేదో అనుభవించి చల్లగా తిరిగి యూరప్ చేరుకొనేవాడు. అంతే అతని తప్పువల్ల అతని యజమాని ప్రయాణం ఎలా దెబ్బతింటుందో నాకు బోధపడలేదు."

చర్చ అక్కడితో సమాప్తమైంది.

రైలు ఆ రాత్రి కనుమలన్నీ దాటి నాసిక్ చేరి మర్నాడు—అక్టోబరు 21 న—తెల్లవారేసరికి ఖాందేష్‌లో మైదానాలకు అడ్డపడి పరుగెడుతోంది. విశాలమైన మైదానాలు, పచ్చని పంట పొలాలు కంటికి ఇంపుగా కనిపిస్తున్నాయి వాటిమధ్య చిన్న చిన్న పల్లెలు, వాటి మధ్య ఎత్తుగా ఠీవిగా గుడి గోపురాలు. దూరానికి అంతా ఇంగ్లీషు పల్లెటూరు. దాని మధ్య చర్చి గోపురంలాగే ఉన్నాయి. సారవంతమైన ఈ భూమిని సాగుచేయడానికి పుష్కలంగా నీరుంది అనేకమైన కాలువలు—చాలామటుకు గోదావరి ఉపనదులు, పాయలు—అంతటా ప్రవహించి సేవ చేస్తున్నాయి.

పాస్పార్తు హఠాత్తుగా నిద్రలేచి, కిటికీ లోంచి బయటికి చూసి గతుక్కుమన్నాడు. పుట్టిన ఇన్నాళ్లకి జి పి. రైల్వేవారి వాహనం ఒకటి ఎక్కి తాను హిందూ దేశానికి అడ్డపడి యాత్ర చేస్తున్నాడు. ఈ దేశంలో ప్రయాణం చేస్తున్నా, దేశాన్ని చూస్తున్నా ఇంకా అతనికి ఇదంతా నిజమని నమ్మకం కుదరటంలేదు. కలకాదని తోచటం లేదు. బాల్యంనించీ ఇండియా రావాలనికలలుగన్నమనిషి అని కాదు గాని, ఇలా రావలసి వస్తుందని అతను ఎప్పుడూ అనుకోలేదు. అయినా అనుకోనిది జరిగిపోతోంది. రైలు ఇంగ్లీషు దేశానిది. దాన్ని నడుపుతున్న వాడు ఇంగ్లీషు ఇంజనీరు, నడిపిస్తున్నది ఇంగ్లీషు రాక్షసిబొగ్గు. అయినా నడుస్తున్నది ఇండియాలో. పత్తి, కాఫీ, లవంగం, పోక తోటల మధ్యగా చకచక వెళ్లిపోతోంది. పొగ పురులు పోసుకుని, మెలితిరిగిపోతూ అటూ యిటూ ఉన్న తాటి తోపుల మీదికి పాకుతోంది. వాటి మధ్య, అటూ ఇటూ చూడచక్కని బంగళాలు కనిపిస్తున్నాయి. శిల్పకళా విభవాన్ని చాటే అద్భుతమైన ఆలయాలు మెరుస్తున్నాయి అక్కడక్కడ పాడుపడ్డ విహారాలు కనిపిస్తున్నాయి కనుచూపుమేర దాటి దిగంతాల వరకూ ఈ నేల పరుచుకున్నట్లుంది. దూరాన పచ్చగా చిక్కటి అడవులు కనిపిస్తున్నాయి పెద్దపులులకు, పాములకూ అవి నిలయాలు. వాటిని చూడాలనుకున్నవారు ఆట్టే సేపు వెతకక్కరలేదు. రైలు చప్పుడు అలవాటైన కాబోలు, పులు లిప్పుడు రైలు వెళ్లినా బెదరటంలేదు. అడుగడుగునా గజాలు కనబడే అడవులలో రైలు పోతోంది. తీరుబాటుగా ఉన్న ఏనుగులు, దూసుకుపోతున్న రైలుకేసి బద్ధకంగా పరధ్యానంతో చూస్తున్నాయి. ఇవి క్రూర జంతువులు తిరిగే అడవులే కాని, ఇంతకుముందు



నమస్సుమాలు

బృందావనం రంగాచార్యులు

నీలాలనింగి వన్నెలలో ప్రసన్నతా
　　భావసంపన్న వైభవము పొరల,
నెమలికన్నెల నాట్య నిగమ శుద్ధికి వలయు
　　ముస్తాబు హొయలు సొంపులు దలిర్ప,
బాలభాస్కరుని అందాల పందెమ్ములో
　　అరుణరోచుల మనోహరత విరియ,
లేడిపడుచుమేని లే గులాబులసొరు
　　తీగులో నవనవోద్దీప్తి మెరయ,
నయనములు మూయ దీర్ఘకైనను లభింప
కహరహమ్ము శ్రమించు దేవాధిదేవ!
ప్రకృతి కళ్యాణ శోభాపరంపరా ప్ర
వణాచణమ్మగు నీ మహత్త్వము నుతింతు.
పుడమి తొయ్యలికి గర్వారంపు దండగా
　　వెండివెన్నెల ప్రభవింపజేసి,
కొండకోనలను నొక్కులు నొక్కులుగ జారు
　　సెలయేటి తళుకు "బాసికము" గట్టి,
శ్యామల శాద్వల కోమల సీమల
　　కొమరొప్పు పట్టుపుట్టము లొసంగి,
నవకిసలయముల నమలిన కోకిల
　　గొంతు సన్నాయి బాకుల నమర్చి,
వధువునుం గని మురిసెడి వరుడ! విశ్వ
మంగళ మ్మాశ్రయముగ-సర్వాంగ సుంద
రముగ దిద్దిన భువన కళ్యాణ మండ
పమున దర్శన మిడెడి రూపము నుతింతు.

కవితాకింకిణి

బహుమతి పొందిన కవిత

గయం, మరింగా స్టేషను దాటాక రైలు నడిచిన కొంతభాగం ఇంతకన్నా ఘోరమైనది. కాళి భక్తుల బలులతో రక్తసిక్తమైన భూమి. అక్కడికి అనతిదూరంలోనే అపురూప చిత్ర శిల్పకళాలయాలయిన ఎల్లోరా గుహ లున్నాయి. అక్కడి నగరం ఔరంగాబాద్, ఒకప్పుడు ఔరంగజేబు రాజధాని. ప్రస్తుతం నిజాం రాజ్యంలోంచి విడిపడ్డ ఒక రాష్ట్రానికి ముఖ్యనగరం. ఈ ప్రాంతంలోనే థగ్గుల నాయకుడు ఫరంగీ ఒకప్పుడు అంతులేనన్ని ఘోరాలు చేశాడు. పిల్లా పాపా, ముసలీ ముతకా, ఆడా మొగా అన్నది లేకుండా ఘోరంగా వధించారు థగ్గులు. ఒక్క చుక్క రక్తం పడకుండా చంపడం వాళ్ల పద్ధతి. పీకలు నులిమి చంపి, పాతేసేవారు. ఊరికే కాస్త మట్టి పెళ్లగిస్తే శవం తగలని చోటుండేది కాదు. బ్రిటిష్ ప్రభుత్వం గట్టిగా ప్రయత్నించి చాలావరకూ ఈ ఘోరాలను తగ్గించ గలిగింది కాని, ఈ ముఠా యింకా మసులుతూనే ఉంది అక్కడా అక్కడా మరణకాండ సాగిస్తూనే ఉంది.

పన్నెండున్నర అయ్యేసరికి రైలు బర్హాంపూర్ చేరుకుంది. ఆగగానే పాస్పార్టు బయటి కురికి ముందర ఒక చెప్పుల జత కొనుక్కొన్నాడు బంగారం యిచ్చి. మాయ ముత్యాలు పోసి ముస్తాబూ చేసిన ఆ జోడు చూడ ముచ్చటగా గొప్పగా ఉంది. పాస్పార్టు కూడా పబ్లీకునే ముచ్చట పడిపోయాడు. మురిసిపోయాడు అవి తొడుక్కొని. ప్రయాణీకులు హడావుడిగా ఫలహారాలు కానిచ్చారు. రైలు బయల్దేరి తపతి ఒడ్డున ఒకసారిఆగి, తరవాత సరాసరి అసుర్ఘర్ చేరుకొంది.

పాస్పార్టు మెల్లిగా మారిపోయాడు. బొంబాయి చేరేవరకూ, యాత్రకి అదంగి అదే వని నమ్ముతూ వచ్చాడు గాని, ఇప్పుడు దేశం ఈ చివర్నించి ఆ చివరికి రైలూ, అందులో యజమానీ, ప్రక్కన తనూ పరుగెత్తడం జరుగుతూంది. పాస్పార్టు ధోరణి మారిపోయింది. ఇక లాభంలేదని భావం కలిగింది ఆ తరవాత హైలా వచ్చినుగా తిరిగే వయస్సులో, హైలా వచ్చినుగా తిరగాలనీ, దేశాలు చూడాలనీ కలిగే కోరికలు ఇప్పుడు ముంచుకుపోయినట్టు వచ్చి ముసురుకున్నాయి. యజమాని వేసిన పందెం నిజమేనని గురి కుదిరింది. ప్రపంచ యాత్ర నిజంగానే నిజమని నమ్మకం కలిగింది. దానికి గడువుందనీ, అది దాటరాదనీ బోధపడింది. ఆఖరికి ఆలస్యం అవుతుందేమో అన్న సందేహం, భయం ప్రవేశించేయి అతనిలో. యజమాని కాసిన పందెం డబ్బు చాలా పెద్ద మొత్తం. బొంబాయిలో నిన్న సాయంత్రం తను చేసిన ఓఘాయిత్యానికి— కాస్తలో ఎంతపని జరిగేది. ప్రయాణం అంతా గందరగోళం అయిపోయేది. పాస్పార్టు గుండె గుబ్బుమంది. అలాంటి భావాలు బయలుపడకుండా గుట్టుగా అణచుకోవడంలో యజమాని కున్న ప్రావీణ్యం లేదు నౌకరుకు. అందుకని అతని ముఖంలో కలవరం కనబడిపోయింది బయ

80 రోజుల్లో భూ ప్రదక్షిణం

టికి. బయల్దేరి ఎన్నాళ్లయిందో, ఇంకెన్నాళ్ళుందో ఒకటికి పదిసార్లు లెక్క వేసుకున్నాడు. ఈ పాడు రైలు ఇంత నెమ్మదిగా పాకుతోందేమి టనుకున్నాడు. ఈ రైలు ఇంజనీరుకి కూడా, త్వరగా బండి నడిపితే బహుమతి యిస్తానని యజమాని ఆశ పెట్టవలసింది. అలా చెయ్యనందుకు ఫాగ్ని తిట్టుకున్నాడు పాస్పార్టు. అతని తప్పేంలేదు. ఓడల్నా, రైళ్ళ చిత్తం వచ్చిన వేగంతో పోకూడదనీ, వీటికి నియమ నిబంధన లున్నాయనీ అతనికి తెలీదు.

సాయంకాలం అయేసరికి, ఖుందేల్ఖండ్, ఖాందేష్ల మధ్య ఉన్న సాత్పూరా పర్వత గుహలు ప్రవేశించింది రైలు.

మర్నాడు, సర్ ఫ్రాన్సిస్ క్రోమార్టీ, టైమెంతయిందని అడిగేసరికి, పాస్పార్టు తన జేబు గడియారం తీసి చూసి తెల్లవారుఝాము మూడు గంట లయిందన్నాడు—బారెడు పొద్దెక్కినా. పాస్పార్టు గడియారానికి గ్రీన్విచ్ దీర్ఘాంశం అంటే గురి ఎక్కువ. చిన్నప్పటి నుంచి దాని మాట చొప్పునే నడుస్తోంది. గ్రీన్విచ్ వదిలి తూర్పుకు 77 డిగ్రీల దూరం వచ్చేసినా పాస్పార్టు గ్రీన్విచ్ని వదులుకోలేదు. అతనికి విశ్వాసం ఉంది. గ్రీన్విచ్కి ద్రోహం చెయ్యడు.

జరిగిన కథ

లండన్ రిఫారం క్లబ్ సభ్యుడు ఫిలియాస్ ఫాగ్ 80 రోజులలో భూ ప్రదక్షిణం సాధ్యమేనని 20 వేల పౌండ్లు పందెం కాసి, ఆ రోజు రాత్రే తన సేవకుడు పాస్పార్టూను వెంట తీసుకొని భూప్రదక్షిణానికి బయలు దేరుతాడు. ప్రయాణం ప్రారంభమైన ఏడవరోజున సూయజ్ నుంచి డిటెక్టివ్ ఫిక్స్ బ్యాంకు దొంగ ఫాగ్ దొరికాడనీ, అతనిని అరెస్టు చేయడానికి వెంటనే బొంబాయికి ఒక వారంటు పంపమనీ లండన్కు టెలిగ్రాం ఇస్తాడు. ఫాగ్ బొంబాయి చేరుకుంటాడు. వెంటవచ్చిన డిటెక్టివ్ ఫిక్స్ పోలీసు కమీషనర్ కార్యాలయానికి వెళ్ళి ఫాగ్ను అరెస్టుచేయడానికి వారెంటు వచ్చిందేమో విచారిస్తాడు. రాలేదని అక్కడివారు చెప్పేసరికి తెల్లబోతాడు. ఆరాత్రే ఫాగ్ బొంబాయి నుంచి కలకత్తాకు రైలులో ప్రయాణమవుతాడు.

సర్ ఫ్రాన్సిస్కి ఇలాటి లలిత భావాలు లేవు. నీ టైము తప్పు అన్నాడు. ఇదేం కొత్త కాదు. వెనకోసారి డిటెక్టివ్ ఫిక్స్ కూడా ఈ మాటే అన్నాడు తన గడియారాన్ని. సర్ ఫ్రాన్సిస్ ఒకమాట అని వూరుకోలేదు. నచ్చజెప్పబోయాడు తన వాదాన్ని. అక్షాంశం మారినప్పుడల్లా గడియారంలో ముల్లు తిప్పి టైం సర్దుకోవాలిట. మనం ఇప్పుడు తూర్పు వేపుగా, సూర్యుడికి అభిముఖంగా ప్రయాణం చేస్తున్నాం కాబట్టి రోజులు రానురాను కురచబారుతాయట. ఎన్ని డిగ్రీలు దాటి వస్తే అన్ని నాలుగేసేసి నిముషాల చొప్పున తగ్గుతాయట. ఇప్పుడు 77 డిగ్రీల దూరం వచ్చారు కాబట్టి గ్రీన్విచ్ టైము 5 గంటల 8 నిముషాలు వెనకబడి ఉండాలి. సరిగ్గా పాస్పార్టు గడియారం అలాగే ఉంది .....

పాస్పార్టు మొండి ఘటం. ఇలాటి మాయదారి కబుర్లకి మోసపోడు. అసలు అతనికి సర్ ఫ్రాన్సిస్ మాటలు బోధపడి ఉండకపోవచ్చు. పడ్డా మానినా ఇలా ఘడి ఘడికీ గడియారంలో టైం మార్చడం అతనికి సుతరామూ గిట్టదు. లండన్ టైమంటే లండన్ టైమే. ఇది పిచ్చి, చాదస్తం కావచ్చు కాని ఎవరికీ హాని చెయ్యదు.

రోథాల్ చేరడానికి ఇంకో పావుగంట పడుతుందనగా—ఉదయం ఎనిమిది గంటలవేళ, రైలు నడుస్తూ ఒక అడవి చివరదాకా వచ్చి దారి తోచనిదానిలా ఆగి నిలబడిపోయింది. అవతలి చివర దూరంగా బంగళాలు, పనివారి గుడిసెలూ కనిపిస్తున్నాయి. అంతట రైలు కండక్టరు పెట్టె పెట్టె దగ్గర కొచ్చి ఇక్కడంతా దిగిపోవాలి అని కేకలేసి పోతున్నాడు.

ఫిలియాస్ ఫాగ్కి ఈ మాటల అర్థం తెలిసినా తాత్పర్యం బోధపడలేదు. సర్ ఫ్రాన్సిస్ క్రోమార్టీ వేపు చూశాడు ప్రశ్నార్థకంగా. ఆయన ఆశ్చర్యార్థం ప్రకటించాడు. ఈ చింతతోపు మధ్య రైలు ఎందుకు ఆగాలో, తా మెందుకు దిగాలో ఆయనకే తెలియలేదు. పాస్పార్టుకు వీళ్లిద్దరి ఆశ్చర్యం కలిపినంత ఖంగారు పుట్టింది. రైలులోంచి క్రిందికి దూకి ముందుకు పరుగెత్తాడు. వెళ్లినంత వేగంగానూ తిరిగి వచ్చేశాడు.

"ఇంక రైల్వే లేదండి" అన్నాడు ఒగురుస్తూ.

"అదేమిటి" అన్నాడు సర్ ఫ్రాన్సిస్.

"అదేనండి. రైలింక ముందుకు వెళ్లదు."

బ్రిగేడియర్ జనరల్ సర్ ఫ్రాన్సిస్ క్రోమార్టీ రైలు దిగాడు. అతని వెనక తాపీగా ఫిలియాస్ ఫాగ్ కూడా శకటావరోహణం చేశాడు. ఇద్దరూ వెళ్లి కండక్టరుతో మాట్లాడారు.

అయితే మనం ఇప్పు డెక్కడున్నట్టు ?" అన్నాడు సర్ ఫ్రాన్సిస్.

"ఖోల్బి గూడెం దగ్గర" అన్నాడు కండక్టరు.

"ఇక్కడే ఆగిపోతుందన్నమాట ."

"నిస్సందేహంగా. రైలుదారి పూర్తి కాలేదుగా"

"ఏమిటీ ! దారి పూర్తిగా లేదా ?"

(52 వ పేజీ చూడండి)


'80 రోజులలో భూప్రదక్షిణం'



జనవరి 20 న అమెరికా అధ్యక్ష పదవి స్వీకరించిన
శ్రీ జాన్ ఫిట్‌జిరాల్డ్ కెన్నెడీ, దేశాంగశాఖ మంత్రి శ్రీ స్టూవర్ట్ యుడాల్

న్యూ ఢిల్లీ లేఖ — **శ్రీ కృష్ణ**

ప్రణాళికా సంఘంమీద ముఖ్యమంత్రుల తిరుగుబాటు: ఢిల్లీలో గూఢచారుల వేట

రాజధానిలో ఈ వారం జాతీయ అభివృద్ధి మండలి వ్యవహారాలు ప్రముఖస్థానం ఆక్రమించాయి. ప్రణాళికాసంఘసభ్యులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ మండలిలో సభ్యులు. ఇప్పుడిది కేవలం కాంగ్రెసుపార్టీకి అనుబంధ సంస్థగా ఉన్నది కాని, జాతీయ సంస్థగా లేదు.

తృతీయపంచవర్ష ప్రణాళికకు తుది రూపం ఇచ్చేందుకుగాను ఈమండలి సమావేశం ఏర్పాటైంది. ప్రభుత్వ రంగంలో రు. 7290 కోట్లు, వాణిజ్య రంగంలో రు 4000 కోట్లు ఖర్చు చేయాలని ముసాయిదా ప్రణాళికలో నిర్ణయించారు ప్రభుత్వ రంగానికి కేటాయించినమొత్తంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రస్తుత ఖర్చులకు సుమారు రు 1050 కోట్లు పోగా, రు. 6,200 కోట్లు పెట్టుబడులకు మిగులుతుందని అంచనా. ఆర్థిక శాస్త్ర పండితుల సలహాలను త్రోసిపుచ్చి ఈ కేటాయింపులు చేయడం జరిగింది.

భారతీయప్రజాస్వామ్యం విచిత్రమైనది కాబట్టి, ప్రజాస్వామ్యంలో తుది నిర్ణయం అంటూ ఉండదు కాబట్టి, ఆర్థిక శాస్త్ర పండితులు తమ వైఖరిని సవరించుకొని, ప్రభుత్వ రంగానికి కేటాయించిన మొత్తాన్ని రు. 7500 కోట్లకు పెంచడానికి అంగీకరించారు.

ఇప్పుడు కొన్ని ఇతర విషయాలను ప్రస్తావించక తప్పదు. కాంగ్రెసుపార్టీ ఎన్నికల ప్రచారానికి వినియోగించుకోదలచిన అంశాలు నాలుగు. (1) తృతీయపంచవర్ష ప్రణాళిక, (2) ఎన్నికల ముందు ఏర్పాటయ్యే పరిశ్రమల ప్రదర్శనం, (3) పంచాయితీరాజ్యం, (4) గ్రామాలలో నిరుద్యోగ నివారణకు తోడ్పడే ప్రయోగాత్మక పథకాలు.

ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొంటే మళ్లీ అధికారంలోకి రావాలని కేంద్ర మంత్రుల, ఎంతగా ఆదుర్దా పడుతున్నారో, రాష్ట్రాల ముఖ్యమంత్రులుకూడా అంతగానే ఆదుర్దా పడుతున్నారన్న సంగతి స్పష్టమవుతుంది. తమ

(51 వ పేజీ చూడండి)



ఇదీ ఓ కథే!

రావి కొండలరావు

ఓ చేత్తో చిన్న ట్రంకు సూట్‌కేసూ, రెండో చేతిలో "జిప్"గల చేతిసంచీ పట్టుకుని, ఆదరాబాదరా స్టేషన్‌లో పడి, టిక్కెట్టుకు డబ్బిచ్చి, నోటితో టిక్కెట్టు తీసుకుని, చిల్లర అక్కడే మరిచిపోయి, రైలుకూత విని ప్లాటుఫారం మీదకు పరుగెత్తి ఎదురుగా ఏందొరికితే అది ఎక్కేద్దామనే ప్రయత్నంలో కదిలిపోతున్న రైలు బండిలో ప్రాణాలుగ్గబట్టుకుని దూరి— "అమ్మయ్య" అనుకున్నాడు జగన్మోహనరావు. రైలు చప్పుడులో అతని గుండెలు చేస్తున్న రొద వినిపించలేదు. రన్నింగ్ రేసులో ప్రైజ్ కోసం తంటాలుపడ్డవాడు పడినట్టుగా రొప్పసాగాడు. నెమ్మదిగా పెట్టె కిందపెట్టి, దానిమీద సంచీ పెట్టి చేతులు దులుపుకుని ఇంకాస్త తేలిగ్గా "అమ్మయ్య" అనుకున్నాడు రెండోసారి. బండి ప్లాటుఫారం వదిలేస్తున్నది. తలుపు దగ్గరనుంచుని రెండుకడ్డీలూ పట్టుకుని ముందు వెనకల్లో రైలు ఎంత పొడుగుందోనని వంగి చూడటంలో అతని దృష్టి—పెట్టె మీదున్న "రెండు" అంకెమీదా, ఆవెంటనే 'ఆడబొమ్మ'మీదా పడ్డది.

'అమ్మయ్యో' అన్నాడు ఈసారి. జోరు తగ్గించిన అతని హృదయ శకటం మళ్ళీ స్పీడెక్కింది. వెనక్కి తిరిగి పెట్టెలో చూడటానికి మోహనరావుకు ధైర్యం చాలలేదు. 'భగవంతుడా, వొచ్చి వొచ్చి ఇందులో పడ్డానా!' అనుకున్నాడు. ఇది రెండో తరగతి పెట్టె— తను మూడో తరగతి మనిషి. పైగా ఆడవాళ్ళ పెట్టె. తను మగాడు! ఈ అబలలంతా వెనకనే వొచ్చి తనను క్రిందికి తోసెయ్యకూడదా! తనను ఏ దొంగగానో భావించి, గొలుసు లాగి బండి ఆపరుగదా! కాకపోయినా గార్డు గాని తొంపదీసి ఇటు పక్క చూసి, 'ఇదెవడ్రా స్త్రీల పెట్టెలో పురుషుడూ' అని ఆశ్చర్యపోయి పోలీసులకు వప్పజెప్పడుగదా! బయటకు కనిపించకుండా లోపలకు పోవటానికా ధైర్యం లేదు. ఇక్కడనించుని ఇటే చూస్తూ వుండటానికా అంతకన్నా ధైర్యంలేదు! 'ఇంత అవస్థపడీ నేను పరుగెత్తుకొచ్చి బండిలో పడ్డానని సంతోషిస్తే వల్లి వెళ్ళి పులినోట్లో పడ్డట్టయిందే నా బ్రతుకు! ఇదేం ప్రయాణమోయ్ బ్రహ్మన్నా' అనుకున్నాడు.

మోహనరావుకు మరోభయం పట్టుకున్నది. ఇంత సేపాయి తను ఈ పెట్టెలో ఎక్కి నించున్నాడుగదా లోపలున్న ఒక్కరూ తనను పట్టించుకోలేదే? కాకపోయినా లోపల మనుషులున్న అలికిడి ఏమాత్రం వినిపించడం లేదేం? ఒక వేళ ఇది ఖాళీ పెట్టె కాబోలు—ఐతే

ఇంకే—అంతే తను వెళ్ళి బూర్లగంపలో పడ్డాడన్నమాట. కొంపదీసి, ఈ డిటెక్టివ్ పుస్తకాల్లో చెప్పినట్టు ఏ స్త్రీ శవమున్నా... మోహనరావుకు భయం పట్టుకున్నది. కాస్సేపటికి ఏమయితే కానిమ్మని నెమ్మదిగా తల వెనక్కు తిప్పి పెట్టెలో కలయజూశాడు. కొద్దిదూరంలో ఒకామె చదువుకుంటూ కనిపించింది! ఆమె ఇటుకేసి చూడటంలేదు. తల అటు తిప్పి దీక్షగా పుస్తకం చదువుకుంటున్నది. గాలికి ఎగురుతున్న జుట్టూ, తలనిండా పువ్వులూ మాత్రం వెనకనుంచి కనిపిస్తున్నై. ఆమె మధ్యవయస్కురాలో, యువతో, ఎవతోనని మోహనరావు మథన పడలేదు. తను దిగిపోయినంతవరకూ ఆమె అట్లాగే అటే చూసుకుంటూవుంటే తన కంతే చాలనుకున్నాడు.

మోహనరావు చేతిగడియారం చూసుకున్నాడు. తర్వాత స్టేషను రావటానికి ఎంతలేదన్నా అరగంట పడుతుంది. ఈ అరగంటసేపూ తను నించునే వుండాలన్నమాట! అంతేకాదు—తన వునికి తెలియకుండా నిశ్శబ్దాన్ని కూడా అవలంబించాలి. నిశ్శబ్దంగానే పెట్టెమీద కూచుందామని నెమ్మదిగా పంచీతీసి పక్కనపెట్టి, పెట్టెమీద చతికిలపడబోగా—చిక్కుమాలిన కాలు ముందుకు జారి దభీమని కూలబడ్డాడు. ఇంత రైలు శబ్దంలోనూ ట్రంకుపెట్టె ఢమాల్ మని శబ్దం చేసింది. మోహనరావు తొట్రుపాటుపడి ఛట్టునలేచి నించుని, ఆమెకేసి చూశాడు. ఈ శబ్దానికి నిజంగానే ఆమె ఇటుకేసి తిరిగి చూసింది. మోహనరావు భయపడి వణకసాగాడు. అతన్నిచూసి ఆమె కూడా భయపడి లేచి నించున్నది.

"ఎవరుమీరూ?" అన్నదామె.

"ఈ పెట్టే...ఇదీ..." అన్నాడు మోహనరావు తొందరగా తన పెట్టెను తీసుకుని, 'నువ్వెందుకామెను డిస్టర్బ్ చేశావ్' అన్నట్టు కోపంగా చూస్తూ.

"ఇది ఆడవాళ్ళ పెట్టె" అన్నదామె.

'ఆ సంగతి తెలిసిందికాబట్టే ఇంత భయమూనూ' అనుకున్నాడు. అనుకుంటూనే 'ఎక్స్క్యూజ్ మీ' అనీ, 'క్షమించండి' అనీ రెండుభాషల్లోనూ అన్నాడు.

ఆమె మోహనరావును పరీక్షగాచూసింది. పాతికేళ్ళ వయస్సున్న కుర్రాడు. గుండ్రని మొహం, సన్న నిమీసం, వెనక్కుదువ్విన ఉంగరాలజుట్టూ, తెల్లనిబట్టలూ-చదువుకున్న మనిషల్లే కనిపించాడు.

"ఎందుకని ఈ పెట్టెలో ఎక్కారు?" అన్నదామె ఇంగ్లీషులో.

"మీరు నన్ను క్షమిస్తే..." అన్నాడు మోహనరావు బిత్తరగా ఆమెకేసిచూస్తూ.

ఆమె ఇరవై ఏళ్ల నవయువతి. శుభ్రమైన చీరకట్టుకున్నది. దంతబ్బొమ్మ నించున్నట్టుంది. మొహం గుండ్రంగా పుష్పంలాగా వున్నది. పెదవులు సహజంగానే ఎర్రగా వున్నై. కళ్ళజోడున్నా లోపలున్న రెండు 'కలువరేకులూ' చక్కగా కనిపిస్తున్నై.

"నేను...ఆదరా భాదరాదరాగా బండెక్కాను. పొరబాటున ఈ పెట్టెలో ఎక్కానుకాని- కావాలనికాదు. మీ కభ్యంతరం లేకపోతే ఇక్కడనించుని బండి ఆగగానే.."

"అభ్యంతరంవుంటే?" అన్నదామె కనుబొమ్మలెత్తి. మోహనరావు దెబ్బతిన్నట్టయి 'ఎహిహి హీ' అని నసిగాడు:

"చాలా ఆదరాబాదరాగా బండెక్కానండీ. అర్జెంటుగా ప్రయాణం వొచ్చిపడింది. స్టేషన్కు వొచ్చేటప్పటికే..."

ఒకడు ఒక సన్యాసి దర్శించి "స్వామీ కాళ్ళు కదల్చకుండా కాలణాలు సంపాదించే మార్గం ఉపదేశించండి" అని ప్రాధేయపడ్డాడు.

సన్యాసి—నీ రెండుకాళ్ళూ విరగ్గొట్టుకుని గుడిదగ్గర కూర్చో.

జి. ధనంజయ నాయుడు (తిరుపతి)

"మీరు చెప్పారు" అన్నదామె ఇంగ్లీషులో.

"ఐతే విచారిస్తున్నాను" అన్నాడు మోహనరావూ ఇంగ్లీషులోనే. 'చెబితే ఇంగ్లీషులో విచారించడం ఎందుకూ' అనుకున్నాడు వెంటనే.

"ఏవూరు వెళ్తున్నారు?"

తపీమని చెప్పాడు.

"ఈ ముందు స్టేషన్లోనే ఎక్కింది?"

అవునన్నాడు.

"సరే అట్లా కూచోండి" అని ఆమె తన సీటులో కూచుని పుస్తకం తీసుకున్నది.

మోహనరావు 'అమ్మయ్య' అనుకుని పెట్టె కిందపెట్టి దానిమీద చతికిలబడ్డాడు.

"బండిలో జనం లేరండీ. పెట్టెమీద కూచుంటారేం పైనకూచోండి" అన్నదామె.

మోహనరావు ఫరవాలేదనుకుని వూరుకున్నాడు.

"ఆడవాళ్ళ సీట్లలో కూచుంటేనామోషీ ఏం లేదు కూచోండి."

మోహనరావు కూచున్నాడు. కూచుని, ఆమెకేసి చూడకుండా కిటికీలోంచి ప్రకృతిని చూడసాగాడు అందరూ చూస్తారు కాబట్టి.

"ఏదన్నా పుస్తకం చదువుతారా" అన్నదామె.

ఏదానికీ మోహనరావు 'అబ్బే' అనదలుచుకోలేదు. లేచి, ఆమె దగ్గరగా వెళ్ళాడు. ఆమె ఐదారు పత్రికలు తీసి అతని ముందు పడేసింది. అందులో ఒకటి మాత్రమే తెలుగు పత్రిక. మోహనరావు మాతృభాషాభిమానం గలవాడల్లే ఏరి అదే తీసుకున్నాడు.

"కూచోండి" అన్నది ఆమె.

ఆమెకు ఎదురు సీటులోనే తపీమని కూలబడ్డాడు.

"మీ పేరు..."

"జజజగన్మో...ఓఓఓ...హనరావు."

ఈసారి ఆమె 'మల్లెమొగ్గలు' పూయిస్తూ నవ్వింది.

"భయపడకండి. పొరబాటున పెట్టెలో ఎక్కారు. దానికింత భయం ఎందుకూ—స్థిరంగా కూచోండి."

"కాదు.. మీరు... రిపోర్టు.. రైల్వేవాళ్ళు..."

"నే చెబుతాలెండి, ఏదన్నావొస్తే."

'ఐతే ఆమె రిపోర్టు ఇవ్వటానికి కాదన్నమాట తనపేరడిగింది—థాంక్స్' అనుకున్నాడు మోహనరావు—పత్రిక తీసి చూస్తూ. అది అతను సొంతం చదివేసిన పత్రికే. ఐనా ఆమాట అనటం అతనికిష్టం లేదు: ఎన్నడూ పత్రిక మొహం ఎరగనివాడిలాగా ఆత్రుతగా చూస్తూ పేజీలు తిప్పసాగాడు.

"చదువుకుంటున్నారా?" అన్నదామె.

మోహనరావు అదోలా ఫీలయ్యాడు ఆ ప్రశ్నకు. తనకంటె వయస్సులో పెద్దవాళ్ళు అడిగినట్టు అడిగింది. ఐతే ఈ రైలుపెట్టెలో ఆమే హక్కున్న మనిషి. అందుకని, ఆమెకంటె అతను చిన్నవాడి కిందే లెక్క. పెద్దవాళ్లకు చిన్నవాళ్ళిచ్చే పద్ధతిలోనే—

"లేదండీ, ఉద్యోగం చేస్తున్నాను" అన్నాడు వినయంగా.

"ఆహా" అన్నదామె.

మోహనరావు ఇంక భయపడదలచుకోలేదు. నిజానికి, ముందు తను ఎంతో భయపడ్డాడు. కాని, ఆమె అభయం ఇచ్చింది కాబట్టి ఇహ భయం అనవసరం. తనూ కొన్ని ప్రశ్నలు వెయ్యడానికి వెనుకంజ వెయ్యరాదు.

"మీరూ—" అన్నాడు.

"చదువు పూర్తయి కొత్తగా ఉద్యోగానికి వెళుతున్నాను."

"ఎందులో?"

"ఎడ్యుకేషన్."

"మీ పేరు?"

"ప్రేమలత."

"ఏ ఊరండీ?"

చెప్పింది.

"ఎక్కడ్నుంచి వొస్తున్నారు?"

చెప్పింది.

ఈ ప్రశ్నలు చాలనుకున్నాడు మోహనరావు. ఆమె దీక్షగా చదువుకుంటున్నట్లు కనిపించింది. ఏం చదువుతోందోనని వెనుదిగా చూశాడు. ఒకతను, ఒకామెను గాఢంగా కౌగలించుకుని ముద్దుపెట్టుకుంటున్న దృశ్యం బొమ్మ వేసివున్నది. పైన అక్షరాలు చూడగా అదొక 'ప్రేమకథ' అని తెలిసింది. మోహనరావు తెలుగు పత్రిక కింద పడేసి, ఓ ఇంగ్లీషు పత్రిక తీశాడు. పేజీలు తిప్పి, ఒకచోట ఆగి. దీక్షగా చదవసాగాడు. కాస్సేపటికి ఆమె, మోహనరావు కేసి అనుకోకుండా చూసి, అట్లాగే పుస్తకంలోకి చూసింది. ఏదో 'ప్రేమకథ' చదువుతున్నాడు. అతని ఉంగరాల జుట్టు గాలికి తమాషాగా ఒకదానితో ఒకటి సయ్యాటలు సరాగాలూ ఆడుతున్నై. విల్లులవలె వరచుకున్న కనుబొమల కింద నల్లటికళ్ళు రెండూ దీక్షగా పుస్తకంలోకి చూస్తున్నై. ప్రేమలత కిటికీలోంచి బయటకి చూసింది. ఆకాశం మీద మేఘాలు కనిపించాయి.

"వర్షం వస్తుంది కాబోలు" అనుకున్నది గట్టిగానే.

"వూఁ?" అని మోహనరావు చూసి "రావొచ్చు" అన్నాడు.

ఇద్దరూ కిటికీలోంచి బయటకు చూడసాగారు. టెలిగ్రాఫ్ తీగలమీద రెండు పిట్టలు దగరగా కూచుని కబుర్లు చెప్పుకుంటున్నై.

కాస్సేపటికి మోహనరావు ప్రేమలత కేసి చూశాడు. ఆమె బయటకు చూస్తూ ఏమో ఆలోచిస్తున్నది. మోహనరావు ఇటు తిరిగి పెరుగుతున్న పైరువంక చూస్తూ ఆలోచనలో పడ్డాడు.

ఆకాశం మీద మబ్బుపట్టింది. సాయంత్రమే ఐనా చీకటి ఆవరించబోతున్నట్టుంది. చలిగాలి వీచసాగింది... యిద్దరూ ఏవేవో మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుత చదువుల విషయాలూ, రాజకీయాలూ, వారి వారి కుటుంబాల విషయాలూ మాట్లాడుకోవటంలో వాళ్లిద్దరూ అవివాహితులు అని కూడా తేలింది!

తర్వాత స్టేషను సమీపిస్తున్నది. బండి జోరు తగ్గింది.

"స్టేషను వస్తోంది" అన్నాడు మోహనరావు లేస్తూ పుస్తకం క్రిందపడేసి.

"అవును" అన్నది ప్రేమలత, తను చదువుతూన్న పుస్తకాన్ని తీసుకుంటూ.

"చాలా థాంక్స్" అన్నాడు అతను.

"ఆ, ఏముందని?" అన్నది ఆమె.

బండి ఆగింది. మోహనరావు తొందరగా తన పెట్టె, చేతిసంచీ రెండు చేతుల్లోకి తీసుకుని, "వెళ్లివస్తానండీ" అని ఆమెతో చెప్పి ధడాలుమని కిందకు దూకి పరుగు పరుగున వెళ్లి తన మూడో తరగతి మగవాళ్ళ పెట్టెలో ఎక్కి కూచుని 'హాక్కు' గల మొహంతో 'అమ్మయ్య' అనుకున్నాడు.

బండి బయలుదేరింది... ప్రేమలత యధాప్రకారంగా మళ్లీ పుస్తకం చదవటంలో పడిపోయింది......

రెండో తరగతి రైలుపెట్టె మాత్రం ఒకసారి నిర్ఘాంతపోయి, ముక్కుమీద వేలు వేసుకున్నది. ★



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

1-2-61 బుధవారం మొదలు

7-2-61 మంగళవారం వరకు.

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

బంధు మిత్రులతో సుఖ సంతోషాలతో కాలం జరుగుతుంది. మీ అభిప్రాయాన్ని గమనించి నడుచుకొనే మనుష్యులు లభిస్తారు. తోటివారి మనస్తత్వాన్ని తెలుసుకోకుండా సాహసం చేయవద్దు. ధన విషయంలో వచ్చిన ఆటంకాలు తొలగిపోయి మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది. విద్యావ్యాసంగాలలో అవకాశాలు బాగా లభిస్తాయి. సాధారణంగా అప్పులు ఈయటం గాని, పుచ్చుకొనటం కాని, ఈ సమయంలో మంచిదికాదు. వృత్తికి సంబంధించిన కార్యక్రమాలలో విశ్రాంతి తక్కువ. త్రిప్పట అధికం కావచ్చు. వారం చివరలో వృధా కలహాలు రాగలవు. శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తవి. ముఖ్యమైన రహస్య వర్తమానాలు తెలుస్తవి. 2, 3 లలో అకస్మాత్తుగా దేహబాధలు, మనోవ్యాకులం, అధికారులవల్ల కార్యభంగం.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఇంతకుముందున్న చిక్కుల నుంచి అన్ని విధాలా తేలిక పడతారు. అయితే కొంతవరకు దుబారా ఖర్చులు చేయవలసి వస్తుంది. ముందు ఎప్పుడో జరుగబోవు పనులను గురించి ఆలోచనలు చేస్తారు. సాధారణంగా కలహ ప్రసంగాలు వస్తూ ఉంటవి. మీవల్ల పనులు జరుపుకొనటానికి ప్రయత్నించేవారు విశేషంగా ఉంటారు. మీ సుఖం నిమిత్తం విశేషంగా ఖర్చులు పెరుగుతవి. సంఘంలో ఉన్నత స్థానం పొందగలుగుతారు. స్థిరాస్తులు మొదలైనవి కొనటానికి అనుకూలమైన కాలం. వృత్తి వ్యాపారాలలో పోటీ పెరుగుతుంది. కాని, మీకు ఏవిధంగాను అపకారం జరుగదు. చేసిన శ్రమకు సంతృప్తికరమైన ఫలితం దొరుకుతుంది. 5, 6, తేదులలో గౌరవప్రాప్తి, క్రొత్త పనులలో ప్రవేశం, అధికారుల ఆదరణ.

* * *

మిధునం :

(మృగశిర 3, 4 పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3, పా.)

అనుభవంలో క్రొత్త విషయాలు తెలుస్తవి. ఒకప్రక్క ఆదా చేస్తూవుంటే మరొక ప్రక్క దుబారా అవుతూ ఉంటుంది. మనస్సుకు చంచల స్వభావం పోయి నిలకడ లభిస్తుంది. కలహ బాధలు క్రమంగా తొలగుతవి. సభా గౌరవం లభిస్తుంది. ఇతరులకు మేలు చేయబోతారు. కాని అవస్థపడవలసి వస్తుంది. కాస్త విశ్రాంతిగా ఉందామనుకొనే సమయంలో ఇతరుల బలవంతం వల్ల కార్యరంగంలో ప్రవేశించవలసి వస్తుంది. దారినపోయే పీడలు కొన్ని నెత్తికి చుట్టుకునే సూచన లున్నవి. జాగ్రత్తగా ఉండటం మంచిది. తీర్థయాత్రలు చేయగలుగుతారు. తలవని తలంపుగా అగ్నివల్ల గాని, ఆయుధాలవల్ల గాని బాధలు కలుగవచ్చు. 1, 2 తేదులలో కుటుంబ కలహాలు, లెక్కలు మొదలయిన పనులలో పొరపాట్లు చేస్తారు.

* * *

గ్రహస్థితి

మిధునంలో అంగారకుడు, సింహంలో రాహువు, ధనుస్సులో గురువు, మకరంలో సూర్య శనులు, కుంభంలో బుధ కేతువులు, మీనంలో శుక్రుడు, కటక సింహ కన్య తులలో చంద్రుడు.

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష.)

అన్ని సందర్భాలలోను మనోధైర్యంతో నిలబడగలుగుతారు. దైవబలంతో చిక్కు సమస్యలను సులభంగా తొలగించుకుని ముందుకు పోగలుగుతారు. మీచేత పని చేయించుకుని సమయంలో చల్లగా జారుకునే మనుష్యులు తటస్థ పడతారు. కోర్టు కచేరీలలో మీ ఆలోచనలు, పట్టుదల బాగా ఉపయోగిస్తవి. కుటుంబంలో మనశ్శాంతి లభిస్తుంది. లాటరీ, చట్టా వ్యాపారముల వంటి పనులలో ప్రవేశించవద్దు. క్రొత్తవారితో కలిసి చేయు పనులలో ఉపయోగం బాగుంటుంది. పైవారితో మనస్పర్ధలు వచ్చినా ముదరకుండా సమసిపోగలవు. దూరమందున్న మిత్రుల వద్దనుంచి శుభ వార్తలు తెలుస్తవి. అనుకున్న ప్రయాణాలు జరుగలేదని బాధపడవద్దు. 4, 5 తేదులలో లాభ సూచనలు, నౌకర్లతో అభిప్రాయ భేదాలు, దేహశ్రమ.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

తీరుబాటుగా ఉన్నామని భావించే అవకాశం లేదు. మంచివారిసలహాతో మీ పనులు అనుకూలిస్తవి. కుటుంబంలోని వారి సుఖం నిమిత్తం ఖర్చులు పెరుగుతవి. రాజకీయాలలో క్రొత్త సమస్యలు రాగల అవకాశా లున్నవి. వృత్తిలో చిక్కులు వచ్చేటట్లు కనుపించినా సులభంగా తొలగించుకో గలుగుతారు. ఆహార విహారాలలో మీరు అశ్రద్ధగా ఉండటం వల్ల అసౌఖ్యానికి గురికావలసి వస్తుంది. కొన్ని సందర్భాలలో కాని ఆదాయం ఉండదని ముందుగా తెలిసినా పట్టుదల, గౌరవం నిమిత్తం భారం పైన వేసుకోవలసి వస్తుంది. ఒకరి ఉపయోగం నిమిత్తం మరొకరికి కష్టం కలిగించవలసి వస్తుంది. 1, 2, 3 తేదులలో ఖర్చులు అధికం, త్రిప్పటతో కూడిన పనులు.


* * *

కన్య :

(ఉత్తర 2, 3, 4 పా, హస్త, చిత్త 1, 2 పా)

పెద్దవారి ప్రక్కన ఉండటంవల్ల మిమ్ములను కూడా పెద్దవారుగా అనుకోవలసి వస్తుంది. ధన యోగం బాగుంటుంది. బంధువులవల్ల ఇంతకు ముందు కలిగిన చిక్కులు తొలగిపోతవి. తోటివారికి ఆలోచన చెప్పవలసి వచ్చే సమయాలలో తటస్థభావంతో ఉండటం అవసరం. పిల్లల ఆరోగ్యం అసంతృప్తికరంగా తోస్తుంది. స్థిరాస్తులకు సంబంధించిన వ్యవహారాలలో ఫలితం దక్కుతుంది. విద్యార్థులకు లలితకళలయందు ఆసక్తి కలవారికి ప్రోత్సాహకరమైన కాలం. బంధువుల వద్దనుంచి శుభవార్తలు తెలుస్తవి. వృత్తిలో అప్పుడప్పుడు కనిపిస్తున్న ప్రతిబంధ





COLGATE
TOOTH POWDER
COLGATE
COLGATE
DENTAL CREAM

కాలు తొలగిపోతవి. గౌరవ పదవులయందు ఆసక్తి పడవద్దు. 5, 6 లలో అకస్మాద్ధనలాభం. శ్రమ.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పా.)

గత రెండు మూడు వారాలకన్నా మేలుగా ఉంటుంది. ముఖ్యంగా మీ ఆరోగ్యం సంతృప్తికరంగా కనిపిస్తుంది. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటవి. వృత్తిలో మీతో వ్యతిరేకిస్తున్న వారే మీ మాటకు విలువ నిస్తారు. ఆదాయం క్రమక్రమంగా పెరిగి హోదా నిలుపుకోగల అవకాశాలు లభిస్తవి. కారణంలేని పేచీలు వస్తవి. అయితే మీరు కొంత నిబ్బరంతో ఉండటంవల్ల అపవాదులు రాకుండా తప్పుకోగలుగుతారు. ఈ సమయంలో ఇతరులకు మేలు చేయటం అనే విషయాన్ని మరచిపోవటం అవసరం. ప్రతి పనీ ముందు ప్రతికూల లక్షణాలు కనుపించవచ్చు. కాని పర్యవసానంలో మీకు అనుకూలాంగా జరుగుతవి. 3, 4 లలో గౌరవ ప్రాప్తి. అధిక ఆదాయము, విద్యావంతులతో స్నేహం.

* * *

వృశ్చికం:

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ట.)

స్వల్ప కారణాలతో విరోధాలు పెరగకుండా చూచుకోవలసిన సమయం. సాటివారిలో హోదా బాగుంటుంది. వృత్తికి సంబంధించిన పనులలో పైవారి సహాయము, ఆదరణా బాగా లభిస్తవి. ఖర్చులతోబాటు ఆదాయం కూడా పెరగటంవల్ల అప్పులు చేయవలసిన బాధ తొలగిపోతుంది. మీ హాస్య ప్రసంగాలవల్ల ఎదటివారి మనస్సుకు బాధ కలిగించే అవకాశా లున్నవి. అతిముఖ్యం అనుకుని చేసిన పనులు చివరకు ఉపయోగించకుండా పోయే సూచన లున్నవి. కుటుంబంలో ఆరంభమైన చికాకులు జాగ్రత్తవల్ల సకాలంలో సమసిపోగలవు. యంత్ర కార్యాలలో నిర్లక్ష్యంగా ప్రవర్తించదగిన సమయం కాదు. 5, 6 లలో శుభ వార్తలు, దేహ శ్రమ.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాడ, ఉత్తరాషాడ 1 పా.)

మీ ఆలోచనలు ముందుకు సాగే సమయంలోనే భయవార్తలు తెలుస్తవి. మీ పనులను మానుకొని ఇతరులకు సహాయం చేస్తారు. అయినా విష్కారాలు తప్పవు. మీ సమర్థతతో ప్రత్యక్షంగా జరిగే అక్రమాలను సర్దుబాటు చేయ గలుగుతారు. ఇతరులవద్ద నుంచి రావలసిన ధనం సకాలంలో వస్తుందని అనుకోవద్దు. అకస్మాత్తుగా పుణ్యకార్యాలలో పాల్గొంటారు. పండితులతో సమావేశం లభిస్తుంది. వ్యవహార కార్యాలలో నిదానం కనిపిస్తుంది. విందులు విలాసాలు మొదలైన వాటితో కాలం జరుగుతుంది. ముఖ్య బంధువులలో ఒక రిద్దరు వ్యతిరేకంగా ప్రవర్తిస్తారు. చివరకు వారే పశ్చాత్తాపపడి సర్దుకుంటారు. 2, 3 లలో అపవాదులు, దుష్టులతో వివాదాలు.

* * *

మకరం :

(ఉత్తరాషాడ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ట 1, 2 పా.)

మీ ఉత్సాహం క్రమంగా పెరుగుతుంది. అనేక చిక్కు సమస్యల నుంచి విముక్తి పొందగలుగుతారు. ఇతరుల చేతికి వెళ్ళిన కాగితాలు, డబ్బు సక్రమంగా తీసుకో గలుగుతారు. మిమ్ములను గురించి రకరకాల వార్తలు ప్రచారంలోకి రాగల అవకాశా లున్నవి. పెద్దవారి మనస్సుకు చికాకు కలిగేటట్లు ప్రవర్తించటంవల్ల చివరకు మీరే పశ్చాత్తాప పడతారు. మందులు వగైరా నిమిత్తం చేస్తున్న ఖర్చులు చాలా వరకు తగ్గిపోతవి. శుభవార్తలు తెలుస్తవి. మీకు సంబంధం లేని ప్రసంగాలలో ప్రవేశించటం వల్ల అవతలి వారికి జవాబు చెప్పవలసిన స్థితి ఏర్పడుతుంది. 2, 3 తేదులలో ఆదాయ భంగం, పుణ్యకార్యాలు, అధైర్యము.

* * *

కుంభం :

(ధనిష 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

సాహసంచేస్తే కాని ఏ పనీ చేయలేక పోతారు. యథార్థం మాట్లాడటం వల్ల మీయందు అందరికి సందేహాలు వస్తవి. ఖర్చులను చాలవరకు తగ్గించుకో గలుగుతారు. వృత్తి వ్యాపారాలలో క్రొత్తవారి వల్ల ధనలాభము, కార్యసిద్ధి కలుగుతవి. దైవానుగ్రహం బాగున్నది. మీ మాట నేర్పుతో వ్యవహార కార్యాలు పరిష్కారానికి రాగలవు. విశ్రాంతి కోసం ఎదురుచూస్తూ ఉంటారు. కాని అందుకు అవకాశాలు తక్కువ. జీర్ణకోశాలలో బాధ కనుపించవచ్చు. అనుకోకుండా బంధువులు వస్తారు. పిల్లల మూలంగా ఖర్చులు పెరుగుతవి. వారాంతంలో లాభ వార్తలు వస్తవి. 4, 5, 6 తేదులలో వృథా ఆందోళన, పొరపాట్లు చేస్తారు.

* * *

మీనం:

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

మీ మనస్సులో ఉత్సాహం లేకపోయినా పైకి మాత్రం ఆడంబరంతో కనుపిస్తారు. స్నేహితులతో చెప్పిన ప్రకారం మీ ధర్మాన్ని నెరవేర్చుకో గలుగుతారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవలసి వస్తుంది. ఇతరులను ప్రోత్సాహపరచి కార్యరంగంలో దింపగలుగుతారు. మీరు ఎంత శ్రమ పడ్డా ఫలితం విశేషంగా లభించే సమయం కాదు. మీతో కూడా ఉంటున్న వారే మిమ్ములను ఒక విధంగా వ్యతిరేకిస్తూ భయపెట్టటానికి చూస్తారు. మీ నిత్య కృత్యాలలో పొరపాట్లు రావచ్చు. చాలవరకు అప్పుల బాధ నుంచి బయటపడ గలుగుతారు. మీ మాట మాత్రమే చలామణి కావలెనని పట్టుపట్టడం మంచిదికాదు. 6, 7 లలో వినోద కాలక్షేపాలు, వ్యవహార పరిష్కారం. ★

ఈ వారము ధరలు

బంగారు ధర వారం రెండవ భాగంలో కొద్దిగా మందీ అవుతుంది. వెండి ధర కొద్దిగా పెరిగి తగ్గుతుంది. పసుపు ధర వారాంతంలో తగ్గుతుంది.

వేరుశనగ పప్పు నూనె ధరలు తగ్గి పెరుగగలవు. నూవుల నూనె ధర నిలకడగా ఉంటుంది. ప్రత్తి ధరలో మందీ సూచన లున్నవి. నూలుకు గిరాకీ వస్తుంది.

కందులకు గిరాకీ వచ్చి మరల వారాంతంలో తగ్గుతుంది. మినుములకు తేజీ వస్తుంది. గోధుమల ధరలో తగ్గుదల ప్రారంభం అవుతుంది.

చింతపండు, బెల్లము ధరలలో తగ్గుదల వస్తుంది.

పడకకుర్చీలో కూర్చుని లంక పొగాకు పాయలుగా చీల్చి చుట్ట చుట్టుకుంటూ జీతగాళ్ళు చెప్పేమాటలు వింటున్నారు లింగమూర్తిగారు. ఏభై ఎకరాల మాగాణి ఒక్క చేతిమీదుగా చూసుకుంటాడాయన. చుట్టచుట్టడం పూర్తిచేసి, మొన కొద్దిగా కొరికి "నాంచారీ నిప్పు పట్టుకురా" అని అరిచారు.

చుట్ట ముట్టించి రెండు గుక్కలు లాగాకగాని ఆయనికి వింటున్న మాటలు మనస్సుకి ఎక్కవు. ఈ విషయం బాగా ఎరిగిన పెద్దపాలేళ్ళు కర్రల్ని బుజాలకి పోటీపెట్టి నిలబడి ఉన్నారు. కూలివాళ్ళు మాత్రం ఏదో చెబుతున్నారు — ఆయన వింటున్నాడన్న అపోహతో.

"ఆ, సుబ్బడూ— ఏం చేశార్రా ఇవాళ ?" అన్నారాయన చివరికి.

"నిగావహాను" సుబ్బయ్య కొంచెం ముందుకొచ్చి అవాళ్టి పనులన్నిటిని సమీక్షించ సాగాడు —

"మెరకచేనుకి నీరు సరిగా ఎక్కటంలేదు. అందుకని పంపు ఆడారు గంగులు, పాపడు. ఈనాంకి ఇవ్వాళల్లా నీరు ఎక్కిందికాని నీళ్ళు జాలుగా వస్తుండటంవలన ఆ ఎక్కింది చాలదు రేపుకూడా నీరు పట్టాలి...." ఏ ఏ చేలకి నీళ్ళు వెళ్ళిందీ వెళ్ళవలసిందీ — పంపు వేసినది, వేయవలసినది వగైరా చెబుతూంటే ఆట్టే వింటున్నారు లింగమూర్తిగారు.

ఇలా రోజూ ఒక గంట సేపు ఉంటుంది ఈ కార్యక్రమం. చివరికి కూలీలకి బట్వాడాచేయవలసిన డబ్బు లెక్కవేసి పెద్దపాలేరు సుబ్బయ్యకిచ్చి మర్నాడు చేయవలసిన పనులుకూడా చెప్పేశారు. ఇక ఎక్కడివాళ్ళక్కడ వెడుతున్నారు.

మిత్రులందరిని బయట నిలబెట్టి వాసు ఒక్కడే లోపలికి వచ్చేప్పటికి అంతా బయటికి వెడుతూ ఎదురయ్యారు.

"సరిగా సమయానికే వచ్చాను" అనుకున్నాడు వాసు. లింగమూర్తిగారి చూపుకి త్వరగా కనబడేట్టుగా నిలబడ్డాడు.

అందరినీ "ఇక వెళ్ళండి" అని చెప్పిన ఆయన కంటికి వాసు కనబడ్డాడు. వెంటనే —

"సుబ్బయ్యా, ఒక్కమాటు ఆగు — వాళ్ళని కూడా పిలవరా నాంచారీ !....చూడు సుబ్బయ్యా, పై ఏడు మన పాటిదిబ్బమీద మెరపనారు వేయాలనుంది. పండుతుందంటావు ?" అనడిగారు.

వెళ్ళిపొమ్మన్న మనిషి పని వేళా వెనక్కిపిలిచి 'పై ఏటి' విషయం మాట్లాడతాడేమా అని ఒక్క క్షణం విస్తుపోయి చుట్టు పరికించిచూశాడు సుబ్బయ్య. వాసు కనబడగానే సంగతి గ్రహించి తాపీగా అరుగుమీద కూర్చుని—మెరపనారు ఎలా వేయవలసిందీ, నీరు ఎలా పెట్టవలసిందీ — తమ పాటిదిబ్బ మిరపనారుకి ఎంత శ్రేష్ఠయినదీ—వగైరా ఏకరువు పెడుతుంటే లింగమూర్తిగారు ఏకధ్యానగా వింటున్నారు.

వాళ్ళ ఈ ప్రవర్తన వాసుకి కష్టం కలిగించింది. కేవలం తననిచూసి — తనతో మాట్లాడటం ఇష్టంలేక వాళ్ళని వెనక్కిపిలిచిన మేనమామ పద్ధతి

> ప్రపంచం పురోగమించిందో లేదో తెలియదు. కాని మానవుడు మాత్రం నాటికి నేటికి ఒక్కలాగానే ఉన్నాడు.
>
> గ్రామంలో ఎన్నో మార్పులు వచ్చినా, రాబోతున్నా పట్టించుకోక, ఒక ముఖ్యమైన సందర్భంలో ఎదిర్చి నిలిచిన లింగమూర్తి.. కన్నకూతురు ప్రాణానికే ముప్పం రావడంతో ఆ మార్పునే కోరి వరించాడు...

అతనికేమీ నచ్చలేదు. అయినా వ్యవహారంపట్ల కోపం రాకూడదని తెలిసి అలాగే నిలబడ్డాడు.

అప్పుడే లోపలికొచ్చిన నాయుడు "ఏం వాసు బాబూ, పనిమీద వచ్చినట్టున్నావు ?" అన్నాడు — వచ్చాడని లింగమూర్తిగారికి తెలియబర్చాలని.

"ఆ, మావయ్యతో కొంచెం పనుండి — ఆ మాటకొస్తే మీ అందరితోనూ పనుందనుకోండి" అన్నాడు వాసు నవ్వుతూ.

ఇక అతని ఉనికిని గుర్తించక తప్పని పరిస్థితి ఏర్పడింది ఆయనకి —

"ఏమోటోయ్ వాసూ, ఎంత సేపయింది వచ్చి— నిలబడిపోయావ్ ?" అన్నారాయన కూర్చోమన్న ధ్వని కలిగజేస్తూ.

"మన ఊరివిషయం మాట్లాడదామని...."

"ప్రెసిడెంట్‌గారికి మాతో ఏం పనో ?" అన్నాడాయన హేళనగా నవ్వుతూ.

"అదేమిటి మావయ్యా — ప్రెసిడెంటుగా తప్ప ఇంకొకరకంగా నీకంటికి కనబడనా ?" అన్నాడు కష్టంగా వాసు.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. చివరికి వాసే మొదలెట్టాడు —

"మన ఊరు పెద్ద రోడ్డుకి రెండు మైళ్ళ దూరంలో ఉంది. మన ఊరిమీదుగా చాలా వూళ్ళున్నాయి. కాని మనం పూనుకోందే వాళ్ళసలు కదిలిరారు. రోడ్డుకయ్యే మొత్తం ఖర్చు ఒక్క ప్రజలే భరించాలంటే అది జరిగేపని కాదు. కనుకనే ఇన్నేళ్ళుగా ఎవరూ ఆ ప్రయత్నం కూడా చేయలేదనుకుంటా ! ఇకపోతే రోడ్డులేకపోవటంవలన మన బళ్ళు, ఎడ్లు పడుతున్న బాధ మనం అంతా ఎరుగున్నదే. మంచి రోడ్డుమీద పది, పన్నెండు బస్తాలు తేలిగ్గాలాగే బళ్ళమీదకూడా మనం ఏడు, ఎనిమిది వేసేందుకు భయపడుతున్నాం. అదికూడా ప్రాణాలు బిగపట్టుకుని రోడ్డు ఎక్కేదాకా నానాయాతనా పడుతున్నారు. లారీవాళ్ళని రమ్మంటే వాళ్ళు రావటంలేదు. అధవా వచ్చినా మట్టిలో కూరుకుపోయి వన్నే తిడుతున్నారు.

"ఇన్ని రోజులుగా ఇదంతా భరించాం — గత్యంతరంలేక. ఇప్పుడు గవర్నమెంటు 'బ్లాకు'లుపెట్టి పల్లెలకి ఇతోధికంగా సాయంచేసి వాటి సౌకర్యాల కోసం కృషి చేస్తోంది. ఒక రోడ్డు వేయాలంటే అయే మొత్తం ఖర్చులో సగం వాళ్ళు ఇస్తారు. మిగిలిన సగం మొత్తాన్ని ప్రజలు, పంచాయతీ చేరి సగం భరించాలి. అయినా మీలాంటివాళ్ళకి నే నివ్వన్నీ చెప్పనవసరంలేదు — మీకూ తెలుసు కాబట్టి.

"మన పంచాయతీ తరఫున బ్లాకువాళ్ళని సంప్రదించాను. మొత్తం అరవయి వేలు అవుతే అందులో పంచాయతీ, మనం కలిసి ముప్ఫయివేలు భరిస్తే శాంక్షన్ అవుతుందని చెప్పారు.

"అందువలన, మా మావయ్యలాంటివాళ్ళు దానికి పూనుకుంటే నిండుదనం వస్తుంది ఈ కార్యానికి. ఎకరానికి పదిరూపాయలు వసూలుచేశామంటే చాలు" అంటూ పూర్తి చేశాడు వాసు.

లింగమూర్తిగారు ఏమీ మాట్లాడకుండా తన చుట్టపొగలో తన్మయత్వంచెందుతున్నాడు —

"ఏమంటారు కరణంగారూ ?" అని హెచ్చరించాడు నాయుడు — ఆయన ఏమీ అనకపోతే ఆ బాధ్యత తనమీదికి వస్తుందన్న భయంతో !

"అనేందు కేముంది నాయుడమ్మా ! మనం ఏపాటివాళ్ళం కోన్‌కిస్కాగాళ్ళం. గుడ్డికన్నుమూస్తే ఎంత, తెరుస్తే ఎంత?"

"నువ్వలా అనుకున్నా మేమనుకోవడంలేదు మావయ్యా—కరణానివి. ఏభయి ఎకరాల ఆసామివి.— 'కోన్‌కిస్కా' ఎలా అవుతావు ?" అన్నాడు నవ్వుతూ వాసు.

కూర్చున్న కూలీవాళ్ళు, పాలేళ్ళు గలగల నవ్వారు.

లింగమూర్తిగారికి ఒళ్ళు మండిపోయింది. "ఏవిటిరా ఆ ఇకఇకలు—ఊళ్ళో జరిగే పనులన్నిటికి మనతో సంప్రదిస్తున్నారా ? ఇదివరలో మనం కాదన్నవి ఆపేశారా ? గుండెమీద చేయివేసుకొని చెప్పమను ఏ మగాడినయినా ! ఈనాడు చందాలు కావలసి వచ్చేప్పటికి ఈ లింగమూర్తి కనబడ్డాడా ! రోడ్డు లేకుండా ఊరు ఇన్ని ఏళ్ళు బతకలా ? ఇప్పుడు వెయ్యకపోతే బతకదా —ఏం నాయుడూ !"

"నీమాటకి ఢోకా ఉందా బావయ్యా" అన్నాడు నాయుడమ్మ వోరగా వాసుకేసిచూస్తూ.

ఈ పరిణామం వాసుస్నేహితులు వూహించి చెప్పినా వాసుమట్టుకు మావయ్య ఇంత పట్టుదల మనిషి అనుకోలేదు. దాళవా—వరి రెండవపంట— ఆయన వద్దన్నా కూలీజనం చిన్నరైతులు బాగుపడతారన్న ఆశతో తెప్పించావన్న కోపం ఇంకా పోలేదన్నమాట అతను పసిగట్టలేకపోయాడు.

"బ్రతకలేమనికాదు మావయ్యా, నిక్షేపంగా బతకగలం. కాని మన ఎడ్లు ఎంత కష్టపడుతున్నాయో చూడు. రేపు రోడ్డు పడితే పెద్దరోడ్డునుండి మన వూరుకు ఒక వాన్ వేయించుకోవచ్చు—ప్రయాణాలకి వీలుగా ఉంటుంది. అద్దద్దా అంటే వైద్యా



సింగరాజు రామచంద్ర మూర్తి

నికి వాటికి వీలుగా వుంటుంది. మొన్నటికి మొన్న రంగయ్యకోడలు చచ్చిపోయిందంటే కారణం— వైద్యంలేకపోవడమే. బండిలోపడేసి బస్తీ వెళ్లేందుకు నాలుగ్గంటలు పట్టింది. తీరా వెడితే డాక్టర్లు లోపల పిండం కుళ్ళిపోయింది — వెంటనే తీసుకొస్తే బావుండేది అన్నారుట !"

"ఇవన్నీ నాకు తెలియవబ్బాయి — నేను మొండి వాడిననుకో. ఈ 'అభ్యుదయ' గ్రామంలో ఉండ దగినవాడిని కాననుకో. అభివృద్ధి నిరోధకుడిననుకో— నీ ఇష్టం. నేను లేకుండానే అన్ని పనులు చేయించుకో గల సమర్థులు ప్రసిడెంటులు, మునసబులు—ఇది కూడా వేయించండి మాదాం! పద నాయుడమ్మా !" అంటూ కండువా భుజాన వేసుకుని కర్ర పుచ్చుకుని గుడిదగ్గరకు బయలుదేరారు లింగమూర్తి గారు. నాయుడు వగైరాలు అనుసరించారు.

"మాబాగా చెప్పారులెండి కరణంగారు. అసలు తను కొత్తగా కొన్న మోటారుసైకిలు ఈ రోడ్డు మీద పాడయిపోతోందని ఎత్తాడు ఈ ఎత్తు !" అన్నాడు నాయుడు దారిలో అగ్గిపుల్ల వెలిగించి గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ ముట్టించుకుంటూ.

"పదే — బుర్రమని స్నేహితుల్ని వేసుకుని సినిమాకి ఆయన వెళ్లేందుకు మనంచందాలెందుకు ఇవ్వాలి ?"

నీరయిపోయాడు వాసు. వ్యక్తులమధ్య పొర పొచ్చాలు ఉండచ్చుగాని, వాటిని సాధించేందుకు ఊరు బాగుపడకుండా చేయడం ఏం భావ్యం ?

ఉసూరుమంటూ బయటికొచ్చాడు వాసు.

"ఏరా — కాయేగా !" అడిగారు బయట ఆత్రంగా ఫలితంకోసం ఎదురుచూస్తున్న మిత్ర బృందం.

"వాడి ముఖంచూస్తే తెలియటంలా ! కాయ కాదు పిందె — పువ్వు....అయినా వాడి పిచ్చగాని నేను ముందే చెప్పలా ! ఆయన కలిసిరాడురా అబ్బీ అంటే వింటేనా ? "మామయ్య అంత మూర్ఖుడు కాదురా" అంటూ పోయాడు.

"ఏం చేద్దాంరా ఇప్పుడు వాసూ ?" అడిగాడు శేషగిరి.

"చేసేందుకేముంది ? వీళ్ళ మావయ్యకి ఏభయి ఎకరాలు ఉంది. అంటే ఎకరానికి పది చొప్పున అయిదు వందలు ఇవ్వాలన్నమాట ఆయన. ఆ డబ్బు కూడా ఊరిమీదే వసూలు చేద్దాం. ఆయనికి సిగ్గు వస్తుంది అప్పుడు" అన్నాడు వెంకటరావు కొంచెం ఆవేశంగా.

వాసు పేలవంగా నవ్వాడు —"ఒరేయ్ — ఉన్న వాడు కరణం. ఆయనే ఇవ్వకపోతే మనకింక వూళ్లో ఏం పుడుతుందిరా ? "కరణంగారే ఇవ్వకపోతే మే మెలా ఇస్తాం" అంటారు ఎవరికి వారు. "మనం కష్ట పడి వేయిస్తే ఆయన అనుభవించేందుకా వీళ్లేదు" అంటారు మరికొందరు. అందువలన ఇటువంటి పనులకి అందరి అండ, సపోర్టు ఉండాలి. ముఖ్యంగా ఉన్నవాళ్ళు ఒప్పుకోవాలి. అందులోనూ ఆయన కరణం !"

"అయితే ఇప్పుడేమంటావు ?"

"కాసేపు నన్ను వంటరిగా వదిలేయండి. భోజ నాలయాక మాట్లాడుకుందాం" అని వాళ్ళనంద రినీ వదిలించుకుని చెరువుకేసి బయలుదేరాడు.

ప్రగతిపథం

వెన్నెల పిండి ఆరబోసినట్టుంది. సన్నటి పైర్ల గాలికి ఈనబోతున్న వరి మొక్కలు బరువుగా, నిండు గర్భిణులలాగా తలలాడిస్తున్నాయి. చెరువులో చిన్న చిన్న అలలులేచి వెండి కరిగించి పోసినట్టు తళతళలాడుతోంది.

రేవుకి పక్కగా రాయిమీద కూర్చున్నాడు వాసు. అతని మనస్సంతా వికలం అయిపోయింది.

తాను అనుకున్నదానికి ఇప్పుడు జరుగుతున్న దానికి మధ్యనున్న దూరం అతన్ని బాధిస్తోంది.

పుట్టి పెరిగింది పల్లెటూరిలోనే కాబట్టి అతనికి పల్లెలంటే చాలా ప్రేమ. పల్లెటూరివాళ్ళు చాలా అమాయకులని, కల్ల కపటం లేనివాళ్ళని— బస్తీల కుళ్ళు, కృత్రిమం ఇంకా పల్లెలకి రాలేదని అతని అభిప్రాయంగా ఉండేది. చదువుకోసం

> వైద్య విద్యార్థి—"మీదుకాణంలోఉన్న "ఎనాటమీ" పుస్తకాలు దశాబ్దాల క్రిందట వ్రాసినవి. కొత్తవి ఎందుకు తెప్పించరూ?"
>
> దుకాణం యజమాని—"ఈ అన్ని దశాబ్దాలలోనూ మానవుని అస్థిపంజరంలో కొత్తఎముకలు ఏమైనా వచ్చిచేరాయా?"
>
> రియాజ్ పాషా (కాకినాడ)

బస్తీలో బంధువుల ఇంట్లో ఉండేప్పుడు ఎప్పుడు శలవలొస్తాయా అని ఎదురుచూసేవాడు. స్కూల్ ఫైనలులో చదివిన హోమ్ కమింగులో పథిక్ చక్రవర్తి పోలికలు తన కున్నాయనిపిస్తుండేది.

పల్లెజీవితం, బస్తీజీవితం — డిబేట్లల్లో పల్లెల వైపు మాట్లాడి బహుమతులుపొందేవాడు. కాలేజి రోజుల్లో పల్లెపట్టు ప్రతిబింబించేట్టు కథలు రాసేవాడు. ఇవన్నీ అతను హృదయపూర్వకంగానే చేశాడు. కారణం— వాటిని తను మనసారా నమ్మడం.

వాళ్ళనాన్నకి ఒక నలభయి ఎకరాలదాకా మాగాణి, ఒక మావిడితోట ఉన్నాయి. సంతానం—మగ పిల్లాడు తానొక్కడే. అందుకనే ఉద్యోగంమీదికి మనసు పోనీయకుండా వ్యవసాయపు బి.ఎస్‌సి. పాసయి స్వగ్రామం చేరుకున్నాడు—తన ఆశయాలని అమలు పర్చుకోవాలని, చదివిన చదువును సార్థకం పరుచుకోవాలని.

ఇంత చదువు చదివింది పొలం దున్నేందుకా అన్న మిత్రుల హేళన లక్ష్యపెట్టలే దతను. మొదట్లో అతని కంటికి ఊరంతా ఒక్కమాట మీదున్నట్టు కనిపించింది. కాని చీకటికి అలవాటు పడినవాడి కంటికి వస్తువులు వివరంగా కనబడినట్టు క్రమేణా ఊళ్లోని పార్టీలు, పట్టుదలలూ, కక్షలు అన్నీ అవగతమవసాగాయి. ఇదంతా తన భ్రమేమో అనుకుని సరిపెట్టుకో చూశాడు. కాని అది అతని శక్తికిమించిన పనయింది. తను పదిలంగా పెంచుకున్న అభిప్రాయాలు తనకళ్ళముందే దూది పింజల్లా చెదిరిపోవడం బాధించింది అతన్ని.

కరణంగారి బావి వేరు. మునసబుగారి బావి వేరు. వారిపార్టీవా రిందులో, వీరిపార్టీవా రందులో నీళ్ళు ముట్టరు. తటస్థంగా ఉందామంటే ఆ వ్యక్తి మనుగడే పెద్ద ప్రశ్న.

ఇటువంటి పరిస్థితుల్లో పులిమీద పుట్రలాగా రెండవపంట సమస్య ఒకటి ఉత్పన్న మయింది క్రితం సంవత్సరం. మునసబు కావాలన్నాడు కాబట్టి లింగమూర్తిగారు వద్దన్నారు. అంతా కలిసి కలెక్టరు దగ్గరకు పోయారు. దీనివలన కూలీ చేసుకునే వాళ్ళకి, చిన్న చిన్న రైతులకు లాభం ఉందని గ్రహించిన వాసు తన మిత్రులతోసహా రెండవ పంట కావాలని బలపరచాడు.

వాసువాళ్ళ అండతో రెండవపంట సాధించాడు మునసబు. బీదవాళ్ళంతా సంతోషించారు. పంట బాగా పండటంతో రైతులుకూడా ఆనందపడ్డారు. ఇదంతా లింగమూర్తిగారికి కోప కారణమయింది. వాసుని మునసబుపార్టీవా డయిపోయాడని మండి పడ్డాడు. కేవలం తన్ని అవమానపరిచేందుకు ఈ ఎత్తు ఎత్తిన మునసబు విజయానికి కారణం వాసు అవడంవల్లనే ఆయనకోపం మునసబుమీంచి వాసు వైపుకు మళ్ళింది.

పెరిగిన పలుకుబడివలన వాసు పంచాయతీబోర్డు ప్రసిడెంట్ అయ్యాడు. ఇది అతనికి ఇష్టంలేక పోయినా, "వూరు బాగుపడాలంటే నువ్వే ఉండాలి" అని అంతా అనడంతో ఒప్పుకున్నాడు.

తన కుడిభుజం నాయుడమ్మని ప్రెసిడెంటుని చేద్దామనుకున్న లింగమూర్తికి ఇది ఇంకో పెద్ద అఘాతం అయింది. అసలు ఇందుకోసమే వాసు మునసబుని సమర్థించాడని ఆయన నమ్మకం.

రాను రాను వాసు వాళ్ళ ఇల్లు లింగమూర్తిగారింటినుంచి ఎడమయింది. ఆయన కూతురుకు ఇతరత్రా సంబంధాలు చూడబోవడంతో ఇప్పట్లో కలిసే లక్షణాలు కూడా మృగ్యమయాయి.

ఒక ఏడాదిగా జరిగినవన్నీ వాసు మనఃఫలకంలో మెదిలాయి. ఆలోచనల్లోంచి తేరుకొని చేతివాచీ చూసుకున్నాడు. ఎనిమిదయింది. లేచి నిలబడ్డాడు.

రేవులో మెట్లమీద ఎవరో అమ్మాయి బిందె నీళ్ళతో నింపుకుని నడుంమీద పెట్టుకుని మెట్లెక్కి వస్తోంది ఎవరా అని ఒక్కక్షణం చూశాడు వాసు. సావిత్రి.

మనస్సు ఆనందంతో ఉరకలేసింది. మాట్లాడుదామని అడుగుముందుకువేయబోయాడు. కాని అంతలోనే ఇప్పటి తమ పరిస్థితి తలుచుకుని వెనకాడాడు. "సావిత్రిని ఇంకొకరికిచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు వాళ్ళ నాన్న. ఆమె ఇక తనదికాదు" దిగులుగా అనుకుని అడుగేయబోయాడు.

"బావా !"

వీణ మీటినట్లు వినబడిన పిలుపు కాళ్ళకి బందం వేసింది అయినా తనని కాదన్నట్లు ముందుకు సాగాడు

"బావోయ్! నిన్నే — పెద్దవాళ్ళమీద కోప మయితే నేనేం అపరాధం చేశానో మధ్య" ఆఖరి మాటలు వణికాయి

గబుక్కున ఆగి వెనక్కితిరిగి ఆమెకు దగ్గరసా వెళ్ళాడు. కండ్లలో చంద్రుడు ధళధళలాడు తున్నాడు!

పశ్చాత్తాప పడ్డాడు తన మోటుతనానికి వాసు .. "క్షమించు సావిత్రీ, మనసు బాగోలేక —"

"సాయంత్రం మీ సంభాషణఅంతా విన్నాను బావా! నాన్న మూర్ఖత్వానికి నాకు బాధ కలిగింది" అని కాసేపాగి "నా కోసమయినా మా నాన్నతో కక పెట్టుకోకు బావా!" అంది దీనంగా

కరిగిపోయాడు వాసు.

"అసలు కక్షలులేవు సావిత్రి! నేనెప్పుడు ఆయన మేనల్లుడినే ఆయన ఒప్పుకుంటే అల్లుడ్నీ" అంటూ నవ్వాడు వాసు.

సావిత్రి కూడా నవ్వేసి పైట చెరుగుతో కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయింది.

రోజులు గడిచిపోతున్నాయి వాసుని స్నేహితులు ఏదో నిర యించమని తొందర చేసినా అతనుమట్టుకు ఆయనలో పరివర్తన రావాలని దానికి కాలం తప్ప శరణ్యంలేదని ఆగిపోయాడు

కోతలయిపోయి కుప్పలుకొట్టిస్తున్నారు రైతులు. పొలాలమీద లక్షల రూపాయలు విలువచేసే పంట పరుచుకునుంది పల్లెపట్లు లక్ష్మి తాండవమాడు తోంది ప్రొద్దుక్రుంకేప్పటికే సంక్రాంతి చలి గడ గడ లాడిస్తోంది.

కూలీలందరినీ ఇళ్ళకు పంపేసి ధాన్యపురాసి దగ్గర కాపలా కూర్చున్నాడు వాసు. చీకటి దట్టంగా అలుముకుంటోంది దూరంగా ఊళ్ళో, ఎలక్ట్రిక్ దీపాలు వెలిగాయి. వాటిని చూడగానే అతని కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి అవి సాధించేందుకు తన, తన మిత్రులు ఎంత కష్టపడిందీ, స్వంత డబ్బు ఎం, ఖర్చయిందీ అన్నీ అతని మనస్సులో మెదిలాయి. తం, చేతుల్లోంది దమ్మిడీ ఖర్చవలేదు కాబట్టి ఊరంతా సం తోషపడ్డారు

లింగమూర్తిగారి పార్టీమట్టుకు "మళ్ళీసారి అసెం బ్లీకి నిలబడతాడు కాబోలు—ఎరవేశాడు ముందు" అన్నారుట

నవ్వుకున్నాడు వాసు అరచేతిలో శ్రీకారం చుట్టు కుని కళ్ళకద్దుకున్నాడు. ఇంతలో ఊరివైపునుంచి రొప్పుకుంటూ పరుగెత్తుకొచ్చాడు వెంకట్రావు

అతని వాలకంచూసి "ఏరా, ఏమయింది" అంటూ ఖంగారుగా అడిగాడు వాసు

"కొంపే మునిగిందిరా వాసు మీ సావిత్రిని తాచుపాము కరిచింది స్పృహతప్పిపోయింది"

రాయిలా స్తంభించిపోయాడు వాసు.

"పొద్దుకూకుమూటున పక్కింటివారమ్మాయి వసంతతో కలిసి చెరువుగట్టుకు వెళ్ళిందిట నీళ్ళ కోసం. చీకటిలో పాముమీద కాలేసేప్పటికి కాటే సింది వెంటనే దాన్ని చంపారు. నువ్వు త్వరగా ఇంటికి వెళ్ళు నేనుంటానిక్కడ" అని వాసుని ఒక్క కుదుపు కుదిపేకగాని అత నీ ప్రపంచంలో పడలేదు.

కర్ర పుచ్చుకుని ఒక్క పరుగున వూళ్ళోకి వచ్చి పడ్డాడు. పది అంగల్లో లింగమూర్తిగారింటి గుమ్మం లోకివచ్చి లోపలిదృశ్యంచూసి అలాగే నిలబడిపోయాడు

అరుగుమీద పడుకోబెట్టారు సావిత్రిని. చలనం లేదు. కండ్లుమూసుకునున్నాయి నోట్లోంచిమట్టుకు కొద్దిగా నురుగు వస్తోంటే తుడుస్తున్నారు పోత పోసిన బంగారంలా ఉంది.

ఎవరో పాము మంత్రం తెలిసినాయన మంత్రం వేస్తున్నాడు అంతా ఆయన వంకనే చూస్తున్నారు లింగమూర్తిగారు నరికేసిన అరటిచెట్టులా గుడ్ల నీళ్ళు గుడ్లలోనే కక్కుకుంటూ గోడకి చేరగిల బడ్డాడు ఆపక్కనే వాసు తండ్రి, మునసబు ఉన్నారు.

సావిత్రి తల్లికి స్పృహ తెప్పించేందుకు ఉప చారాలు చేస్తోంది వాసు తల్లి.

"ఇప్పు డున్నపళంగా ఒక్క పావు గంటలో రైలు స్టేషనుకి తీసుకెడితే — అక్కడ రైలువాళ్ళు పాముల నరసయ్యగారికి ఫోనులో చెబుతారు. క్షణాలమీద నయ మవుతుంది" అంటున్నారు పూజారిగారు లింగమూర్తిగారితో ఇక్కడ మంత్రం వేస్తున్నాయన మంత్రబలం ఏపాటిదో తెలుసు పూజారికి!

లింగమూర్తిగారు గబుక్కునలేచి కూర్చుని "రాఘవులూ! మన పెద్ద ఎడ్ల బండి కట్టండిరా" అంటూ అరిచాడు

ఇంతలో సుబ్బయ్య "కాని మన వెధవ రోడ్డు మీద ఎంత త్వరగాపోయినా గంటకి తక్కువపట్టదు బాబూ" అంటూ మెల్లగా అన్నాడు.

అతనివంకొకసారిచూసి నిస్పృహతో చేతుల్లో ముఖం కప్పేసుకున్నారు లింగమూర్తిగారు.

వాసు గిరుక్కునవెనక్కితిరిగి ఇంటికిపరుగెత్తాడు వాడుకలేకపోయినా సిద్ధంగా ఉంచుతాడు అతను మోటారు సైకిలును. దాన్ని బయటికిలాగి క్షణంలో లింగమూర్తిగారింటిముందు ఆపాడు.

రెండగల్లో లోపలికివెళ్ళి ఎవ్వరివంకా చూడ కుండా సావిత్రిని ఎత్తి భుజాన వేసుకొని బయటికి తీసుకువచ్చాడు.

అదేమనలేదు ఎవరూ! బ్రతుకుజీవుడా అను కున్నాడు అక్కడి మంత్రాలాయన

చీకట్లోకి కాంతిని జిమ్ముకుంటూ దూసుకు పోయింది మోటారు సైకిలు

మనిషిలో పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడు అసాధ్యాన్ని సాధ్యం చేయగలదు. దానికి దైవబలం కూడా ఉంటే ఇంకా చెప్పనవసరంలేదు

ఆ ఇసకలో, గతుకుల్లో, చీకట్లో అతను ఎలా వెళ్ళాడన్నదానికి పై మాటే సమాధానం. పది నిము షాలకల్లా అసిస్టెంట్ స్టేషను మాస్టరు కంట్రోల్ ఫోనులో చెబుతున్నాడు "స్నేక్‌బైట్" అంటూ.

"నర్సయ్యగారు లేవమంటున్నారు లే" అని చెవులో అరచి మనిషి లేచిపోకుండా గట్టిగా పట్టుకోమన్నాడు. అలాగే అరిచాడు వాసు

కాసేపటికి కళ్ళు తెరిచి అంత బలంగలవాడిని వదిలించుకోవాలని పెనుగులాడసాగింది సావిత్రి. గట్టిగా వాటేసుకుని కూర్చున్నాడు వాసు

గంట సేపటికి మామూలు మనిషయిందికాని నీరసంగా ఉంది — కొంచెం అలస్యమయి ఉంటే

చెయి దాటిపోయి ఉండేదని స్టేషను మాస్టరు అన డంతో వాసు ఒళ్ళు జలదరించింది.

మెల్లిగా సావిత్రిని లేవదీసి వాళ్ళందరికి కృతజ్ఞత తెలిపి మోటారు సైకిలుమీద వెనక కూర్చోబెట్టుకుని ఇంటికి బయలుదేరాడు. అతని ఆనందం వర్ణనాతీతం సావిత్రిని బతికించుకున్నాడు !

మెల్లిగా వస్తున్న అతనికి దారిలో అతనిమిత్రులు సైకెళ్ళమీద ఎదురయ్యారు. తనంటే వాళ్ళకున్న ప్రేమకి అతని హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది అడుగడుగునా అడ్డంకులెదురయే రోజులలో తనకి చేయూతనిచ్చి, అండగా నిలిచారు వీళ్ళంతా. ఈ యువకులు లేకపోతే భవిష్యత్తుమీద ఆశ వదులుకుని ఏనాడో వూరు విడిచి పారిపోయేవాడు తను'' అనుకున్నాడు వాసు. అందరూ కలిసి రాత్రి పదింటికి లింగమూర్తిగారింటిముందు ఆగారు.

కన్నకూతురుని ఏఆకారంలో చూడవలసివస్తుందో నని హడలిపోతున్న లింగమూర్తిగారికి కనుపించిన దృశ్యం నేత్రపర్వంగా ఉంది.

వెనకసీటుమీద కూర్చుని రెండు చేతులతో వాసుని గట్టిగా పెనవేసుకుపోయి అతని వీపుమీద తలఆన్చి కూర్చుంది సావిత్రి.

ఆనందంతో ఇంటిల్లపాదీ మనసారా మళ్ళీ ఏడ్చారు

ప్రగతిపథం

మర్నాడు పొద్దున్నే పొలంనుంచి నేరుగా లింగమూర్తిగారింటికి వెళ్ళాడు వాసు. ఆయన ఇంట్లో లేడు.

''రావోయ్ అల్లుడూ'' అంటూ ఆహ్వానించి, వంటింట్లోకి వెళ్ళింది కాఫీకోసం సావిత్రితల్లి.

గదిలోకి వెళ్ళాడు.

నీరసంగా మంచంమీద పడుకున్న సావిత్రి అతన్ని చూడంగానే సిగ్గుతో ముఖాన్ని రెండు చేతులతో కప్పుకోబోయింది.

ఫక్కున నవ్వాడు వాసు —''ఎందుకో అంత సిగ్గు నన్ను చూడగానే. నిన్న నిన్ను ఎలా తీసుకు వెళ్ళానో తెలుసా — ఇలా ఎత్తుకుని'' అంటూ అమాంతంగా ఎత్తేశాడు.

''పో బావా — అమ్మా !'' అంటూ సిగ్గుపడిపోయింది సావిత్రి.

''ఏరోయ్ ప్రెసిడెంటూ —ఇప్పట్నుంచే ఎత్తుకుపోతావా ఏమిటిరా మా అమ్మాయిని'' అన్నారు లింగమూర్తిగారు గదిలోకి అడుగుపెడుతూనే ఆ దృశ్యం చూసి

ఇంతలో ఆయన భార్య కాఫీ తీసుకొచ్చింది

''సరేగాని, కట్నం ఏమాత్రం కావాలి ప్రెసిడెంటుగారికి—అడిగావా !''

''నాకు కట్నం ఎందుకు మామయ్యా !''

''అదేమిటోయ్ — నువ్వు అడగాలి, నేనివ్వాలి అడుగు'' అన్నారాయన నవ్వుతూ.

''అయితే నాకిస్తున్నానని అనుకుని మన రోడ్డుకి ఒక్క అయిదువేలు ఇచ్చి మా ప్రయత్నాన్ని ఆశీర్వదించు'' అన్నాడు బెరుగ్గా వాసు.

''ఆల్ రైట్. మనపద్దున పదివేలు రాయి. సరేగాని రేపు రోడ్డు పడ్డాక కారుకొంటాను. అమ్మాయికి కాల్లో ముల్లు గుచ్చుకుందంటే దాన్ని తీసుకుని మరుక్షణంలో నువ్వు బస్తీలో ఉండాలి తెలుసా ఆ .'' అని మనసారా నవ్వుకుంటూ ఇంట్లోకి పోయా రాయన.

''ఇక నాకు డ్రైవరుద్యోగమన్నమాట'' అన్నాడు వాసు చిలిపిగా సావిత్రి కండ్లలోకిచూస్తూ.

''మరే పాపం'' అంది బుంగమూతిపెట్టి సావిత్రి. ఆ సంక్రాంతి నవ సంక్రాంతి అయింది ఆ వూరికి.

★

మానవదేహస్థితి

పుప్పిపన్ను : దంతంలో కేరీస్

డా॥ గాలి బాలసుందరరావు

ఏ శరీర భాగమైనా, వ్యాధిగ్రస్తం కావడానికి కారణములు (1) అపాయము, (2) ఇన్ఫ్లమేషను, (3) ఆహార లోపములు, (4) నియోప్లాసము అని ఇదివరకే చెప్పాను దంతములూ శరీర భాగములే! వాటికి వచ్చే వ్యాధులు కూడా ఈవిధంగా విభజించ దగినవే. చిన్నవారిలోనూ పెద్దవారిలోనూ సాధారణంగా కనిపించే వ్యాధి పుప్పి పన్ను. ఇది ఆహార లోపముల వల్ల, దంత నిర్మితిలో ఏర్పడిన మార్పులవల్ల, దంతం క్రిమిదోషానికి గురి అయినందున ఏర్పడే వ్యాధి అందువల్ల పుప్పి పన్ను శరీర ఆరోగ్యములో అనేక లోపాలు సూచించే వ్యాధి

దంతములు, శల్యములు ఇటువంటి కఠినములైన శరీర భాగములు వికృతి పొంది క్రిమిగ్రస్తము లయినప్పుడు ఆస్థితిని 'కేరీస్' (Caries)అంటారు కేరీస్ దంతములలో, వెన్నుపాములో, శల్యములలో ఎక్కడ అయినా రావచ్చును. ఇందుకు కారణం అనేక రకములయిన క్రిములు కావచ్చును.

కేరీస్ నాగరకత ఏర్పడిన తర్వాత వచ్చిన కొత్త వ్యాధి కాదు. భూగర్భంలో కనుపించిన అతి ప్రాచీన కాలం నాటి పుర్రెలలో ఉన్న దంతములలో కేరీస్ ఉన్నదని శాస్త్రజ్ఞులు నిరూపించారు. కాని నాగరకత ఏర్పడ్డ తరువాత ఈ వ్యాధి విపరీతంగా పెరిగిపోయింది. అందువల్ల దంత శాస్త్రజ్ఞులు ఆ వ్యాధి విషయమై చాలా పరిశోధనలు జరుపవలసి వచ్చినది.

కేరీస్‌కీ ఆహార పదార్థములకూ చాలా సంబంధం ఉన్నట్లు కనుపిస్తుంది ఉత్తర ధృవ ప్రాంతంలో నివసించే ఎస్కిమోలు కేవలం మాంసాహారులు. వారిలో ఈ వ్యాధి ఎక్కడో గాని కనుపించదు.

భారతదేశంలో ఉత్తర హిందూ స్థానీయుల ఆహారంలో ముఖ్య వస్తువులు గోధుమ. వారి కూరలు సారవంతములు. మాంసము, శాకములు కూడా ఆధరువులే వారిలో నూటికి ఆరుగురు కేరీస్‌తో బాధపడుతున్నట్లు తేలింది.

దక్షిణ భారతదేశంలో వరి బియ్యం ప్రధాన ఆహారభాగం. శాకములు, మాంసము, ఆధరువులే కూర లంతగా సారవంతములు కావు. వీరిలో నూటికి పది మంది కేరీస్‌తో బాధపడతారు. పై ఉభయ జాతులలో కూడా పంచదారతో తయారయిన ఆహారములు తినేవారిలో ఈ వ్యాధి ఎక్కువగా కనుపించింది

మనవంటి ఆహారం తీసుకునే మలయా, చైనా దేశస్థులలో ఈ వ్యాధితో నూటికి 30 మందికి పైగా బాధపడతారని తేలింది ఈవిధంగా ప్రపంచంలో అన్ని దేశాలవారి దంతములను ఆహార స్వభావములను పరీక్షించగా మాంస ప్రధానమయిన ఆహారముతో జీవించే జాతులలో పుప్పి పన్ను తక్కువగా ఉన్నట్లు, శాక ప్రధానమైన ఆహారము తీసుకునే వారిలో ఎక్కువగా వ్యాపించి ఉన్నట్లు తేలింది నాగరకత పూర్తిగా వ్యాపించిన జాతులలో 6 సంవత్సరముల నుండి 13 సంవత్సరములకు మధ్య ఉన్న వయస్సుగల వారిలో ఈ వ్యాధి అతి సాధారణంగా కనుపిస్తున్నది. ఇంతే కాదు ఇది అతి శీఘ్రంగా దుర్నివార్యమై, చెడిన దంతమును పీకివేస్తేనే గాని మిగతా దంతములను రక్షించడానికి వీలులేని స్థితికి తెస్తున్నది

కేరీస్ అన్ని రకముల పళ్లలోనూ ఏర్పడ వచ్చును కాని, ఎక్కువగా నమిలే పళ్లలోనే ఇది కనుపిస్తున్నది. పురుషులలో కంటె స్త్రీలలో ఎక్కువగా కనుపిస్తున్నది. వయస్సు వచ్చిన వారిలో కంటే ఎదిగే పిల్లలలో ఈ వ్యాధి అధికంగా వ్యాపించు చున్నది

గత వ్యాసములలో ఉన్న దంత చిత్రములలో దంత నిర్మాణంలో ఉన్న అనేక భాగములను వివరించాను పుప్పి పన్ను అంకురించి వృద్ధిచెందే కాలములో యీ భాగములలో కలిగే మార్పులను క్లుప్తంగా వివరిస్తున్నాను

ఎనామెల్ పొర —కేరీస్ ఏర్పడగానే, ఎనామెల్ పొరలో జరిగే మొదటి మార్పు—దాని ధావళ్యం. మెరుపు తగ్గిపోవడం ఏ కారణంచేత నయినా దంతం తన నిగనిగ పోగొట్టుకొన్న దంటే అది అతి శీఘ్రకాలంలో కేరీస్‌కు బలి కాబోతున్నదన్నమాట. ఆ తర్వాత ఎనామెల్ పొర మీద తెల్లని మచ్చ ఏర్పడి క్రమంగా నలుపు రంగుకు తిరుగుతుంది ఎనామెల్ పొరలో స్ఫటికములు కరిగి రాలిపోయిన కొద్దీ ఈ నలుపు అధికమవుతుంది. క్రమంగా ఎనామెల్ పొర అంతా కరిగి డెంటైన్ పొర బయట పడుతుంది. కేల్షియం తక్కువగా ఉన్న ఆహారమూ, కేల్షియం శరీరంలో వినియోగం కావడానికి అవసరమైన విటమిన్ 'డి' లోపించిన ఆహారమూ తీసుకోవడం వల్ల ఏర్పడే రికెట్సు వ్యాధితో బాధపడే పిల్లలలో దంతము లన్నింటిలో ఎనామెల్ పొర పూర్తిగా ఏర్పడదు. దానికి ధావళ్యం ఉండదు. వాటికి క్రిముల ధాటిని తట్టుకునే శక్తి ఉండదు. అందుకని అవి త్వరగా కేరీస్‌కి గురి అవుతవి. ఇటువంటి వారినోటిలో ఉండే లాలాజలము—సెలైవా (Saliva) ఏసిడ్ స్వభావం కలిగి ఉంటుంది సాధారణంగా సెలైవా క్షారగుణం కలది (Alkaline)

డెంటైన్ —ఎనామెల్ పొరను ఛేదించిన తరువాత కేరీస్ డెంటైన్ పొరను తొలుచుకుపోతుంది. అదీ క్రమంగా నల్లబడి పోతుంది. ఈవిధంగా ఏర్పడిన గుంటలో ఆహార పదార్థములు చేరి కుళ్లి, క్రిములకు చక్కని స్థావరములై దంతము పుప్పి చేయడానికి వీలు కలుగుతోంది. లాలాజలంలో ఏసిడ్ స్వభావం అధికమైన కొద్దీ డెంటైన్ కూడా త్వరగా జీర్ణిస్తుంది. ఎనామెల్ పొర, డెంటైన్ పొర జీర్ణించగానే క్రిములు పంటి గుజ్జులో ప్రవేశించి చీము ఏర్పరుస్తవి. ఆ స్థితిలో ఆ దంతాన్ని బాగు చేయడం చాలా కష్టం.

కేరీస్ ఏర్పడ్డ తరువాత ఎనామెల్‌లోనూ డెంటైన్‌లోనూ కలిగే ప్రధానమైన రసాయనిక వికృతి—అందులో కేల్షియం లవణములు తగ్గిపోవడం.

ఎనామెల్ పొరను, డెంటైన్ పొరను తినివేసేది లాలాజలంలో ఏసిడ్ అని చెప్పాను. ఈ ఏసిడ్ ఎక్కడనుంచి వస్తున్నది. ?

మన ఆహారంలో ప్రొటీనులు (Proteins), కార్బోహైడ్రేట్లు(Carbohydrates), హైడ్రోకార్బనులు (Hydrocarbons), లవణములు (SalTs), నీరు, విటమినులు అని ఆరు విధములైన ఆహారపదార్థము లున్నవి. వీటిని గురించి విపులముగా జీర్ణక్రమము వర్ణించేటప్పుడు చర్చిస్తాను. ప్రొటీనులలో నైట్రొజను ఉంటుంది. కార్బోహైడ్రేటులలో ఆక్సిజన్ హైడ్రోజన్ నీటిలో ఉన్న పరిమాణాల్లో ఉంటవి. ఇవికాక కార్బను ఉంటుంది. హైడ్రోకార్బన్‌లోనూ ఈ వస్తువులే ఉన్నా, ఆక్సిజన్, హైడ్రోజన్ నిష్పత్తిలో ఆక్సిజన్ తక్కువగా ఉంటుంది.

ఈ ఆహార పదార్థములలో ప్రొటీనుల నుండి ఏసిడ్ చాలా కొంచెం, ఆల్కలైన్ పదార్థం అధికంగా తయారవుతవి. హైడ్రోకార్బనులు నోటిలో ఏ మార్పూ చెందవు. నీరు, ఏసిడ్ కాదు. ఆల్కలైన్ కాదు. లవణములు మిశ్రమ స్వభావం కలవి. ఇవి ఎక్కువగా కాయగూరలు పళ్లు వీటినుంచి తయారవుతవి. కాని అవి నమిలి మింగినపుడు నోటిలో మిగలవు. ఇక పోతే కార్బోహైడ్రేటులు మీద కొన్ని రకములయిన క్రిములు పనిచేసినప్పుడు కొన్ని రకములయిన ద్రావకములు అధికంగా ఉత్పత్తి కావడానికి వీలున్నది ఈ ద్రావకములలో లేక్టిక్ ఏసిడ్ చాలా ముఖ్యమైనది.

లేక్టో అన్న మాటకు క్షీర సంబంధమైనది అని అర్థము. పాలు విరిగినప్పుడు ఈ ద్రావకం అధికంగా తయారవుతుంది అందుకని ఆదిలో ఈ ద్రావకమునకు ఈ పేరు వచ్చి మిగిలి పోయింది. చల్లలో పుల్లని రుచి ఈ ద్రావకము వల్లనే ఏర్పడుతుంది. కార్బోహైడ్రేటులు, లాలా జలంలో ఉన్న ప్టైలిన్ (Ptylin) అనే జీర్ణ వస్తువులవల్ల అనేక రకములయిన పంచదార లుగా మారుతుంది. చెరకు పంచదార, తేనెలో పంచదార, పాలలో పంచదార, పళ్ళలో పంచదార ఇల్లా ఎన్నో రకములయిన పంచదార లున్నవి. ఆటవికులకు, వన్యమృగాలకు పంచదార పంచదారగా లభించదు ప్రోటీనులలో కలిసిఉన్న కార్బోహైడ్రేటులు మాత్రమే వారికి లభిస్తవి. కాని నాగరకత, రసాయనిక విజ్ఞానం మనకు రకరకాల పంచదారలను అనుగ్రహించింది ముడి హైడ్రేటుల కంటె ఈ పంచదారలు తేలికగా జీర్ణమై శక్తిని ఇస్తవి. కాని కొన్ని క్రిముల ప్రభావంతో, అతి తేలికగా పులిసి ఏసిళ్ళను సృష్టిస్తవి. ఈ రకరకముల పంచదారల నుండి చాకొలేట్లు, పేస్ట్రీలు, ఐస్‌క్రీములు, బిస్కట్లు ఇల్లాంటి తినుబండారా లెన్నో తయారవుతున్నవి. ఇవి తేలికగా లాలాజలంలో కరగవు పళ్ళ మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో ఇరుక్కొని నిలువ ఉండి పోతవి. వీటిమీద క్రిములు వలసరాజ్యాలు స్థాపించుకుని పరిపాలన సాగిస్తవి కార్బోహైడ్రే టులే కాక మ్యూకస్ అనే జిగురు పదార్థం కూడా ద్రావకములు లోను రసాయనిక వికృతివల్ల సృష్టి స్తుంది. జలుబుచేసినప్పుడు, చిగుళ్ళు వాచి నప్పుడు ఈ మ్యూకస్ ఎక్కువగా తయారయి తిరిగి నోటిలో ద్రావకం తయారవుతుంది. ద్రావకం తగలగానే ఎనామెల్‌లో కేల్షియం లవణ ములు కరిగిపోతవి

గత శతాబ్దములలో పుప్పి పన్నులు విపరీతంగా పెరిగిపోయినవి ఇందుకు కారణములు ఇద మిత్థమని శాస్త్రజ్ఞులు నిర్ణయించలేదు ఇది కేవలం ఆహార లోపంవల్ల వచ్చే వ్యాధి కాదు. అనక ఆహార లోపములున్న పేదవారి పిల్లల్లో కేరీస్ అతి సక్రమంగా కనుపిస్తుంది

చాలామంది ఇంత విజ్ఞానవేత్తలు, నాగరక యుగం వచ్చాక నమలవలసిన అవసరం తగ్గి పోయిందని భావిస్తున్నారు. మన తినుబండార ముల పచనము, నాలికి నిలవవుంచే విధము, వాటి జిగురు స్వభావము, వాటి మృదుత్వము ఇవన్నీ నమలవలసిన అవసరాన్ని చాలా తగ్గించినవి. కస్టర్డ్ పుడ్డింగ్, హల్వాలు, క్రీములు ఇవన్నీ ఎవరూ ఎక్కువగా నమలరు ఆ కొద్దిగా నమిలితే కాలంలోనే ఇవి పళ్ళల్లో ఇరుక్కుంటవి. పళ్ళ కొరికేవి, చీల్చేవి, నమిలేవి అని మూడు రకము లని యిదివరకే చెప్పాము ఈ మూడు రకము లయిన పళ్ళకు తగిన పరిశ్రమ కలిగించే పదార్థ ములు, మన భోజనంలో ఉండాలి నమిలితేనే గాని రుచించనిది, జీర్ణం కానిదిగా మన ఆహారం ఉండాలి ఆహారంలో తగినంత పీచు పదార్థం ఉన్నప్పుడే ఇంతగా నమలడం సాధ్యం అవుతుంది. ములక్కాయలు, కొన్ని దుంపలు, కొరుక్కుతినే కాయలు, తేగలు యిటువంటివి నమిలేటప్పుడు దంతములకు దవడలను ఆడించే కండరములకు



చిత్రకారుడు : పి. ప్రకాశ్ (హైదరాబాదు)

మనమూ — మనదేహస్థితి

తగిన పరిశ్రమ లభిస్తుంది. అప్పుడు వాటిలో రక్త ప్రసారము అధికమై అందులో ఉన్న గ్రాండులకు పుష్టి వచ్చి వాటి స్పందనములు అధికమవుతవి ఈ పీచు పదార్థం ప్రేగుల్లోకి పోయినప్పుడు వాటిని ఇరిటేట్ చేసి మల బద్ధకం లేకుండా చేస్తుంది. అందుచేత ఆహార సారములను నేరుగా తీసుకోవడం దంతారోగ్యం రీత్యా మంచిదికాదు. మనం తీసుకునే ఆహార ములో దేహంలోకి పోయే ఆహారమును సారమనీ, మిగిలిపోయి బయటికిపోయే పదార్థము 'కిట్టము' అనీ ఆయుర్వేద శాస్త్రజ్ఞుల అన్నారు ఆహారంలో సార కిట్టములకు ఒక నిష్పత్తి ఉండాలి నోరు దుర్గంధ భూయిష్టం కావడానికి ముఖ్య కారణము లలో మలబద్ధకం ఒకటి ఆహారం బాగా నములు తున్నప్పుడు దంతముల పరిశుద్ధము లౌతవి పీచు పదార్థము దంతముల మధ్య ఇరుక్కోవచ్చును. కాని అవి క్రిములకు స్థావరం ఇవ్వవు. దంతము లను తినివేయవు. గత అరవై సంవత్సరములలో మానవాహారములో కార్బోహైడ్రేటులు అధిక మైనవి. పోనుపోను అవయినా ముడి స్థితిలో కాక అతి సున్నితమయిన పిండిగా, ఆ పిండితో చేసిన తీపి పదార్థముగా ఎక్కువగా తినడం జరి గింది. పిప్పిపళ్ళు తరుచు ఏర్పడడానికి ఇది ప్రధాన కారణం. పంచదారతో తయారయిన మిఠాయిలు అధికంగా తినేవారిలో ఈ వ్యాధి అధికంగా కను పిస్తున్నది. "ముద్ద ముప్పై రెండుమార్లు నమలాలి" అన్న పూర్వీకుల మాటల్లో అతిశ యోక్తి ఏమీలేదు.

దంతములకు తగిన పరిశ్రమ, వాటిమధ్య ఆహార పదార్థములు ముఖ్యంగా పంచదార పదార్థములు ఇరుక్కోకుండా వాటిని పరిశుభ్రంగా ఉంచడం, తరుచు వాటిని నిపుణుని చేత పరీక్ష చేయించు కొనడం చాలా అవసరం.

ఆధునిక పరిశోధనల వలన, లేక్టోబేసిల్లస్, ఏసిడో ఫైలస్ అనే క్రిమి పంచదార పదార్థము లను నోటిలో పులవబెట్టగా లేక్టిక్ ఏసిడ్ తయా రయినందున కేరీస్ విపరీతంగా వ్యాపిస్తున్నదని శాస్త్రజ్ఞులు నిర్ధారణ చేశారు

ఎనామెల్ పొర, డెంటైన్ పొర, జీర్ణించి దంతపు గుజ్జు బయటపడేలోగా దంతవైద్యుడు పుచ్చిన పన్నును పీకకుండా బాగుచేయగలడు ఒక మాటు దంతాంతరాళంలోకి రంధ్రం ఏర్పడి పంటిగుజ్జు బయట పడితే ఆ దంతమును బాగు చేయడం అతి దుర్లభం అందుచేత తరచు దంతములను పరీక్షచేయించుకోడం చాలాఅవసరం.

పుప్పిపళ్ళు ఏర్పడడానికి నిశ్చయమైన కారణం కనుపించదు. కాని, నమలకుండా మెత్తని పిండి పదార్థములను ఎక్కువగా సేవించే వారిలో ఈ వ్యాధి తరచు కనుపిస్తున్నమాట నిజం. అందు వల్ల ఈ విషయంలో తగిన జాగరూకత వహిస్తూ దంతం పుచ్చడం ఆరంభించగానే వెంటనే దంతవైద్యుడి దగ్గరకు వెళ్ళి తగిన చికిత్స చేయించుకుంటే ఆ పన్నునూ ఆ ప్రక్క పళ్ళనూ కాపాడుకుని పంటి పోటు రాకుండా చేసుకోగలుగుతారు. ★

అటు సన్నాయి మేళంలో వినతాసుతవాహనుడై కాంచీ వరదుడు బయల్దేరు తుండగా, యిటు రికాబులో కాలుపెట్టి, కళ్ళాన్ని బిగపట్టి, చివాలున పైకెగిరి, గుర్రంపైన కూర్చున్నాడు శేషాద్రి. మున్నెన్నడూ చేసి చూడని పని! శేషాద్రి కాస్త తబ్బిబ్బు పడిన మాట నిజం. కానీ అది తొట్రుబాటు సమయం కాదని శేషాద్రికి తెలుసు. వెయ్యి కళ్ళు తనవైపు పరకాయించి చూస్తున్నాయి. తనలోని ప్రతి కదలికకూ ఎక్కడలేని ప్రాధాన్యం వచ్చిపడిన ఈ విచిత్ర పరిస్థితిలో తనెంత జాగ్రత్తగా వుండగలిగితే అంత మంచిది ....

సర్దుకుని చక్కగా కూర్చున్నాడు శేషాద్రి. పిలున్నంతలో ఠీవిగానే కూర్చోగలిగా మన్న నమ్మకం కలిగిన తరువాత, అత డొకసారి తన చుట్టూరా కలయ పరికించాడు. ఎట్టఎదుట మేళం మ్రోగు తోంది. ఆ మేళంలో ప్రత్యేకించి చెప్పుకోదగిన ముఖ్యాంశం డోలు. మేలు మేలు! అది డోలు కాదు—శివతాండవాన్ని చూస్తూ పరవశుడై తలా డిస్తున్న నందికేశ్వరుడి గింగడోలు! మెడలోని బంగారపు గొలుసు జిగేల్ జిగేల్మని మెరుస్తుండగా, పైకెగిరి, పాయలుగా చీలి, సుళ్ళు తిరిగి రకరకాలుగా రోజుకుంటూ గిరజాలు పున్నమనాటి సముద్ర తరంగాల్లా కల్లోల పడుతుండగా ఆ డోలు వాద్యగాడు మనసిచ్చి, లాలించి బుజ్జగించి బుగ్గలు చుంబించి, అంతలో మూతి బిగించి, నుదురు చిట్లించి పెడముఖం పెట్టి సాధించి, చిట్టచివరకు ఉపాయాంతరం లేక దాసోహ మన్నట్టుగా తలవంచి పెళ్ళాన్ని ఏలుకోడంలో వున్న వెయ్యి ఒడుపుల్ని తన వాద్య విద్యమూలంగానే విశదీకరిస్తున్నాడు. ఒక్కుమ్మడిగా పెళ్ళికొడుకును అభిషేకించవలసిన చూపుల్ని తనవైపుకు మళ్ళించు కుంటున్నందుకు డోలు వాద్యగాడి పైన కోప్పడుతూ, అతడు ముక్తాయింపులు ముగించగానే నాదస్వరాలు పైకెత్తి, శేషాద్రిని నిర్దేశించి 'అందరూ ఈవైపే చూడాలి! ఇతడే పెళ్ళికొడుకు' అని మేళగాళ్ళ హెచ్చరికలు ధ్వనిస్తున్నాయి. మేళం చుట్టూ నిల్చుని సంగీత రసాస్వాదనలో ఒళ్ళు మరచిన రసికులు కొందరు తమకు తలా ఒక డోలూ, నాదస్వరమూ లేని కొరతను చిటికెలు వేయడం మూలంగా, తలపంకించడం మూలంగా సర్దుబాటు చేసుకుంటున్నారు. పెళ్ళి కుమారుడి వెనుక వైపున పట్టు చీరలు కట్టుకున్న పెద్ద ముత్తయిదువుల దగ్గరినుంచీ, పరికిణీలు కట్టి ఓణీలు వేసుకున్న కన్నెపడుచుల వరకూ వివిధ వయోరూపలావణ్యాలతో ఒప్పారుతున్న తన్వంగులు ఈ వూరేగింపునే గాదు, ధరిత్రిచరిత్రను సైతం ముందుకు నడిపిస్తున్నది మేమే నన్నంత ధీమాతో, మత్తేభాలతో పోటీ పడుతూ, మరాళాలకు సవాళ్ళు విసురుతూ అడుగులు కదిలిస్తున్నారు.......

దొంగ చూపులతో తన వైపోసారి చూచుకున్నాడు శేషాద్రి. ఫరవాలేదు! తను గూడా ఏమంత నాసి రకం పెళ్ళికొడుకులా లేడు. చుంగులు జీరాడుతున్న పంచకట్టు. మిసమిస లాడుతున్న సిల్కు లాల్చీ. కుడిభుజం పైనుంచి క్రిందికి తీసి ఎడమ వైపున ముడివేసిన పట్టు సెల్లా. మెడలో పుష్పహారం! తనకేం, లక్షణంగా ఉన్నాడు. ఈ పోజులో తనను ఫోటో తీస్తే, ఆ ఫోటోలో తను పుర వీధుల్లో వూరేగుతున్న పిన్నపాళె గాడిలా ఉంటాడు!

శేషాద్రి మళ్ళీ తల పైకెత్తాడు. బారులు తీర్చి నిల్చున్న మంటి మిద్దెల మధ్య పెట్రోమాక్సు లైట్ల వెలుగు వెల్లువల్లో పెళ్ళి వూరేగింపు పూల తెప్పలా సాగిపోతోంది.

శేషాద్రి పెదవులపైన లీలగా ఓ చిరునవ్వు తటిల్లతలా మెరిసి తటాలున మాయమైంది. ఇదేదో నడిమంతరపు సిరిలా ఉంది.

కాకపోతే ఒకరోజు రాచరికంలాంటి దనుకోవచ్చు. మూడు ముళ్ళుపడి ముహూర్తం ముగిసేదాకా తనకు రాజ మర్యాదలు జరుగుతాయి. షోడశోపచారాలు సమకూరుతాయి. కోరితే కొండమీది కోతైనా క్రిందికి దిగి వస్తుంది. ఒరే శేషాద్రీ అంటూ చనువుగా కొందరు. ఇదిగో నాయనా శేషూ అంటూ ముద్దుగా కొందరు. ఇంకా రకరకాల వావి వరుసలతో మరి కొందరు. వీళ్ళందరూ తనను పీటల పైన కూర్చోబెట్టి సంసార సామ్రాజ్యానికి యువరాజ్య పట్టాభిషేకం కట్టి ఎవరి దారిన వాళ్ళు చక్కా వెళ్ళిపోతారు!

అంతవరకూ బాగానే ఉంది. కానీ ఆ తరువాత ?

అర్ధాంగి అనుకూలవతి అయితే సంసారం స్వర్గ సుఖాలకు ఆవాస మవుతుంది. కానైతే అందుకు ప్రతికూలంగా జరగదని మాత్రం పూచీ ఏముంది?

అందుకే మరి, ఎవడో లోకజ్ఞుడు వివాహాన్ని లాటరీతో ఉపమించాడు.


శేషాద్రి విషయంలో లోకోక్తి అక్షరాలా నిజమనిపిస్తుంది. ఎందుకంటే పెళ్ళిచూపుల మిషతోనైనా అత డొకసారి తన జీవితంతో పాలు పంచుకోనున్న అమ్మాయిని చూచే అవకాశాన్ని గోల్పోయాడు. పార్సెలు అంద చందాలనుబట్టి అందులోని వస్తువు ఎలాంటిదో తెలుసుకోడానికి ప్రయత్నించడం శుద్ధ తెలివితక్కువనుకున్నాడు. లౌకిక జ్ఞానానికి సంబంధించి నంతవరకూ తన కంటే ఏడాకులు ఎక్కువగా చదివిన తల్లి ఆ సంబంధం పట్ల మొగ్గు చూపింది గనుక, తాను ప్రత్యేకంగా అమ్మాయిని చూడవలసిన అవసరం లేదనీ, ఆ సంబంధం తనకు ముమ్మాటికీ నచ్చినట్టేననీ నిక్కచ్చిగా తేల్చి చెప్పేశాడు.

"హవురా శేషాద్రీ! నువ్వెంతవాడి వయ్యావురా నాయనా! అంతా నా యిష్ట ప్రకారమే జరిగితే ఆ తరువాతనీ పెళ్ళానికి అత్త పోరుండదనే గదూ నీ పథకం!" అంటూ నిస్తూపోయింది పార్వతమ్మ.

"మరి నేను పుట్టింది ఎవరి కడుపులోనే అమ్మా!" అన్నాడు నవ్వుతూ శేషాద్రి.

సన్నాయి మేళంలో సాటిలేని రీతిగా కల నిజమై మీది కెంతో హాయిగా కోరిక తీరుతుండగా జాగ్రత్తగా గుర్రం దిగి నాలు గడుగులు ముందుకు వేసిన శేషాద్రి 'కుడికాలు, కుడికాలు' అంటూ వెనుకవైపు నుంచి వినవచ్చిన కేకను విని హఠాత్తుగా ఆగిపోయాడు.

ఆగిపోయిన శేషాద్రి తన కుడికాలు నొక



"కాటుక

ఆశళ్ళల్లో ప్ర

అమాయకత్వం!

"లోకజ్ఞ

కోడలుగా పరి

శేషాద్రి

మధురాంతకం



...కలమధ్య అరవిచ్చుకున్న కలువపువ్వుల్లాంటి కళ్ళు.
...ంచమంటే ఏమిటో ఈమెకు తెలియదేమో ననిపించే
..."

...కు కాణాచిలాంటి తనతల్లి ఏమిమాంచి ఈమను తన
...చింది?"

...జాలిపడ్డాడుగూడా!...

కొత్త పెళ్ళి

రాజారాం

సారి జాడించి చూచుకున్నాడు గూడా! అది పదిలంగానే ఉంది.

"అది కాదురా శేషాద్రీ! మొదట కుడి కాలు పెట్టాలి" అంటూ ఓ ముసలాయన ముందు కొచ్చాడు.

"ఓహో అదా! చంపేశావుపో బాబాయ్ ..." అన్నాడు శేషాద్రి.

"శుభమా అని పెళ్లి చేసుకుంటూ అదేం మాటరా నాన్నా! రక్షించావుపో అనాలి ..." అన్నాడు శేషాద్రి బాబాయి.

ఒకటి రెండు క్షణాల పాటు ఆ మాట నిజమే కాబోలు ననుకున్నాడు శేషాద్రి. సమయానికి ఆపద్బాంధవుడిలా బాబాయి హెచ్చరించాడు కాబట్టి సరిపోయింది గానీ లేకుంటే ఏమై ఉండేది? మనిషి కున్నవి రెండంటే రెండే పాదాలు గనుక, వాటిలో ఏదో ఒకటి కదిలించకపోతే నడక సాగదు గనుక తను ఎడమ పాదం మోపినా మోపి ఉండవచ్చు. మోపితేఏమై ఉండేది? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లభించదు. లేదంటే అనుమానానికి జవాబుగావెయ్యి అనుమానాలు స్ఫురిస్తాయి.

శేషాద్రికి చాదస్తాలంటే గిట్టవు. ఉదయం లేచింది మొదలు, రాత్రి పడుకునే వరకు అడుగడుగునా ప్రతికార్యకలాపానికి ఎదురయ్యే మూఢ విశ్వాసాలను జాతిజీవనంలో నుంచే పెకలించి వేయాలని శేషాద్రి కలలు కనేవాడు. అవకాశం దొరికినప్పుడు సభల్లో ఉపన్యసించేవాడు గూడా!

మాటలు కోటలు దాటుతాయి కానీ కాళ్ళు గడపదాటవంటారు. ఆమాట శుద్ధ అబద్ధం! ఎందుకంటే శేషాద్రి కాళ్ళు అవలీలగా గడపను దాటేశాయి. ఆ దాటడంలో ప్రయత్నపూర్వకంగా నైతేనేమి అప్రయత్నం నైతేనేమి మొట్టమొదట అతని కుడిపాదమే మామగారింటిని పావనం జేసింది.!

పచ్చివాసనలు వీస్తున్న పచ్చని కొబ్బరి మట్టల పందిరిక్రింద నుంచీ నడిచి వెళ్ళి, నట్టింట్లో తనకోసం పరిచిన చాపపైన కూర్చున్నాడు శేషాద్రి. పనులతొందర మూలంగా అంత వరకూ పెళ్లికొడుకును చూడలేకపోయిన ఆడ పెళ్లివారు ఒక్క పెట్టున శేషాద్రి చుట్టూ మూగిపోయారు. వీధిలోనుంచీ పందిరి క్రిందికి వినవచ్చిన వాద్యఘోష తాకిడికి, చాపలపైన పడుకుని నిద్రపోతున్న పసికుంకలు ఉలికిపడి లేచి కూచుని రాగాలాపన ప్రారంభించేశారు. శేషాద్రి కూర్చున్న చోట గాలి కదలడంలేదు. కనిపించిన ప్రతి ముఖమూ కొత్త ముఖం కావడంవల్లనైతేనేమి, అందరూ తనవైపు పరిశీలనగా చూస్తుండడంవల్లనైతేనేమి శేషాద్రి మానసికంగా గూడా ఉక్కిరిబిక్కిరై పోసాగాడు.

నిమిషాలు దొర్లిపోతున్నాయి, అక్కడ తనెంత సేపలా నిశ్చలంగా కూర్చోవాలో శేషాద్రికి తెలిసి రావడంలేదు. ఎంతగా తను నిర్లిప్తంగా ఉండడానికి ప్రయత్నించినా, సుముహూర్తం దగ్గరించినకొద్దీ తన పని ముళ్ళపైన కూర్చున్నట్టుంది. పెళ్లికూతురు కనిపించేదాకా తన పరిస్థితి యిలాగే ఉంటుందేమో! ఐనా తొందరపడి లాభమేముంది? దీక్షావిధి సాంగోపాంగంగా పరిపూర్తి అయితేకానీ యిష్టదేవత ప్రత్యక్షం గాదు.

గడియారం చూచుకున్నాడు శేషాద్రి. గంట పది కావస్తోంది.

పదిన్నరకల్లా భోజనాలు వడ్డించేశారు. చివరి పంక్తి లేచేసరికి పన్నెండు దాటింది.

భోజనానంతరం భుక్తాయాసమైనా తీరక మునుపే శేషాద్రిని తీసుకెళ్లి నలుగులకు కూర్చోబెట్టారు. చెంపలకూ, చేతులకూ గంధం పూసి, పన్నీటి జల్లులో ముంచి లేవనెత్తారు. చల్లచల్లగా చలిగాలి వీస్తున్న ఆ అర్ధరాత్రి సమయాన ఈ నలుగుల తతంగం శేషాద్రి కేమంత సుఖావహంగా లేదు. ఐనా అతడు పెదవి కదపకుండా, కదలని పెదవిపైన మందహాసం చెదరకుండా అక్కడ తన పాత్రను సక్రమంగానే నిర్వహించాడు.

చివరకు అభ్యంగనాలు గూడా ముగిశాయి. పట్టు పంచ గట్టుకుని, నడుముకు ఉత్తరీయం బిగించిన పురోహితుడు ముక్కాలి పీటపైన కలశ స్థాపన చేసి వివాహకార్యక్రమానికి నాంది వాచకాలు చదువుతున్నాడు. రాత్రంతా నిద్ర లేక స్వల్పంగా ఎరుపెక్కిన కళ్లతో శేషాద్రి పెళ్లి పీటపైన కూర్చున్నాడు. సందడి చేయవలసిన కుర్రకారంతా నిద్రలో ఉండడంవల్ల పందిరి క్రింద వాతావరణం ప్రశాంతంగా ఉంది. నిరీక్షణాప్రబంధంలో అంతిమాశ్వాసంలో ఉన్న శేషాద్రికి జరుగుతున్న ప్రతిక్షణమూ తన ఓర్పును పరీక్షిస్తున్న మహాయుగంలాగానే భాసిస్తోంది.

తల వంచుకుని కూర్చున్నాడు శేషాద్రి. పందిరిలో ఏవైపునుంచో గాని మనుషులు లేస్తున్నట్టు, లేచి ఎవరికో దారి చేస్తున్నట్టు సన్నగా అలికిడి వినవచ్చిం దతనికి! తటాలున తల పైకెత్తాడు శేషాద్రి. ముత్తయిదువ ఒక్కర్తు దారి జూపుతుండగా, కన్నెపడుచు ఒక్కతె ముందుకు నడిపిస్తుండగా పెళ్లికూతురు మెల్ల మెల్లగా పీటల వైపు సాగి వస్తోంది.

ఒకటి ... రెండు .... మూడు .... శేషాద్రికి ఆ మూడు క్షణాలపాటు అనిమిషత్వం సిద్ధించింది.

ఆమె పొడుగరి కాదు. అలాగని పొట్టిగా, బొద్దుగా లేదు. రెపరెపలాడుతున్న పట్టు చీరలో ఆమె ఉత్సవానికి బయల్దేరిన దేవీ విగ్రహంలా ఉంది. శరీరచ్ఛాయ అచ్చమైన ఎరుపు గాదు. గులాబీ రేకుకు మల్లె తెలుపు కలిసిన ఎరుపు. కాటుక రేఖల మధ్య అరవిచ్చుకున్న కలువ పువ్వుల్లాంటి కళ్లు. ఆ కళ్లల్లో ప్రపంచమంటే ఏమిటో ఈమెకు తెలియదేమో ననిపించే అమాయకత్వం! శేషాద్రి ఆశ్చర్యపడ్డాడు—లోకజ్ఞతకు కాణాచి లాంటి తన తల్లి ఏమిచూచి ఈమెను తన కోడలుగా వరించింది ?

శేషాద్రి జాలిపడ్డాడు గూడా! ఈ అమ్మాయిని గనుక యింతకుమునుపే చూచివుంటే తనీ పెళ్లికి సమ్మతించేవాడు కాడేమో! అందం చాలక కాదు! అద్దాల బీరువాలో పదిలంగా ఉంచుకుని కనుల పండుగా చూచి ఆనందింప దగిన అందమైన వస్తువును నేలపైకి గిరవా బెట్టడం తనకు మనస్కరించదు. బొమ్మ పెండిండ్లకు పోనొల్లనని బిడియపడే బాల ఎక్కడ ? రణరంగ మెక్కడ ? స్నిగ్ధ సుందరమైన ఈ లావణ్యం

కవ్వింతెమ్మెర

గృహకృత్యాల అలజడిలో బడలిపోవడం తను చూడలేదు. అంతగా కాదు కూడదీ అమ్మాయినే చేబట్టాలని తల్లితోబాటు తన హృదయం కూడా పట్టుబట్టివుంటే, అప్పుడు సైతం తను తొందరపడేవాడు గాదు. నాలుగేళ్లపాటు ఓపిక పట్టమని నచ్చజెప్పి—ఆ వ్యవధిలో కుటుంబ జీవితానికి సంబంధించిన పాఠాలను శ్రద్ధగా అధ్యయనం చేయవలసిందని తనే అమ్మాయికి సలహా యిప్పించి వుండేవాడు !

ఆకుల గుబురులో అణగిమణగి ఉన్న పుష్పగుచ్ఛంలా పెళ్లికూతురు పీటపైన ఒదిగి కూర్చుంది. శేషాద్రి ఓరకంటి చూపులు బారులు కట్టిన తుమ్మెదలై ఆ కన్నెపడుచు ముఖ సౌందర్యాన్ని గ్రోలడానికి ఉరకలు వేస్తున్నాయి. శేషాద్రి తనలో తానే నవ్వుకున్నాడు — పెద్దలు చెప్పడాని కేమి! వాళ్లు పెక్కు సూక్తులను నొక్కి వక్కాణించారు. వాటిలో రూపం కన్నా గుణం ప్రధానమన్నది ఒకటి! కానీ మున్ముందుగా కళ్ల ఎదుట ప్రత్యక్షమయ్యే రూపాన్నిగురించి పట్టించుకోకపోవడం మానవుడి స్వభావం గాదు. మాటా పాటా, నవ్వూ నడకా, సిగ్గూ, చిరుకోపమూ లాంటి వెయ్యి హంగు లున్నాయి రూపానికి! ఇన్ని దారాలు పెనవేసి పేనిన త్రాళ్లతో వూగే శృంగారడోల రూపసౌందర్యం!

కానీ సృష్టిలో అందమైన ప్రతిదీ అభిలషింపదగినదిగా వుండటంలేదు. చూపులకే గానీ మేపులకు పనికిరాని పళ్లెన్ని లేవు! కళ్లకు కమనీయంగా కనిపించి, దగ్గరికి రాగానే ముక్కులు మూసుకోవలసిన పువ్వు లెన్ని లేవు! వెయ్యిరేకుల జలజానికున్న అందంతో పోల్చి చూస్తే, మల్లెమొగ్గ ఏపాటిది ? ఐతేనేం, మల్లెమొగ్గ కమ్మని తావికి కాణాచి. దాంభిక ప్రవృత్తికి నిలయం లాంటి తామర పువ్వును తలలో పెట్టుకునేవారు లేరు. పూజావిధుల కది సుతరామూ పనికిరాదు. తరుణులు తలదాల్చడానికైనా, పరమేశ్వరుడి పాదసేవ కైనా ఉపకరిస్తున్నవి నిరాడంబరతకు, వినమ్రతకు నెలవులైన మల్లె మొగ్గలే! అందుకే

డాక్టరు—ఏమండీ, పడిశం పట్టినప్పుడు రాత్రులు మీ పళ్ళు గజగజ లాడతాయా ?

రోగి—ఏమో చెప్పలేనండి అవి రాత్రులు బీరువాలో ఉంటాయి.

రియాజ్ పాషా (కాకినాడ)

మరి, అందచందాలకంటే ఆత్మసౌందర్యం ముఖ్యమంటారు.

గొలుసుకట్టులా సాగిపోతున్న శేషాద్రి ఆలోచనా స్రవంతి యిక్కడ మలుపు తిరిగింది. తనను పెళ్లికొడుకును చేసి సాగనంపుతూ కళ్లనీళ్లు పెట్టుకున్న తల్లి ఆకృతి ఆతడి మనోఫలకంపైన నిలిచింది. కుమారుడి పెళ్లి తల్లికి ఆనందహేతువు. ఐతే మంచి సంగీతంలో అపశ్రుతిలా ఈ కన్నీరెందుకు ? బహుశా కారణం ఒకటిగావచ్చు — కుమారుడికి పెళ్లి కావడమంటే అతడిపట్ల తనకున్న బాధ్యతలు పెక్కింటిని తల్లి కోడలికి అప్పజెప్పడ మన్నమాట ! ఆ బాధ్యతల్ని కోడలు ఎంతవరకూ సక్రమంగా నిర్వర్తించగలదన్న ప్రశ్నకు కాలమే జవాబు తేల్చి చెప్పవలసి ఉంటుంది. ఈ విషయానికి సంబంధించి లోకులు ఒక మాట చెబుతుంటారు. భర్త యింటికి తిరిగి రాగానే పెళ్లాం వీపు చూస్తుందట! అదే తల్లి అయితే కుమారుడి కడుపు చూస్తుందట ! భార్య కన్నెప్పుడూ భర్త సంపాదన మీద! తల్లికి అనుక్షణమూ కుమారుడి అవసరాల పట్ల ధ్యాస. తల్లి కుమారుడు సంతోషంగా ఉన్నాడా, లేడా అని గమనిస్తుంది. భార్య భర్త తనను సంతోషపెడుతున్నాడా లేదా అని వితర్కిస్తుంది. కార్యేషు దాసీ, కరగోషు మంత్రీ — అంటూ భర్తృహరి సహధర్మిణి కుండవలసిన గుణాలను ఏకరువు పెట్టాడు. ఆ లక్షణాలను మననం చేసుకున్నప్పుడు అనుకూలదాంపత్యం భగవంతుడు ప్రసాదించవలసిన వరమనిపిస్తుంది !

శేషాద్రి పరధ్యానంలో ఉండగానే పురోహితుడు అచారా లన్నింటినీ సాంగోపాంగంగా నిర్వర్తించి ముహూర్త మేళం కానివ్వమని కేక పెట్టాడు.

* * *

అప్రస్తుతమైన పరామర్శలతోనూ, అసందర్భమైన హాస్యాలతోనూ, అయాచితమైన గౌరవాలతోనూ విసుగెత్తిపోయిన శేషాద్రి ఆరోజుసాయంత్రం కాస్త స్వేచ్ఛగా వూపిరి పీల్చుకోడానికి వీలుగా వూరికి దూరంగా పారిపోయాడు. ఆందోళనలకు, గందరగోళాలకు ఆలవాలమైన శబ్ద ప్రపంచంలో నుంచి బయటపడి మౌన ప్రపంచంలోకి చొచ్చుకపోయినకొద్దీ శేషాద్రి మనసుకు శాంతి లభిస్తోంది. శాంతములేక సౌఖ్యము లేదంటాడు త్యాగరాజు. శాంతం ఆయనకు సంగీతం ద్వారా లభ్యమైంది. తనకు ఏకాంతంలో లభ్యమవుతుందేమో ! — నడుస్తూ నడుస్తూ ఆలోచనలో పడ్డాడు శేషాద్రి .... అదేం విచిత్రమో గానీ, ఈ వ్యావహారిక జగత్తులో ఎలాంటి అమందానందంలోనైనా సరే, ఒక ఆవేదన అంతర్లీనమై వున్నట్టుంది. సంబరాలన్నింటికీ తలమానికమైన సంబరం వివాహం. సృష్ట్యాది నుంచీ పరిణతి నందుతూ వచ్చిన మానవ నాగరకతలో చెప్పుకోదగ్గ గొప్ప మజిలీ వివాహం. మూడుమాసాలనాడు తనకు వివాహం నిశ్చయమైంది. ఆనాటి నుంచీ తన హృదయం కడుపు నిండుకూ కొత్తనీటిని పెట్టుకున్న చెరువులా తెలియని

(54-వ పేజీ చూడండి)

పరిపూర్ణ

(గతసంచిక తరువాయి)

అతడి చేయి ఊతగా నిల్చుంది.

పై మెట్టు మీద ఉంది ఆమె.

ఒక్క మెట్టు క్రింద అతడున్నాడు.

ఆమె ఒక మెట్టు క్రిందకు దిగింది.

మానసికంగా చాలా మెట్లు జారాడు హరి.

గడియారం అరఘంట ఆగిపోయింది.

—సరుగుడు చెట్ల మధ్య దారిలో—

"కుముదినీ — మీరా ? ..... "

"బాబీగారా — "

"ఏదోలా ఉన్నారేం ?"

"అబ్బే ! లైట్‌హవుసుకు వెళ్తుంటే కాలు జారిందండీ—"

"అరెరె ! చాల పెద్దగాయమయిందా—"

"లేదులెండి ... ప్రక్కనే డాక్టరు హరి ఉన్నారు .. "

"అన్నట్లు—ఆయనేరీ—"

"ఆయన ఇదిగో నిమిషం ముందే ఆ తోవెంబడి సముద్రతీరానికి వెళ్లారు .... వస్తారు మరి .... "

"కుముదినీ ! "

వెనక్కు తిరిగింది.

అతడి కళ్ళు చూసింది; నవ్వింది.

"నవ్వుతారేం—కుముదినీ ?"

"అబ్బే—ఏమీలేదులెండి ?"

"మీరు లైట్‌హవుస్‌కు వెళ్ళే ముందు నాతో చెబుతానన్నారు కాని చెప్పలేదేం ..."

"మరిచిపోయానండీ—"

"పొద్దున 'వెన్నముద్ద' వైపు వెళ్లినప్పుడూ అవూటే అన్నారు—"

"నా కాలు నొప్పెడుతూంది."

"పదండి వెళ్దాం ."

"నేను వెళ్తాను లెండి " వెళ్లింది.

చెంప ఫెళ్లుమన్నట్టయింది బాబీకి. అలాగే నిల్చుండి పోయాడు. కాని మనసుమీద హృదయండే పై చేయి అయింది. ఆమెను చెరిపేసుకోలేక పోయాడు.

త్వరత్వరగా నడిచి సత్రం చేరుకుంది కుముదిని డాక్టర్ మధు, సరస్వతి, శారద మాట్లాడుకుంటున్నారు.

"ఎక్కడికి వెళ్ళావే—" అని అడిగాడు మధుమూర్తి అతడి కంఠం విని శారద సరస్వతి మోహం చూసింది.

" లైట్ హవుస్ దగ్గర కన్నయ్యా !"

"ఒంటరిగానా ?"

"డాక్టర్ హరి వచ్చారు "

"మా బాబీ రాలేదూ ?" — సరస్వతి అడిగింది.

"ఆయన్నిదిగో అయిదు నిమిషాల క్రిందే సరుగుడుచెట్ల దగ్గిర విడిచి వచ్చాను."

శారద మొహంమీద మబ్బు రాబోయింది. సరస్వతి ఆమె వీపుమీద తన చేతి నుంచింది.

ఇది గమనిస్తూనే అడిగాడు మధు. "నాతో చెప్పలేదేం నువ్వెళ్తున్నట్టూ—"

"నువ్వు ఏదో చదువుకుంటున్నా వన్నయ్యా!"

"రేపు అందరం కలిసి వెళ్దా మనుకుంటున్నాం కదా ఆ లైట్‌హవుస్‌కు? ఏదో ఇవాళే చూసెయ్యక పోతే కొంపేం మునిగిపోయింది—"

"ఊసుపోలే దన్నయ్యా—"

"మధుమూర్తిగారూ ! మన వెన్నెల భోజనం డాబామీద కానిద్దామా, లేక చెరువు ఒడ్డున చేద్దామా—" అని అడిగింది సరస్వతి.

"నా కేదయినా ఒకటే సరస్వతిగారూ !"

"నీ అభిప్రాయం శారదా ?"

"ఆయన్ని రానియ్యి !"

"పతియే ప్రత్యక్ష దైవము—" అంటున్న సరస్వతి నోరు మూసేసింది శారద డాక్టర్ సరస్వతిని ఆడది సరస్వతిగా మధు మొదటిసారి చూశాడు. కుముదిని దృష్టి గుమ్మంమీద ఉంది—

* * *

రాత్రి ఎనిమిది గంటల వేళ. భోజనాలు పెట్టేసి వంటవాడు వెళ్ళిపోయాడు.

తడిచేతిని తువ్వాలుతో తుడుచుకుంటూ "కుముదినీ !" అని పిలిచాడుమధు. పెరుగన్నం తింటున్న కుముదిని తలెత్తింది.

"భోజనం అయిం తర్వాత ముందు గదిలోకి రా ! ... కాస్త మాట్లాడాలి."

"మహాబలిపురం రోజునుండీ ఎంతో జాగ్రత్తగా ఉంటున్నానే—" అనుకుంది. చేయి కడుక్కొని పిల్లిలా వెళ్లింది.

గదిలో —

అన్నయ్య మొహంమీద టేబుల్ లాంప్ వెలుతురు పడుతూంది. అన్నయ్య ఎంత బావుం టాడని —అయితే ఎపుడూ తీవ్రంగా ఉంటా డెందుకో— ఆయన .... పోల్చుకోసాగింది చెల్లెలు.

"ఇలారా కూర్చో !"

కూర్చుంది కుముదిని. ఒక కవర్ పడేశాడు మధు

"ఏమి టన్నయ్యా ?" ఆమె గొంతు సన్నగిల్లింది.

"తీసి చూడు. చూసి చెప్పు."

ఇనుప చేతులతో పర్వతాలను బయటకు తీసింది కుముదిని. మూడు ఫోటో లున్నాయి. మూడింటిలోనూ తనుంది. తన ప్రక్కన ఒకదాన్లో రమణమూర్తి ఉన్నాడు. మిగత రెంటిలో వెంకటేశం ఉన్నాడు.

"ఏమిటి దీని అర్థం ?"

"ఏమీలేదన్నయ్యా ! వీళ్ళు మా కాలేజీలో నాకు సీనియర్లు .... నేనంటే పడి చచ్చేవాళ్లు."

"కు—ము—ది—నీ !"

గర్జనకు వణికింది.

"ఇంకా అబద్ధాలు చెప్పకు కుముదినీ ! అమ్మా నాన్నా చనిపోయిన రోజున నీ వొక్కదానివి మిగిలావు. నిన్ను పెంచి ఒక మనిషి చేసి, నీవు ఒక ఇంటికి ఇల్లాలయి వెలిగితే అమ్మా, నాన్నా సంతోషిస్తారని ఆశించి, అక్కడ హాస్టల్లో వుంచి నిన్ను చదివించితే ఆఖరికి నువ్వు ఇలా బాధ్యత మరచి అసభ్యంగా....."

"అన్నయ్ ..... "

"కుముదినీ ! నువ్వింకేమీ చెప్పనక్కరలేదు ... ఇదుగో ఈ ఉత్తరం చూడు. అయిదు వందల రూపాయలు పంపితే ఈ ఫోటోల నెగిటివ్‌లు పంపిస్తాడట—లేకపోతే నీ పేరు వీధి కెక్కుతుందట .... నీచులు ! నీచులు ! .... ఇంత కష్టపడి అధిగమించిన ఎత్తు నొదిలి ఒక్కసారిగా క్రిందకు దూకవలసిందేనా నేను ? .... నా జీవితం బాగుపడితే అందులో అర్థాలు చూసి ఆనందిద్దా మనుకుంటే నువ్విలా నీ జీవితాన్ని పాడుచేసుకొని, నాకూ, నా .... "

"అన్నయ్యా ! నన్ను క్షమించన్నయ్యా .... అవన్నీ పాతరోజు లనుకో అన్నయ్యా ... ఇకముందెప్పుడూ అలా ఉండ నన్నయ్యా .... "

కన్నీటి ముత్యాలు అద్దాల చెంపలమీద దొర్లిపోతున్నాయి ఆమెను వెక్కిళ్లు కదిలిస్తున్నాయి—

"చెల్లాయ్—నాకుమాత్రం—" ఫోన్ మోగింది.

"డాక్టర్ మధు మాట్లాడుతున్నాను ... ఎస్ .... ఎస్ ... అలాగే .... నేను సిద్ధమే .... థియేటర్ సిద్ధం చెయ్యమని నిర్మలతో చెప్పండి. ఇంకో అయిదు నిమిషాల్లో అక్కడ ఉంటాను.."

అంత ఏడుపులోనూ అన్నయ్య గొంతులోని ఉత్సాహాన్ని పసిగట్టింది కుముదిని.

ఫోన్ కవతలి కొసను సరస్వతి కూడా—మధు సంస్థితకు కేవలం అతడు డాక్ట రవడం మాత్రమే కారణమని అనుకోలేక పోయింది; ఆనందించలేక పోయింది

—ఆ రాత్రే — అప్పుడే —

శ్రీ నిలయంలో—

"అయితే రేపు సాయంకాలం నిశ్చయమే కదూ ?"

"మపుంటురోడ్డు కదూ.. .వూ...

వాకాటి పాండురంగరావ్





పరిపూర్ణ

అలాగే ...ఆ ..... !"

"ఏమండీ .. ఉలిక్కిపడ్డారు ?"

"ఏంలేదు శారదా—కారు బయలుదేరినట్లయితే—?"

మీది బెడ్‌షీటును తొలగించి ప్రక్క కొత్తిగిల్లి లేచి కిటికీగుండా దూరంగా చూసింది శారద.

"మీ సూపరింటెండెంటుగారు వెళ్తున్నట్లుందండి !"

"ఆ . " అని ఒక్క దూకుతో లేచి ఫోన్ దగ్గరికి వెళ్ళాడు రెండు నంబర్లు ప్రయత్నించాడు నంబర్లు మాత్రం పలికాయి

"శారదా ! నేను ఆస్పత్రి కెళ్ళాలి. సరస్వతి ఇంట్లో లేదు. తన వార్డులో లేదు. అంటే ఏదో అర్జంటు ఆపరేష నన్నమాట నేనూ అక్కడ ఉండితీరాలి" బట్టలు మార్చుకుంటున్నాడు హరి.

"మిమ్మల్ని పిలవలేదు కదండీ—"

"మనల్ని విడదీయకూడదని సరస్వతి నన్ను పిలిచివుండదు శారదా !"

"ఎంత దాక్షిణ్యం !"

చటుక్కున తిరిగి చూశాడు హరి

"అబ్బే — అది కాదండీ — డాక్టరు మధు వెళ్ళారు కదూ, మీరు కూడా—"

"వెళ్ళాలి శారదా వెళ్లాలి ! అయినా నువ్వే మిటో ఇటీవల—"

"వెళ్ళిరండి బాబూ— వెళ్ళిరండి"

"అభిమన్యుడితో మాట్లాడుతూవుండూ ! ... ఇపుడే గంటలో వస్తా .. " అని వంగి శారద నెత్తిన ముద్దుకొని పరుగెత్తి పోయాడు హరి

"ఛీ ఎంత నీచం—ఇక పోకూడదు అయినా యివాళే ఆఖరిసారి .... స్పష్టంగా చెప్పేస్తాను. ఇంక మనం కలవడానికి వీల్లేదు .. మనం ఒకరినొకరు చూడకుండా ఉండడం అందరికీ శ్రేష్ఠం . . అని చెప్పేయాలి .. చెప్పేస్తాను ."

కారుకూ ఆలోచనలకూ బ్రేకు వేశాడు హరి.

"అప్పుడే వెనక్కు వచ్చేశావా అన్నయ్యా ... ఓహ్ .. మీరా !?"

"అవును కుముదినీ !"—

—ఆస్పత్రిలో.

"అమ్మయ్య ! ఆపరేషన్ సక్సెస్‌ఫుల్— ఏమంటారు సరస్వతి ? ఏ పనయినా ఇంకోరితో కలిసి చేస్తే ఎంతో హాయిగా ఉంటుంది . ." డాక్టర్ మధుమూర్తి చేతులమీదికి కుళాయి నుండి నీళ్ళు పడుతున్నాయి

సరస్వతి లాంఛనంగా నవ్వింది

"ఈ ఆపరేషనే నే నొక్కడినే చేసివుంటే, ఎంత బాగా చేసినా ఇంత తృప్తి ఉండేది కాదు— అది 'అహం' అనుకుంటాను మీరెలా ఫీలవుతారో మరి ?"

సరస్వతి మాట్లాడకుండా ఉండలేకపోయిందీసారి. "మనస్సులో కూడా ఒంటరిగా వుండవలసి రావడం శాతం వంటిది—"

ఒక్క నిమిషం వూరుకున్నాడు మధుమూర్తి. చేతులు తుడుచుకున్నాడు తువ్వాలునూ దానితోబాటు కొన్ని ఆశలనూ విసిరేసి వెళ్లి పోబోయాడు.

"సెలైన్‌వాటర్ అదీ చూడండి నేను పొద్దున్నే మళ్లీ వస్తా ."

"అలాగే థాంక్యూ !" అంది సరస్వతి తన గదిలోకి వెళ్ళబోతూ.

"మీరు నన్ను సాయానికి పిలిచినందుకు—"

"పన్నెండవుతూంది డాక్టర్ . మీ చెల్లెలు ఒంటరిగా ఉంటుంది."

"వో . అవును . వస్తా—గుడ్‌నైట్ "

మధుమూర్తి అడుగుల శబ్దం తగ్గుతుండగానే ఫోన్ మోగింది.

"సరస్వతి మాట్లాడుతున్నాను."

"డాక్టర్ హరి స్పీకింగ్—"

"ఓహో .. ఎక్కడినుండీ ?"

"—ఇంటినుండే కానీ—కేసేమిటి ?"

"అదే .... ఆ కుర్రాడికి చిన్న 'ఇన్‌సిషన్' చేశాము—"

"చేశా—మ్ము—హుం ! చిన్నది—ఉత్త ఇన్‌సిషన్ కదూ—అందుకనే కాబోలు సూపరింటెండెంటుగారు రావలసి వచ్చింది."

"వో .. అదా . . నిన్ను 'డిస్టర్బ్' చెయ్యడం ఎందుకని ... అయినా ... నీ కెలా ... "

"ఆ .... తెలుస్తుంది ... తెలుస్తుంది . . " గభుక్కున ఫోన్ పెట్టేసి ప్రక్కకు తిరిగాడు హరి. కుముదిని నిల్చుని వుంది

"అలాగే కుముదినీ ! మనం రేపు పక్షితీర్థం వెళ్ళడంతో ఆఖరు ! ఇకముందు మనం కలుసుకోరాదు నిజంగానే ! .. నేను వెళ్లిపోవాలి .. అక్కడ 'ఆపరేషన్ అయిపోయింది. వస్తా—"

—శ్రీ నిలయంలో—

"ఇంకా నిద్రపోలేదా శారదా ?"

"సరస్వతి నిద్రపోయిందా" అల్లుతున్న స్వెట్టర్‌ని ప్రక్క కుంచింది శారద ..

—మరునటిరోజు మధ్యాహ్నం —

"మవుంటురోడ్ వేపు వెడదామండీ—"

"ఏం " అన్నాడు హరి

"నిన్న చెప్పానుగా—కొంచెం తువ్వాళ్లూ అవీ తెచ్చుకోవాలి .. అలాగే ఏదయినా సినిమాకు వెళ్దామనీ ... "

"సాయంకాలం పల్లావరం హాస్పిటల్‌లో క్లినికల్ మీటింగ్ ఒకటుంది. పేపరు చదవాలి శారదా—"

"ఓహో" శారద ముఖంలోని ఉత్సాహం ఆరిపోయింది.

హరికి చురుక్కు మనిపించింది. కాని ఏటి ఆవలి ఒడ్డు ఆకర్షణ ఎక్కువయింది. సాయకాలం—హరి కారు తీసుకుని వెళ్ళిపోయాడు ...

..... నెమ్మదిగా అడుగు తీసి అడుగు పెడుతూంది శారద.

రెండు మైళ్ళు నడిచింది. గుట్ట అడుగు భాగం చేరింది అక్కడినుండి చూస్తే అంతా ఆకుపచ్చగా వుంది ఆ రంగు మీదుగా తమ క్వార్టర్స్ తాలూకు పొగగొట్టాలు కన్పడు

తున్నాయి. వాటి కవతల ఎర్రటి మంగుళూరు పెంకుల కప్పుతో ఆసుపత్రి పిచ్చిటోపీకింది జోకర్‌లా ఉంది. ఆయాసంతో చతికిలబడింది. ఏవేవో పిచ్చి మొక్కలు గాలికి వూగుతున్నాయి. ఏవేవో పిచ్చి ఆలోచనలు రేగుతున్నాయి. ఎన్ని రంగుల పూవులో — ఎంతమంచి మనుషులో — అబ్బ ! దాహం వేస్తోంది. లేవాలి. నీళ్ళెక్కడ ఉన్నాయో. లేవబోయి వెనక్కు చేతు లానించి కూచుండిపోయింది. కాస్త మెత్తగా ఉన్న వైపు వాలింది. వంగిన మొక్క ఒకటి ఆమెను స్పృశించింది. ఉలిక్కిపడింది. ఎంత భ్రమ. నీడను చూసి అనుమానం ! ఆ మొక్క చివరను చిన్న పువ్వు—పసుపుగా ఉంది. దానికోసం ఝుమ్మంటూ ఏదో రెక్కలపురుగొచ్చింది. చేత్తో విసిరింది శారద. పువ్వు క్రిందకు రాలిపోయింది.... మొక్కలు— పువ్వు — దాహం పురుగు — వాసన—ఆమె ఒత్తిగిల్లి పండుకుంది ...

"ఏమండీ ! ఏమండీ ! శారదగారూ !"

అతడు కొంతదూరం పరుగెత్తుకెళ్ళి ఒక చిన్న గుంటలోని నీళ్ళల్లో రుమాలు తడిపి తెచ్చాడు. ఆమెను వెల్లకిల పడుకోబెట్టి మొహం తుడిచాడు. మళ్ళీ రుమాలు తడిపి తెచ్చి ఆమెను లేపి తన ఎడమచేతి మీదుగా ఆన్చి కూర్చోబెట్టి నీటితో ఆమె నోటిని తడిపాడు .....

"ఏమండీ .... ఇంతదూరం ఒంటరిగా ఎందుకొచ్చారూ .... "

కంటిరెప్ప లల్లలాడాయి. వెలుగు — చీకటి — చీకటి — చీకటి — ఆఖరికి వెలుగు ....

"ఓ .... మధుమూర్తిగారా ... క్షమించండి" అని జరిగి కూర్చుంది శారద. "ఏమీలేదండీ .... వూరికే — వూసుపోకపోతే యిలా వచ్చాను. ఇంత దూరం నడవడం అలవాటు లేదుకదూ—" అని ఆమె బలహీనంగా నవ్విన నవ్వూ, అస్తమిస్తున్న సూర్యుడి ఆఖరి కిరణమూ కలిసిపొయ్యాయి.

"నేను ఆసుపత్రినుండి బయలుదేరి యిలా అటువైపు వచ్చి, ఈ గుట్టెక్కి పైనుండి ఏవో కొన్ని ఫోటోలు తీశాను. ఎందుకో అక్కడి నుంచి ఇటువైపుకు చూస్తే ఏదో కదిలినట్లనిపించింది. ఇలా వచ్చి చూస్తే—మీ—రు !"

శారద లేచింది. బరువుగా ఒక్కడుగు వేసింది.

"ఎక్కడికి—ఇంటికేనా ... దయచేసి నాతోబాటు రండి. అటుప్రక్క నా కారుంది."

"ఫరవాలేదులేండి — నడిచేగా వచ్చాను ...."

"వద్దు శారదగారూ ! మీరు మళ్ళీ నడవడం — అందులోనూ ఈవేళప్పుడు — నడవడం మంచిది కాదు. నామాట వినండి. దయచేసి రండి. మిమ్మల్ని ఇంటిదగ్గర విడిచి వెడతాను."

—మధుమూర్తి కారు ఆస్పత్రిని సమీపించింది.

"ఇక్కడ ఆపేయండి !"

"ఏం ?"

"నేను ఈ మాత్రం నడవలేనుటండీ—"

"సరే ... ఈ నెలరోజులూ మీరు కాస్త జాగ్రత్తగా వుండాలండీ ...."

"థ్యాంక్స్ ! నాకు అందరూ డాక్టర్లే—" అని నీరసంగా నవ్వింది. ఇంటికి నడిచివెళ్ళింది శారద.

నక్షితీర్థం పిక్‌నిక్‌నుండి వెనక్కు వచ్చేశాడు హరి.

పరిష్కారం

"అమ్మగారు మవుంట్‌రోడ్ వెళ్ళొచ్చిన ట్లున్నారే—"

భయపడింది శారద—హరిని, చూసి కాదు, విని.

*   *   *

కాళ్ళదగ్గర రాణి గుర్రుపెడుతూ పడుకుంది బాబ్జి మేడమీద పడుకున్నాడు. తొమ్మిదిన్నరే అయింది

"శారదను చూచి చాల రోజులయింది ఎలా వుందో — ఫోన్ చేస్తే—"

సరస్వతి లేచింది. ఫోన్ చేసింది సమాధానం లేదు.

"అప్పుడే నిద్దరా .... శారద అంత త్వరగా నిద్ర పోదే . పైపెచ్చు హరి వూళ్ళో లేడు కూడా . . తను ఒంటరిగా ఉంది .... ఒకసారి వెళ్ళి చూసి వస్తేనో—"

లేచి చన్నీళ్ళతో మొహం కడుక్కుని చెప్పులు తొడుక్కొని టార్చి తీసుకుని బయలుదేరింది సరస్వతి

త్వరత్వరగా పరుగెడుతున్న నల్లని మబ్బులు నక్షత్రాలను మూసేస్తూ, మూతల్ని తీసేస్తూ ఉన్నాయి.

వర్షం వస్తుందేమో . .. గొడుగు లేదు. గొడుగు లేకుండా వర్షంలో ఇరుక్కున్నప్పుడెల్లా ... ఆరోజు సాయంకాలం పేవ్‌మెంటు మీద తడుస్తూ నిల్చున్నప్పుడు ... ఛీ .. తనప్పుడే పెద్దదయిపోతున్నదా ? ఏమిటి ఈ బలహీనత ... ముందింత పని ఉండగా వెనకచూపేమిటి — శ్రీనిలయం సమీపించింది. ఆఁ ... మేడగదిలో దీపం వెల్గుతూ వుంది. క్రింద హాల్లో కూడా దీపం ఉంది ... హరి లేడుగా—పైన క్రింద కూడా దీపాలు వెల్గడం ఎందుకూ ?

సరస్వతి పరుగెత్తింది తలుపులు సరిగా గడియ వేయబడలేదు ఎంత అజాగ్రత్త ! తలుపులు నెమ్మదిగా తీసి అడుగుపెట్టింది. తివాసీమీద ఆమె చెప్పులు మవునంగా సద్దాయి. హాల్లో నిల్చుని ఒక్కసారి కలియజూచింది.

కుడివైపు మేడమెట్ల మీద శారద పడిపోయి ఉంది.

ఆమె చేతిలో ఏదో—వెండి గ్లాసులా ఉంది. ఒక్క దూకుతో ఆమె ప్రక్కకు చేరింది, సరస్వతి పరుగెత్తుకెళ్ళి రెండు దిండ్లను తెచ్చింది. మెట్లమీదే వాటి నమర్చి శారదను సరిగా పడుకోబెట్టింది గుండెను పరీక్షించి చూసింది. శారద మొహాన్ని యిటూ అటూ త్రిప్పింది. ఫోన్ దగ్గరకు వెళ్ళింది.

"డాక్టర్ మధుగారూ .. క్షమించండి .... నేను సరస్వతిని . . హరి ఇంటినుండి ... శారదకు 'హెమొరేజ్ ' అయింది .. అవును ... అవును . మీరు తక్షణం రావాలి ..... ఆపరేషన్‌కు సిద్ధమయి రండి ... ఇపుడే .... ఇక్కడే .... ప్రతి నిమిషము కూడా శారదకు పదేళ్ళాయుష్షు .... రండి . త్వరగా . "

నాలుగో నిమిషం . మధుమూర్తి వచ్చాడు.

ఇద్దరూ కలిసి హాల్లో టేబుల్‌మీద వస్తువు లన్నిటినీ తీసి పారేసి శారదని అతి జాగ్రత్తగా దానిమీద పడుకోబెట్టారు. సరస్వతి స్టవ్ వెలిగించింది. పరికరా లన్నిటిని సిద్ధం చేసింది.

మొహానికి గాజ్ తగిలించుకుంటూ మధు అడిగాడు

"సరస్వతిగారూ ! శారదకు నేను ఆపరేషన్ చేస్తే డాక్టర్ హరి .. "

"శారద ప్రాణం ముఖ్యం డాక్టర్ !"

—మధు చేతిలోని కత్తి తళుక్కుమంది సరస్వతి దృష్టి ఆ మెరుపువైపు మళ్ళింది .

గంటన్నర తర్వాత

"హమ్మయ్య !" అని చెమటని తుడుచుకుంటూ కుళాయివైపు వెళ్ళాడు మధు.

"ఏమిటో డాక్టర్ ! ఎందుకనో శారదని చూడా లన్పించింది, వచ్చాను లేకపోతే . "

"అంతే డాక్టర్ సరస్వతి ! అంగుళం మేరలో చావు—బ్రతుకవుతుంది .. ఆశ నిరాశవుతుంది. అదంతా చాలా తమాషా . అయినా అర్ధరాత్రి పూట నా వేదాంతం ఎందుకులెండి అయితే నేను వస్తా మరి . మీ రిక్కడ వుంటారుగా . పొద్దుటిలోగా డాక్టర్ హరి వచ్చేస్తా డనుకుంటాను—"

"సాయంకాలమే వచ్చివుండాలి—"

"గుడ్‌నైట్ . అవసరం వస్తే పిలవండి "

బయట కారు చప్పుడయింది. హరి వచ్చాడు. సరస్వతినీ, మధునీ చూశాడు

సరస్వతి చెప్పింది

మూలగా — మంచంమీద వున్న శారద దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళాడు— హరి. ఒక్క నిమిషం ఆమె మొహంవైపు చూశాడు. వెనక్కు తిరిగాడు హాలు మధ్య దీపం క్రింద సరస్వతి. తలుపు దగ్గర — వెళ్ళిపోబోతూ మధుమూర్తి ఉన్నాడు.

నెమ్మదిగా నడిచాడు హరి సరస్వతిని దాటి గుమ్మం దగ్గరకు వెళ్ళాడు. మధుమూర్తి రెండు చేతులనూ తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"మీకు కృతజ్ఞుడిని "

ఒక్క క్షణం మధు ఏమీ పలకలేదు హరి రెండు చేతులనూ ఒత్తి "ఇది మన విధి !" అన్నాడు.

హరి సరస్వతి వైపు చూశాడు ఆమె కళ్ళల్లో వెలుగు ఆడుకుంటూంది.

మధు హరి వీపుని తట్టి—"వస్తాను డాక్టర్ హరీ ! చాల అదృష్టవంతులు మీరు—అయితే, సరస్వతీ ! మీరు ఇంటికి వెళ్ళేట్లయితే నా కారులో దిగవిడిచి వెళ్తాను—" అన్నాడు.

సరస్వతి హరివైపు చూస్తూ పలికింది. "థ్యాంక్స్ డాక్టర్ ! నేనీ రాత్రి కిక్కడే ఉంటాను."

మధు వెళ్ళిపోయాడు—ఒంటరిగా.

"సరస్వతీ !" ఆశ్చర్యంతో తిరిగి చూసింది సరస్వతి హరి కండ్లల్లో నీరు నిండింది.

"నేనెంత నీచుడిని సరస్వతీ — నేనే సర్వస్వమని నమ్ముకున్న ఈ దేవత, నా ప్రాణం, నా బలంగా — నా శారదని నెలరోజులుగా ఎంత బాధపెట్టాను. సరస్వతీ నాకు పరిహారం లేదా— లేదా సరస్వతీ ... నాకు నా శారద దక్కితే చాలు. నా కింకెవరూ వద్దు — ఏమీ వద్దు శారద చాలు — నా శారద చాలు —."

రెండు చేతుల్లోనూ మొహం దాచుకొని ఏడ్చాడు డాక్టర్ హరి. సరస్వతి అతడి దగ్గరికి వెళ్లి అతడి భుజంమీద చేయి నుంచింది.

"హరీ ! ఛా — ఏమిటది . . కళ్ళు తుడుచుకో. నిన్ను నీ వంతగా నిందించుకోవడం అనవసరం హరీ .. ఇంత త్వరగా అడ్డదారిని వదిలి రాచబాట మీదకు రావడం సాధారణం కాదు తెలుసా ? అదీ కాక ఇలాటి విషయాల్లో సగం తప్పు ఎప్పుడూ అవతలివాళ్ళది అన్న విషయం కూడా మరిచి పోకు ."

హరి ఆమె మొహంవైపు చూశాడు. రుమాలుతో కన్నీటి చారలు తుడుచుకున్నాడు.

"—నా కెలా తెలిసిందని అడక్కు—ఆడది ఆడదాన్ని చాల త్వరగా అర్థం చేసుకోగలదు .. నాకు కుముదాన్ని తెలుసు . . శారదనూ తెలుసు"

"సరస్వతీ నువ్వు నిజంగా మనిషివేనా ?" ఆమె రెండు చేతులూ పట్టుకుని పాపాయిలా అడిగాడు హరి.

"ఏమయ్యా హరీ—నువ్వేనా హాస్పిటల్ సూపరింటెండెంటవుతా నన్నదీ .! లేచి వెళ్లి మొహం అదీ కడుక్కుని రా .. అందాక నేను శారద ప్రక్కన ఉంటాను ."

* * *

"అక్కయ్యా ! ... నాన్న నాకు గుర్తు లేడు అమ్మ తెలుసు కాని ఆవిడ నాకు పూర్తి జ్ఞానం రాకముందే వెళ్లిపోయింది. నాకూ, గాయత్రికీ నువ్వే అన్నీ — నువ్వే అందరూ — కాని ఈ ఒక్క విషయంలో నేను నీ మాటకు పూర్తిగా సరే నన లేకపోతున్నాను. క్షమించక్కయ్యా !"

"బాబ్జీ—నేనేదో నీకు అప్పిచ్చినట్లు—దాన్ని వెనక్కు ఇమ్మంటున్నట్లు మాట్లాడకు . నేను కాకపోతే మరొకరు ... మరొకరు కాకపోతే ఇంకొరు—నేను చేసిన పని చేసేవారు. అందులో నా ప్రత్యేకత ఏమీలేదు ... నేను అనుకున్నదానికి పరిస్థితులు తోడ్పడ్డాయి—ఒక్క దశలో నయితే ఇన్నీ సాదించగలనా అన్పించింది కాని ఆఖరుకు చెయగలిగాను అదే నాకు సంతోషం — నాకు ఎవ్వరూ ఏమీ ఋణపడలేదు .. ఏం ... అందు చేత నేను నీకు ఇప్పుడు చెబుతున్న దానికీ— —నువ్వు పెరిగి పెద్దవాడవు, ఎమ్మే పాసవడానికి కించిత్తు కూడా సంబంధం లేదు. నేను నిన్ను శాసిస్తున్నానని భ్రమపడకు ... నువ్వు పెద్ద వాడివి. నీ జీవితం నీది. 'ఇది ఇది, అదికాదు'—అని మాత్రమే చెబుతున్నాను. నువ్వేరైలు ఎక్కుతావో, ఏ బాటమీద నడుస్తావో అది పూర్తిగా నీ ఇష్టం ! .... నువ్వేం చేసినా నా తమ్ముడివే—!"

"అంద రక్కయ్యలూ ఇలాగే ఉంటారా అక్క య్యా—?"

సరస్వతి లేతగా నవ్వింది. "ఎందుకుండరు బాబ్జీ, తమ్ముళ్లందరూ నీలా మంచివాళ్ళయితే—?"

"ఏం మంచివాడినో—నిన్ను కాదని, నీమాట కెదురాడి—"

"ఆమాటే వద్దన్నాను బాబ్జీ ! .... దారిని పోయే మూడోవ్యక్తిలా వేలెత్తి చూపెడుతున్నాను. అంతే .... వివాహం గుర్రప్పందెం లాటిది. . గెలుపూ వోటమీ తేల్చి చెప్పగల్గింది కాలం ఒక్కటే ! గెలవకపోయినా, ఓడిపోయినా, కనీసం ఆఖరిదాకా కలిసివుండగల్గితే అదీఒక అదృష్టమే! .... కాబట్టి—కొంతవరకు తెలిసినవాడి వయినప్పుడు, తెలుపు రంగులో ఇంద్రధనుస్సును చూచి, తర్వాత నీ దేవత కాళ్ళు కూడా ఈ భూమ్మీదవేనని అసంతృప్తి చెంది, నీ నిరాశకు మరొక్కరిని కూడా బాధ్యులు చేసి—"

"అక్కయ్యా—నువ్వు ఇన్ని మాటలు ఎందుకు చెబుతున్నావో నాకు తెలియదనుకోకు ... కుముదిని నిప్పులాటి మనిషని నేను భ్రమపడలేదు .. ఆమె తప్పులు నాకు తెలుసు ... పశ్చాత్తప్తురాలయిన వ్యక్తికి అంతరాత్మ కన్న సంఘం విధించగల శిక్ష ఏముంది చెప్పు ... వేలు కాలిన మనిషి ఎపుడూ నిప్పంటే జాగ్రత్తగా వుండి తీరుతుంది ... ఈ విషయా లన్నిటిని నీతో చెప్పగల వాడిని కాను ... కుముదినిని—ఆమె దోషాలతో సహా మనఃపూర్వకంగా స్వీకరించదలుచుకున్నా నక్కయ్యా !"

"మంచిది తమ్ముడూ ! భగవంతుడు మీ యిద్దరి ప్రక్కనా ఎప్పుడూ వుండాలి—"

"నువ్వెంత మంచిదాని వక్కయ్యా !"

ఇరవై మూడేళ్ల బాబ్జి నమస్కరిస్తుంటే సరస్వతి కేగోలా అన్పించింది కళ్ళు మూసుకుంది

* * *

" ... కనుక అన్నయ్యా ! నిన్ను అడుగడుగునా ఇబ్బందిపెట్టి నీ మనసు నొప్పించి, నేనూ ఆవేదన పడలేను . ఆయన కూడా నీలాటివారే. నాలాటి విషపు మొక్కమీద పోయదలచుకున్న ఆయన ప్రేమ అమృతం లాటిది ... నాలోని చీకటి నెరిగి కూడా నన్ను స్వీకరించదలచుకున్న అసామాన్యవ్యక్తికి నే నివ్వగల ప్రతిఫలం ఆయనకు దూరంగా ఉండడమే—! ... నువ్వూ, ఆయనా కూడా చక్కగా భార్యా పిల్లలతో కల కలలాడుతుండగా ఎప్పుడో ఒకప్పుడు వచ్చి చూసి పోతాను. నీలాటి అన్నయ్య—ఆయనలాటి దేవుడు తటస్థపడిన నా జీవితం బొత్తిగా అర్థంలేనిది కాదు అన్నయ్యా ! .... నేను ఏమీ అయిపోను నా గురించి బెంగపడకు—కుముదిని"

—ఎన్నిసార్లు చదివాడో గుర్తులేదు బాబ్జీకి

"ఏం చెయ్యదలుచుకున్నారు ?" అని అడిగాడు డాక్టర్ మధు.

"వెతకదలుచుకున్నాను"—అన్నాడు బాబ్జీ ఉత్తరాన్ని మధు చేతి కిచ్చేస్తూ—

ఏదో చెబుదా మనుకున్న మధు బాబ్జి మొహంలోని నిశ్చలత చూసి ఆగిపోయాడు—

* * *

రాత్రి ఎనిమిది గంటల వేళ.

మదరాసు సెంట్రల్ స్టేషన్—దీపాలతో, మనుషులతో, శబ్దాలతో, ముహూర్తం సమీపిస్తున్న పెళ్లిపందిరిలా ఉంది ఫుల్‌స్టాప్ లేని పురోహితుడి మంత్రాల్లా, గడియారపు ముళ్ళు తిరిగి పోతున్నాయి

మహారాజులా నిల్చునుంది కలకత్తా మెయిలు. యువరాజులా పిలిచింది కెనేడియన్ ఇంజను.

—"డాక్టర్, నన్నొక మనిషిని చేసి మళ్లీ ప్రపంచంలోకి పంపిస్తున్నారు. ఆఖరుకు ఎలా జరుగుతుందో—" అన్నది సరళ.

"అలా సందేహించకూడదమ్మా సరళా ! జీవితం ఎంతో గొప్పది—జీవించడం తెలిసి వుండాలి. అంతే—"

"నన్ను పంపించడానికని వేలూరినుండి మద్రాసు వచ్చారే ! అందరూ డాక్టర్ శ్రీనివాస రావులాగే వుంటారా—" అని సరళ నవ్వింది.

"డాక్టర్ సుదర్శనం ఎంత మంచివాడో నీకే తెలుస్తుందిగా!"

"నాకన్నానా ?" అంది సరళ అల్లరిగా—

"నర్సులు కాబోయేవారికి ఇంత అహంభావం కూడదు—" అని ప్లాట్‌ఫారమ్మీద నిల్చున్న డాక్టర్ శ్రీనివాసరావ్ అనేసరికి ఇద్దరూకలిసి ఘొల్లున నవ్వారు. షాక్ తగిలినట్లు నవ్వు ఆపి మెడ త్రిప్పి చూశాడు శ్రీ ని వా స రా వ్ కంపార్టుమెంటు కిటికీనుండి బయటకు తొంగిచూసింది సరళ అతడి దృష్టి ముందు కంపార్టుమెంటు వైపు కుండడం గమనించి తనూ చూసింది

—" .. నీకు తప్పకుండా కుముదిని కనపిస్తుంది తమ్ముడూ ... కనిపిస్తుంది ! వెళ్లి ఇద్దరూ కలిసి రండి ..."

—ఎంతటి శబ్దసాగరంలో నయినా శ్రీనివాసరావుని మెరుపుతీగలా తాక గల్గిన స్వరం అది.

అతడి తపస్సు ఫలించింది

సరస్వతి నొసటి తిలకం కుంకుమరాగంతో వెలిగింది. ★

రాము — ఒక నెల నుంచి మా ఆవు కనుపించడం లేదురా.

సోము—పోని పత్రికలో అయినా ప్రకటన వేయించ లేక పోయావా?

రాము—ఏం లాభంరా? ఆవులు ఏమైనా చదువుతాయా, ఏడుస్తాయా?

కోపూరు రామాంజనేయులుశెట్టి
(అనంతపురం)

వనితాలోకం

బ్రతుకుల అతుకుల బొంతలైన
ఆడపిల్లలు - పుట్టిల్లు

అన్నకు పెళ్ళి కావాలి, వదినె రావాలి అని ఏ ఆడపిల్ల అయినా ముచ్చటపడుతుంది. వదినె వస్తుంది. అన్న దూరమౌతాడు. వదినే దగ్గరికి రాదు. ఆడపడుచు మనసు ఎలా ఉంటుంది? మరొకటీ కద్దు. వదినె వస్తుంది. వదినెను దగ్గరికి రానివ్వడం ఇష్టం ఉండదు. అన్న దూరం కావడానికీ వీలులేదు. ఇదీ అతకదు. ఏమైనా ఆడపిల్లల బ్రతుకులు అతుకులబొంతలే అయినప్పుడు కావాలని కొత్త బాధలు తెచ్చుకోవడం వివేకమనిపించుకుంటుందా?

"మా వదినెగార్కి ఏం బిడ్డ పిన్నీ" అని మా ఎదురింటి పిన్నిని అడిగితే, "ఆ .ఏంబిడ్డ.. ఆ...డ .. పి . ల్ల" అంటూ కొంచెము తగ్గుస్థాయిలోఅని, అయినా ఏబిడ్డయితే యేం చేస్తాం, చెట్టుకుకోసు కొచ్చామాగాని, అంటూ వెళ్లిపోయింది

ఆడపిల్లంటే తలిదండ్రులకు దిగులు పట్టుకుంటుంది—మరీ ముఖ్యంగా ఈకాలంలో. అంటే పని పాటలు నేర్పించి, చదువు చెప్పించి, వేలకువేలు కట్నాలిచ్చి పెళ్ళిళ్ల చెయ్యాలి. సామాన్య కుటుంబీకులకు మరీ కష్టంగా వుంటుంది అయితే ఆడపిల్లలు కావాలి అనేవారు లేకపోలేదు మా దూరపు బంధునొకాయనకు వరుసగా ఆర్గురు మగబిడ్డలు పుట్టారు. ఆ దంపతుల కిరువురికి ఆడపిల్లలంటే ఇష్టము. అతను అందరితో ఈసారి ఆడపిల్ల కలిగితే విందుచేస్తా ననేవాడు. అయితే యేడవసారి కవలలు పుట్టారు—మగపిల్లలే.

ఇదంతా ఎందుకు? ఆడపిల్లను కని, పెంచి, విద్యాబుద్ధులు నేర్పించి, పనిపాటలు నేర్పించి కడకు ఒక అయ్యచేతిలో పెట్టాలి ఇక ఆ అమ్మాయికి తన భర్తే సర్వస్వము. తన భర్తగృహమే తన గృహము అదే తన ఆస్తి అని గుర్తించి అక్కడే తన జీవితమును సుఖంగా గడుపుటకు ప్రయత్నించాలి ఎంత తను పుట్టి పెరిగిన గృహమైనా, పుట్టిల్లు స్త్రీకి ఎన్నటికి స్వంతగృహముకాదు. ఇలాకాక చాలమంది సోదరీమణులు తాము పుట్టిపెరిగిన ఇల్లే స్వంత గృహములా భావించుకొని, తలిదండ్రులు, తోడబుట్టువులు తమ మాట కాదనలేరని, వివాహమైనప్పటికీ పుట్టింట్లోనే ఇద్దరు, ముగ్గురు బిడ్డలు కలిగేవరకువుండి, వదినెగార్లతో తగాదాలతో అవమానపడి సిగ్గుతో అత్తగారిల్లు చేరుకుంటుంటారు.

మాకు తెలిసినవాళ్లే. ఆ దంపతులకు తొలి మలి ఇద్దరు ఆడపిల్లలు, తర్వాత వరుసగా నలుగురు మగపిల్లలు పుట్టారు. మగపిల్లలు చిన్నపిల్లలు. ఆడపిల్లలు పెద్దవారగుటచే తల్లికి పనిపాటలలో చాలతోడ్పడేవారు. ఆడపిల్లలెన్నాళ్ళుంటారు? పద్దెనిమిదవ యేటే పెద్దమ్మాయికి

శ్రీమతి సరోజినీ రత్నస్వామి

పెళ్లయింది. అత్తవారింటికి పంపారు. పోయి మూడునెలలు కాలేదు. పుట్టింటికి వచ్చేసింది ఇరుగుపొరుగువారంతా "యేమే అప్పుడే వచ్చావు ?" అని అడిగితే, "అది ఉత్త పల్లెటూరు. అంతా మోటుతనము జాస్తి. చాదస్తపు మనుషులు. ఇకపోతే మా అత్తగార్కి నేనే పని చేసినా నచ్చదు కొన్నాళ్ళు వుండిపోదామని వచ్చా" నంటూ చెప్పుకుపోయింది. తలిదండ్రులు కూడా, క్రొత్తగదా కొన్నాళ్ళుండిపోతుందనుకొన్నారు దినాలు, నెలలు, సంవత్సరాలైనా ఆ అమ్మాయి కదలలేదు భర్త ఎన్నిసార్లు వచ్చి భార్యను రమ్మన్నా ఆవిడేమో ఇదిగో, అదిగో వస్తానంటూ పుట్టింట్లో గాడిదచాకిరిచేస్తూ ఉండిపోయింది ఇలానే ఇద్దరు బిడ్డలు పుట్టారు. ఇక అమ్మలక్కలంతా తల్లితో "ఏమే, నీ కూతురు మగని విడిచిపెట్టి, ఇక్కడే ఎవరినో చూసుకుందిటగా .. లేకపోతే మగనివెంట ఎందుకు వెళ్లదు. నీకైనా తెలివుండొద్దూ ! చిన్నకూతురు పెళ్లికెదిగి కూర్చుందిగా. ఇది ఇంట్లోవుంటే దాన్నెవరు చేసుకుంటా"రని బహిరంగంగానే అనేవారు. ఇక చిన్నమ్మాయికి రెండు మూడు సంబంధాలువచ్చి, "అక్క సంసారానికే వెళ్ళలేదు. ఇక ఈ అమ్మాయి మాత్రము సంసారము చేస్తుందా, అయినా ఆ తల్లికైనా బుద్ధుండొద్దూ" అంటూ వెళ్లిపోయారు ఈ లోపల మగపిల్లలు కూడా కొంచెము ఎదిగారు. అందరూ అనే మాటలు విని పెద్దక్కవల్ల కుటుంబానికివచ్చే అప్రతిష్ఠ ఓర్చుకోలేక ఆవిడను అత్తగారింటికి వెళ్ళిపొమ్మన్నారు. అందుకావిడ చాలా కోపముతో "కుర్రవెధవలు మీరు పొమ్మంటే పోతానట్రా, అమ్మా నాన్న పొమ్మంటే పోతా"నంది ఇదే అదనని తల్లి తండ్రి కూడా "చూడమ్మా మేము చెప్పేది నీ మంచికే నీవిక్కడఉండడంమూలాన చెల్లికి పెళ్లికాదమ్మా. మాకు చెడ్డపేరు నీఇంటికి నీవు వెళ్ళు" అని అన్నారు అందుకు ఆ అమ్మాయి "నేను ఇంతికాలమూ మీ సంసారము పైకిలాక్కొచ్చి నా కండలంతా కరగబెట్టాను. ఈనాడు నన్ను పొమ్మంటారా" అని వలవల యేడ్చి తీరని అవమానముతో అత్తవారింటికి పోయింది.


పాపము ఆవిడ పుట్టింట్లో కష్టపడి చేసినపని అత్తవారింట్లో చేసిఉంటే తన సంసారమెంత బాగుపడును ? ఈవిధంగా అవమానపడిపోయి, తిరిగి పుట్టింటికే ముఖము పెట్టుకొని వస్తుంది?

వచ్చినా వదినెగార్లతో కూడా అవమానము పొందిన ఆడబడుచులు లేకపోలేదు.

మా మేనత్తకు ఇద్దరు కూతుళ్ళు, ఇద్దరు కుమారులు. కూతుళ్లకు పనులు నేర్పించక గారాబంగా పెంచి పుల్లిళ్ళుచేసింది. పెట్టింట్లో గారాబంగా పెరిగానుని అత్తవారింట్లో పనులు చేసికోకపోతే ఎలా జరుగుతుంది ? పెద్ద కూతురు అత్తవారింట్లో పనెక్కువని పుట్టింట్లోనే తిష్టవేసి, తల్లితో చాకిరీ చేయించుకునేది. ఇద్దరు బిడ్డలు కలిగారు వదినెగార్లు వచ్చారు. తల్లి సంసారమంతా కోడండ్ర కప్పగించింది. ఈ కోడండ్లు ఆడబిడ్డకు, ఆవిడ పిల్లలకు చాకిరీ చేయలేకపోయారు. ఒక్కనాడా, రెండునాళ్లా ? నెలలు, సంవత్సరాలు. పైగా ఆడబడుచు మర్యాదలు, అధికారాలు జాస్తి. ఇక చిన్నవదిన వూరుకోలేక ఏదో మాటవరుస కన్నట్లు "సిగ్గులేక నీమాదిరి పుట్టింట్లోనే పడిఉంటావా, ఇది మా సంసారము మా ఇల్లు. నీ అధికారాలేమీ సాగ విక్క"డంది. ఆ మాటలకు ఆడపడుచు చాలా బాధపడి కళ్ళు తెరచుకొని, భర్తను రమ్మని, పిల్లలతోకూడ అత్తగారింటికి వెళ్లిపోయింది

ఇలా వ్రాయాలంటే చాలా వున్నాయి. ఏవో శుభకార్యాలకో, పండుగలకో, ఏడాదికో, మూడేళ్ళకో వెళ్లి పదిదినాలుండివస్తే, మర్యాద లబ్బుతవికాని, బిడ్డల తల్లులు అయ్యేవరకు ఉంటే తీరని అవమానములతో, జోడుచేతులతో వచ్చి సంసారాన్ని దిద్దుకోవలసివస్తుంది.

★



పాకశాల

కేకులు: ఫ్రూట్ కేకులు

...ఎం ఆర్ లక్ష్మిగారు, కేకులు, ఫ్రూట్ కేకులు ...యారుచేయు విధము వనితావాణి ద్వారా తెలియ ...మని వ్రాశారు అందువలన ప్లమ్ కేక్ ...రుచేయు విధము వ్రాస్తున్నాను

...సిన సరకులు —

...పిండి	1/2 శేరు
...	1/4 శేరు
... డాల్డా	1/4 శేరు
...	1/8 శేరు
కోడిగ్రుడ్లు	3/
ఖర్జూరపు పండ్లు	0—4—0.
జీడిపప్పు	0—4—0.
దాల్చిన చెక్క, ఏలకులు	0—1—0.
సోడా	టేబుల్ స్పూన్.
ఉప్పు	టీ స్పూన్.
ఎసెన్సు	టీ స్పూన్.

ఖర్జూరపు పండ్లు, కిస్‌మిస్ పండ్లు, జీడిపప్పు ...భముగా కడిగి ఎండబెట్టి ఖర్జూరపు పండ్లు సన్నగా ముక్కలు కోసి ఉంచవలెను. ఎండిన జీడిపప్పును నేతిలో వేయించి ఉంచవలెను పిమ్మట ఒక స్టీలు పాత్ర తీసుకొని అందులో నెయ్యి వేసి, అందులో చక్కెర వేస్తూ వప్పుతో కలిపి రుబ్బవలెను. బాగుగా కలిసిన తరువాత కోడి గ్రుడ్లలోని తెల్లని సొన వేరుగా ఉంచి పసువు సొనమాత్రమే వేసి కలుపవలెను. తర్వాత సోడా, ఉప్పు వేసి కలిపి మైదాపిండి, పాలు వేసి కలుపవలెను. పిమ్మట గ్రుడ్లలోని తెల్లని సొన వేసి, దాల్చిన చెక్క యాలకుల పొడి ఎసెన్సు వేసి కలిపి ఉంచవలెను ఈ కలిపిన పిండి కేక్ పాత్రలో వేసేటప్పుడు పాత్ర అడుగున గుండ్రని కాగితము నెయ్యి రాసి పెట్టవలెను. అప్పుడు కలిపిన పిండి అందులో వేసి కిస్‌మిస్ పండ్లు ఖర్జూరపు పండ్లు, జీడిపప్పు వేసి కలుపవలెను. అప్పుడు దానిపై మూతబెట్టి దాని కొరకు ప్రత్యేకముగా పొయ్యి తయారుచేసి దానిపై పెట్టవలెను. 15 నిమిషములలో చక్కగా తయారవుతుంది.

విమలాభాస్కర్.

చిన్నపిల్లలకు స్వెట్టరు

చిన్న పిల్లల స్వెట్టరు అల్లే విధానము వ్రాస్తున్నాను. ఇది పది సంవత్సరముల వయస్సు గల ఆడపిల్లలకు చాల బాగుంటుంది. రెండు సంవత్సరములవరకు మగపిల్లలకు కూడా బాగుంటుంది. నిలువుగా చారలుగా ఉంటుంది. మామూలుగా స్వెట్టర్లు, క్రింది నుంచి అడ్డంగా అల్లి, మెడ, చేతులు అల్లుతారు. కాని ఇది నిలువుగా బటన్స్ నుండి బటన్ హోల్స్ వరకు గుండ్రంగా అల్లాలి. ఇందులోనే చేతులు, మెడ కూడా కలిసి వస్తుంది. మోచేతులకు కొంచెం పైగా చేతులు కూడా వస్తాయి. ఇది అర్థం చేసుకోవటానికి గజిబిజిగా వుంటుంది గాని చాలా తేలిక. చాలా అందంగా ఉంటుంది రెండు సం ల వయస్సు గల పిల్లలకు సరిపోవు సైజులో వ్రాస్తున్నాను. దీనినిబట్టి ఎంత కావాలంటే అంత వేసుకోవచ్చు.

అందుకు కావలసినవి —రెండు అవున్సులు తెలుపు వూలు, రెండు అవున్సులు ముదురు రంగు వూలు, 12 వ నెంబరు సూదులు మూడు, నాలుగు తెల్ల బటన్సు.

నేను ముదురు నీలం రంగు వూలు వాడాను. చాలా బాగా కుదిరింది. ఎవరి అభిరుచిని బట్టి వారు ఎరుపుకాని, ఆకుపచ్చ, పొగాకు రంగు వాడవచ్చు.

అల్లే విధానం :—ఈ స్వెట్టరు అల్లిక అంతా "నిట్" అల్లాలి. మొదలు ముదురు రంగు వూలు తీసుకుని సూదిమీద ఒక వంద రింగులు వేసుకోవాలి దానిని అంతా నిట్ చేయాలి మరలా ఆ వరస అంతా అల్లాలి ఈ విధంగా 18 వరుసలు రెండు వైపులా నిట్ అల్లాలి. ఇలా అల్లితే తొమ్మిది వరుసలు చారలుగా వస్తుంది. తరువాత 20 రింగులు ముదురు రంగు వూలుతో నిట్ అల్లాలి. దానికి తెలుపు రంగు వూలు ముడి వేసి 70 రింగులు అల్లాలి అంటే ఇంకో సూది మీద పది ముదురురంగువూలు రింగులు మిగులుతవి. అవి అల్లకూడదు వెనక్కు తిప్పి, తెలుపు రంగు వూలుతో ఇందాక అల్లిన 70 రింగులనే నిట్ అల్లాలి తరువాత మళ్లీ 20 రింగులు ముదురు రంగు వూలుతో అల్లాలి మరలా 20 రింగులు ముదురు రంగు వూలుతో అల్లి, ఇందాక మాదిరి 70 రింగులు తెలుపు వూలుతో అల్లి వెనక్కు తిప్పి అల్లివేయాలి. ఆ పది రింగులను ఈ నాలుగు వరుసలూ అల్లకూడదు. 70 రింగులు తెలుపు అల్లాక ముదురు రంగు వూలుతో చివరి వరకు అంటే 100 రింగులు "నిట్" అల్లాలి. ఈ విధంగా ఇంకొక లైను అల్లాలి. ఇలా అల్లితే 2 తెలుపు చారలు, ఒక ముదురు రంగు చార వస్తుంది. మరలా ఇందాక మాదిరి 20 రింగులు ముదురు రంగు వూలుతో అల్లి తరువాత 70 రింగులు తెల్ల వూలుతో నాలుగు వరుసలు అల్లాలి తెల్ల వూలుతో అల్లుతున్నప్పుడు పది రింగులను మాత్రం అసలు అల్లకూడదు. కాని 20 రింగుల వైపు ముదురు రంగు వూలుతో అల్లాలి ఇలా అల్లితే పది రింగుల వైపు చిన్న గుండ్రటి మెడగాను, క్రింది 20 రింగుల వైపు క్రింద బార్డరుగాను ఉంటుంది ఈమాదిరి తెలుపు చారలు 14 వచ్చే వరకు అల్లాలి ఇది ముందు భాగం సగం అయిందన్నమాట. ఇప్పుడు చెయ్యి అల్లటం మొదలుపెట్టాలి ముదురు రంగు వూలుతో 70 రింగులు అల్లాలి ఇంకో సూది మీద 30 రింగులు మిగులుతవి. ఇప్పుడు ఇంకొక సూది తీసుకుని దానితో 30 రింగులు ఉన్న సూదిమీద, ఇంకొక 25 రింగులు వేయాలి అంటే ఒక సూదిమీద 70 రింగులు, ఇంకొక సూది మీద 55 రింగులు ఉంటవి. 70 రింగులు ఉన్న సూదిని అల్లకుండా అలా ఉంచేయాలి ఇప్పుడు 55 రింగులలో ముదురు రంగు వూలుతో రెండు లైనులు అల్లాలి తరువాత పది రింగులు ముదురు రంగు వూలుతో అల్లి, తెల్ల వూలు ముడివేసి 35 రింగులు అల్లాలి. ఇప్పుడు ఆ పది రింగులు మెడవద్ద మామూలుగా అల్లకూడదన్నమాట. ఈమాదిరి తెల్ల వూలుతో నాలుగు లైనులు, ముదురు రంగు వూలుతో రెండు లైనులు చొప్పున తెల్ల వూలు వచ్చినపుడు పైపది రింగులు అల్లకుండా క్రింది పది రింగులు మాత్రం ముదురు రంగు వూలుతో 15 తెల్ల చారలు వచ్చేవరకూ అల్లాలి. తరువాత రెండు లైనులు ముదురు రంగు వూలుతో అల్లాలి. ఇప్పుడు ఇందాక ఎక్కువ చేసుకున్న 25 రింగులను పూర్తి చేసుకోవాలి. అంటే రెండు రింగులను ఒకసారి అల్లి దానిని సూదిమీద వేసుకుని మరలా రెండు రింగులు ఒకసారి అల్లాలి ఈ మాదిరి 25 రింగులు తగ్గేవరకూ అల్లాక ఇప్పుడు ఒక సూదిమీద 30 రింగులు, ఇంకొక సూదిమీద 70 రింగులు ఉంటాయన్నమాట. ఇప్పుడు మూడవ సూదిని తీసివేసి, ఆ 70 రింగులను ముదురు రంగు వూలుతో కలిపి ఒకే వరుసగా అల్లాలి చెయ్యి అల్లటం పూర్తి అయింది. చేతిక్రింద స్వెట్టరు పూర్తి అయిన తరువాత అతకాలి ఇప్పుడు మొదట అల్లిన మాదిరి నాలుగు లైనులు తెలుపు రంగు వూలుతోను, రెండు లైనులు ముదురు రంగు వూలుతోను 28 తెల్ల చారలు అల్లాలి. ఇక్కడ ఇందాక మాదిరి 70 రింగులు ముదురు రంగు వూలుతో అల్లి ఇంకో సూది తీసుకొని 25 రింగులు ఎక్కువ వేసి చెయ్యి ఇందాక అల్లినట్టే అల్లాలి. తరువాత ఆ 25 రింగులు పూర్తిచేసి, మూడవ సూది తీసివేయాలి రెండవ చెయ్యి కూడా పూర్తి అయిందన్నమాట అంతా ఒకే లైనులో అల్లి మరలా 14 తెలుపు చారలు వచ్చు వరకూ అల్లాలి చివరకు తొమ్మిది లైనులు ముదురు రంగు వూలుతో అల్లాలి. 18 రింగులు అయిన తరువాత బటన్ హోల్సు చెయ్యాలి. అంటే వూలు ముందుకు వేసుకుని రెండు రింగులు ఒకసారి నిట్ చేయాలి. ఇలా రెండుసార్లు చేస్తే, బటన్ హోల్సు ఏర్పడుతవి. ఇలా నాలుగు హోల్సు చేసుకొని, తరువాత తొమ్మిది లైనులు అల్లి సూదిమీద రింగులన్నీ పూర్తిచేయాలి. ఇప్పుడు స్వెట్టరు అల్లటం పూర్తి అయింది ఈ స్వెట్టరుకు క్రింది బార్డరు పైన తెల్లచార వద్ద, పైన మెడ బార్డరు వద్ద హోల్సు వస్తాయి ఇవి చూడటానికి చాలా బాగుంటాయి. ఇష్టంలేనివారు సూది తీసుకొని ముదురు రంగు వూలుతో క్రింది బార్డరు వద్ద మాత్రమే అతకాలి. ఒక లేసు అల్లే సూది తీసుకొని ముదురు రంగు వూలుతో ఒక గజం పొడుగున తాడు అల్లి దానికి ఒకవైపు తెల్ల వూలుతో కుచ్చుల మాదిరి వూలును మడిచి కట్టి, కత్తిరిస్తే బంతి మాదిరి బాగుంటుంది ఈ తాడును మెడ చుట్టూ బార్డరు వద్ద ఉన్న హోల్సులో దూర్చాలి. తరువాత రెండవ వైపు కూడా తెల్ల వూలును కుచ్చుల మాదిరి మడిచి కత్తిరించి ఇంకొక బంతివంటిదానిని చేసి, ఆ తాడు రెండవ వైపు కట్టాలి ఇది స్వెట్టరు తొడిగాక ముడి వేస్తే ముందు భాగంలో కుచ్చులు చాలా బాగుంటాయి. ఏమీ లేకపోయినా బాగానే ఉంటుందిగాని కుచ్చులు పెట్టితే చాలా బాగుంటుంది.

ఇది అల్లి ఎలా ఉందో మీ అభిప్రాయములు తెలుపుతారుగదూ !



టేబుల్ క్లాత్ మూలలకు

యం. కల్యాణి (ఆమదాలవలస)



వనితా వాణి

పిండివంటలు

కిళాంబి సత్యవతీదేవిగారు వ్రాసిన వంటలు రవ్వలడ్డు, రవ్వ చంద్రకాంతలు మేము చేసినాము. చాలా బాగా కుదిరినవి. ఇంకా ఇటువంటి పిండి వంటలు తెలిపెదరని ఆశిస్తున్నాను.

వింజమూరి లీలావతి (తుంపాల)

*　*　*

మీ సంక్రాంతి సంచికలో వివరించిన విధంగా రవ్వలడ్డు చేసినాము. చాలా బాగా కుదిరినది చాలా రుచిగా కూడా ఉన్నాయి శిరోజాలంకరణ గురించి ఇంకా కొన్ని రకాలు ఎవరయినా సోదరీ మణులు తెలిస్తే వ్రాయవలెను.

వి పద్మావతీదేవి (ఖమ్మంమెట్టు).

*** శిరోజాలంకరణ పద్ధతులు మరికొన్ని త్వరలోనే ప్రచురించగలము.**

*　*　*

శ్రీమతి హైమవతి చెప్పినట్లు సగ్గు బియ్యం ఒంతికలు చేసితిమి ఎంతో బాగుగా ఉన్నవి అతిధులు కూడ వంటకాన్ని పొగిడారు. రుచ్యమైనట్టి, సులభ వంటకములైన ఈలాంటి వంటకములనే తెల్పెదరని ఆశిస్తున్నాను శ్రీమతి హైమవతి గార్కి నా కృతజ్ఞతాభి వందనములు.

వి. శేషమ్మ (శ్రీకాకుళం)

*　*　*

ప్లాస్టిక్‌తో వాచిస్ట్రాప్

ప్లాస్టిక్ దారంతో వాచి స్ట్రాపు అల్లే విధం ఏ సోదరీమణికైనా తెలిస్తే ఆంధ్ర సచిత్ర వార పత్రిక ద్వారా తెలియజేయగోర్తాను.

దర్భా కనకదుర్గ (బాపట్ల)

*　*　*

కుంకుమ తయారుచేసే పద్ధతి

ఎవరికైనా కుంకుమ పెట్టుకొను మైనము తయారుచేయుట కానీ, వైర్‌తో మనీ పాకెట్ అల్లుట కానీ వచ్చిన యెడల వనితావాణి ద్వారా తెలుపకోరుచున్నాము.

పి. ఎం మాలతి (ప్రొద్దుటూరు)

*　*　*

ఉలెన్ హాండ్‌బాగ్

11—1—61 వ తేదీ పత్రికలో కుమారి బి. పద్మావతి (నెల్లూరు) గారు వ్రాసిన ఉలెన్ హాండ్‌బేగ్ చదివాను. అది నేను కుట్టాను. అది చాలా బాగున్నది.


కుమారి మేడేటి రత్నాభాయి
(ధవళేశ్వరం)

నల్లమచ్చలకు చికిత్స

11—1—61 ఆంధ్ర సచిత్ర వార పత్రికలో డి. ప్రమీలగారు 23—11—60 తేదీ పత్రికలో పి. లలితకుమారి (కవుతరం) గారు వ్రాసిన మొటిమల మందు వాడగా అవి పోయి వాటి స్థానమున నల్లని మచ్చలు పడ్డాయి; అవి పోవు విధము తెలుపమని రాశారు.

నిజమే ఆ మందు వాడుటవల్ల మచ్చ లేర్పడును అవి పోవుటకు ఈ క్రింది విధముగా చేయ వలెను

ప్రతిదినము స్నానము ఐదు నిమిషములకు చేయబోతూ మనగా కొద్దిగా నువ్వుల నూనె రాచి, తరువాత చిటికెడు పసుపు రెండు చుక్కల నీటితో కలిపి రాచుకొనవలెను. స్నానము చేసే టప్పుడు సీకాయ గాని, కుంకుడుకాయ గాని పెట్టి రుద్దుకొనిన (అతిగా, పసుపంతా పోయేటట్లు రుద్దరాదు) బావుండును కానీ ఒక్క నియమం పాటించవలెను. సబ్బు ఏమాత్రము వాడరాదు.



కచ్ వర్కు డిజైను

—ఓలేటి నాగరత్నసత్యం (మదనపల్లె)

ఇటుల రెండు పూటలు చేసినను మంచిది. తరువాత పౌడరుబుక్కా కొట్టినట్లు రాసుకొనరాదు. ఇట్లు ఒక నెల చేసిన గుణము కనపడును. ఇది నా అనుభవము మీద రాయుచున్నాను.

మొటిమలు త్వరగా మానుటకు మరియొక మందు కలదు. అది —మనము రాత్రి 10 గం. లకు పరుండబోతా మనగా 8 గం. లకు, మిరియపు గంధము తీసి (చిక్కగా నుండవలె) మొటిమపై పెట్టవలెను. పెందలకడనే పెట్టుకొనుటవల్ల అది బెడ్ షీట్లకు, దిండు గలీబులకు అంటుకొనదు. తెల్లవారేటప్పటికి పెచ్చుకట్టి యుండును. అది గిల్లరాదు. నీటితో తడిపిన నాని వూడిపోవును.

నిత్యము పసుపు, నూనె వాడుటవల్ల ముఖము నున్నగ నుండి మెరుగుగా నుండును. పైగా శీత కాలములో సబ్బు వాడిన మొఖము పెట పెట లాడును. మొగమునందున్న చిన్న వెంట్రుకలు, ఇతర మచ్చలు కూడ పోవును ఓపిక, శ్రద్ధ తీసుకొన్న బాగుగ గుణము కనిపించును

నోరి సూర్యరత్నం (నూజివీడు)

* * *

స్త్రీలకు ముఖ్యం !

సంక్రాంతి సంచిక ఘుమఘుమ వాసనలు వెదజల్లుతూ ఎంతో ఆనందాన్ని కల్గజేసింది— తెలుగువా రందరికీ, ముఖ్యంగా స్త్రీలకు ఈ పండుగ ఎంత ముఖ్యమో, మీ పత్రికలోని చాలా వ్యాసాలు తెలియజేసినవి

ఈ సంచికలో శ్రీమతి సి. కృష్ణకుమారి గారు వ్రాసిన 'గృహజీవితంలో పురుషుడు'' అనే వ్యాసం చాలా బాగుంది—అవును మరి! సంసార నౌక దంపతు లిద్దరూ సమానంగా 'బాలన్స్' చేస్తేనే సాగుతుంది ప్రతి విషయంలో ప్రతిక్షణంలో దంపతులు బాధ్యతలను, 'ఎడ్జస్ట్‌మెంట్సును' పరస్పరంగా యాభై—యాభై శాతం వంచుకోవా లనేదే ఆదర్శంగా పెట్టుకొని—

వనితావాణి

ఒకరి నొకరు ఈవిధంగా అర్థం చేసుకొంటేనే గృహజీవితం సుఖమయంగాను, ఆదర్శవంతంగాను ఉంటుంది. ఇద్దరిలో ప్రతి ఒక్కరూ ఒకర్ని ఆశయాలకు, ఆదర్శాలకు ఒకరు లొంగిపోయి, లేనిపోని ఆవేశ కావేశ్యాలకు, పట్టుదలలకు పోక ఒకరిలో ఒకరు లీనం గావాలి ఆ బ్రతుకే సుఖమయం—నా మట్టుకు నేను ఎంతో అదృష్టవంతురాల ననుకుంటాను మావారు నేను పైన వ్రాసిన విధంగా అన్నిటిలోను ఉంటారు ఇలాగే అందరు దంపతులూ తమ గృహజీవితం స్వర్గతుల్యం చేసుకొనడం ప్రథమ కర్తవ్యం —

అలాగే మందరపు లలితగారు వ్రాసిన "సంసారజీవితంలో" ఆలు మగల పరస్పర సహకారం" అనే వ్యాసం కూడా పై వ్యాసానికి అనుగుణంగానే ఉండి ఉపయోగంగా ఉంది. ఇలాంటి వ్యాసాలు వనితాలోకానికి ఎంతో సహాయకారిగా ఉంటాయి. ఇలాంటి సాంఘిక, దైనందిన విషయాలపై వ్యాసాలు ప్రకటిస్తున్నందుకు మీకు నా కృతజ్ఞతలు.

సరళగారి "స్త్రీ" అనే వ్యాసం చదువుతూంటే ఎంతో విషయభరితంగానో ఉన్నట్లు తోస్తుంది ఇది కూడా అందరు స్త్రీలు చదివి అర్థం చేసుకోవలసిన విషయం

ఎస్. కనకసుందరి
(మలక్‌పేట — హైదరాబాద్)

* * *

భర్తసహాయం వ్రశిస్తుందా ?

18—1—61 ఆంధ్ర సచిత్ర వారపత్రిక వనితాలోకం శీర్షికలో సి. కృష్ణకుమారి గారు వ్రాసిన వ్యాసము చదివాను. భర్త భార్యకు ఇంటి పనులలో కొంచెము సహాయము చేస్తూండవలెనన్న అభిప్రాయ[illegible] రచయిత్రి వెలిబుచ్చారు. కాని నేను [illegible] సాయముతో ఏకీభవించలేను కొన్ని [illegible] కొంతమంది భర్తలు భార్యలకు ఇం[illegible] సహాయము చేసినను (వీలు చిక్కినప్ప[illegible]వారు) దానితో తృప్తి చెందక విసుగుకొంటూ సమయము వచ్చినప్పుడు దెప్పి పొడుస్తుంటారు. (భర్తలలో కూడ ఇటువంటివాళ్ళు ఉన్నా రనుకోండి). అటువంటప్పుడు ఏ భర్తకు ఇంటి పనులలో సహాయము చేయాలని బుద్ధి కలుగుతుంది ?

అందుచేత భార్యాభర్తలు పరస్పరముగా కలిసి మెలసి ఒకరి కొకరు సహాయము చేసుకుంటూ ఉంటే ఆ కుటుంబములో మనస్పర్థలు రాకుండా, కోపతాపములకు గురి కాకుండా సంసారమును సాఫీగా, ఆనందముగా సాగించగలుగుతారు లేకపోతే మరి చెప్పనక్కరలేదు ఆ సంసారము సంగతి.

ఈ వ్యాసము ద్వారా తమ అభిప్రాయములను వెలిబుచ్చినందులకు రచయిత్రికి నా అభివందనములు.

వెన్నేటి లక్ష్మి (సంబల్‌పూర్—ఒరిస్సా)

* * *

18—1—61 ఆంధ్ర సచిత్ర వారపత్రిక సంక్రాంతి సంచిక చాల బాగుంది ముఖ్యముగా వనితాలోకంలోని రెండు వ్యాసములు 'గృహ జీవితంలో పురుషుడు', 'సంసార జీవితంలో ఆలు మగల పరస్పర సహకారం' అనునవి నాకు బాగా నచ్చినవి

సంక్రాంతి సంచిక సర్వాంగసుందరంగా ప్రత్యేక ఆకర్షణలతో అందించిన మీకు మా ధన్యవాదములు.

వై కె దుర్గాదేవి (ఎర్రగొండపాలెం)

* * *

'మావారూ అంతే'

వనితాలోకంలో "గృహ జీవితంలో పురుషుడు" అనే వ్యాసం మేము చదివాము. మా అభివందనలు రచయిత్రి కృష్ణకుమారి గారికి మీ (మా) పత్రిక ద్వారా తెలియజేయ గోరుతాము వారి బాబాయిగారికి మల్లేనే మావారు కూడా ఇంటి పరిస్థితులు అవగాహనం చేసుకోరు నేను మీ వ్యాసం చదివి మావారితో గూడా చదవమని చెప్పి చదివించాను వారు కొంతవరకు పశ్చాత్తాప పడినట్లు తెలుస్తుంది ఇక మా సంసారం రెండుచక్రాల బండిలాగా సాగిపోతుందని తలుస్తాను.

బుజ్జమ్మ, (ఇంగ్లీషువారిపాలెం—బందరు)

* * *


సరళ వ్యాసం


ఈ వారం పత్రిక (18—1—61) లో సరళ గారి "స్త్రీ" అనే వ్యాసం చాలా బాగుంది వ్యాసం చిన్నదైనా చెప్పిన విషయాలు బహు గొప్పవి

ఇకనుంచి సరళగారు సలహాలతోపాటు, వ్యాసాలు కూడా మాకు అందజేస్తా రనుకుంటూ

వి. సరోజినీదేవి (ఉయ్యూరు).

చీర అంచులకు







యస్. ప్రేమ గుంటూరు

హరి వంశము

మధురాపర్వము — 19

నీ సొమ్మై పెనుపొందు రాజ్యము దగన్నీకీక
నీచాత్ముడై నీసూనుఁడెడ నాక్రమించు కొనియెన్
నిర్వ్యాజ భంగిన్ దుదిన్ దోసంబేమియులేక
యంతయును నిన్నుంజేరె
గైకొమ్మనాయాస ప్రక్రియ
నిప్పుపొందు మభిషేకానంద కళ్యాణమున్.

—హరివంశము,

మన్నించి రాజుఁజేసెను
వెన్నుడు సత్యావధాను విశ్రుతదానున్
సన్నుతమానున్ గదన
చ్ఛిన్నాహితసేను నుగ్రసేనున్ దీనున్

—భాగవతము,

అంతలో భగవంతుడు వ్యవహార తీక్ష్ణుడైనాడు. సకల యాదవ సంసత్తు ఆయనలో కల్గిన ఆ మార్పును గమనించి తాను గూడ వ్యవహారవ్యగ్రమనస్క అయినది. అంతకుముందు జరిగిన దుఃఖ జనక వృత్తాంతములు వారికి నట్టి లేదో ! అదే విచిత్రము. అందరు అక్కడ అప్పుడు స్థితప్రజ్ఞులు. ఒక మహాశక్తి ఏదో తమయందు నిలువగా, వారు గూడ ఆ శక్తిమంతుని ప్రాబల్యమునకు లోనైన వారివలె నయిపోయినారు. నారుదుని దృష్టి అప్పుడు భగవంతునియందే బద్ధమై నిలిచిపోయినది. భగవంతుని ఈచేత అతనికి అద్భుతమనిపించినది భగవంతుడు అంధకుని సంబోధించినాడు "తాత ! అవ్వ ఈ శరీరమును ఆవతలకు తీసుకుపో" అని ఆజ్ఞాపించినాడు. శ్రీ కృష్ణదేవుని ఆజ్ఞ పాలించబడినది. అప్పుడు ఆయన అన్నాడు : తాత ! ఉగ్రసేన ! నేను కంసుణ్ణి, మేనమామను చంపినాను అని నావు. ఇప్పుడు ఈ అవ్వను ఎవరు చంపినారు? మహారాజా! సర్వము కర్మవశగమై నడుస్తున్నది. కర్మమునకు మించినది, కాలమును మించినది మరిఒక్కటిలేదు. ఆ కర్మమును, ఆ కాలమును నియమించుటకు నేను ఎవ్వడను ? కాదు. నేను కంసుణ్ణి చంపినానే అంటావు అవును ! చంపినాను. ఎందుకు చంపినాను ! లోకహితాన్ని కోరిచంపినాను కీర్తిని కాంక్షించి చంపినాను, క్షత్రియుల యందు ఇవి దోషాలా ! క్షత్రియుడవు నీవు, మాటలాడవలసిన పద్ధతి ఇదియా ! తాత ! నాకు రాజ్యంమీద ఆకాంక్ష బలిసి ఇట్లా చేసినాను అని నీవు భావించడమే తప్పు ఈ రాజ్యం నాకు ఎందుకు ? నేను రాజునా ! ఆ రాజునకు ఉండవలసిన చర్యలు నాకు వున్నవా ? నేను బాలుడను అడవులలో పెరిగినవాడను. కంసుడు నన్ను అడవి మనిషి అన్నాడు అది నిజము. నాగరవృత్తములు నేను ఎరిగినవాడను కాదు. పో ! నీవురాజువేనంటావు ? నేను ఆ రాజ్యం నాకు అక్కరలేదు అంటాను. నీకు ఇస్తాను అంటాను" అని భగవంతుడు ఆగినాడు. యాదవ సంసత్తులో ఎవరును ఏమియు మాట్లాడలేదు ఏమి మాట్లాడవలెనో వారికి తోచలేదు. శ్రీ కృష్ణదేవుని మాటాడు ధోరణియే వారికి విచిత్రముగా వున్నది. ఈయన ఎవ్వడు ! అరచేతిలోని రాజ్యవైభవాన్ని కాలదన్నుకుంటున్నవాడు ! అట్లా అనుకొనిన వారు గూడ అక్కడ కొందరు లేకపోలేదు. ఉగ్రసేనుడు మాత్రము ఒక్కసారి తలయెత్తి, శ్రీ కృష్ణదేవుని కన్నులలో కన్నులుగా చూచినాడు. ఆ కన్నులు ఏమి కన్నులు ! ఆ కన్నులు మందహాసమును చేయుచున్నవి. ఆ కన్నులు ఏమి కన్నులు ! అతిలోకమైన మహత్వాన్ని విరజిమ్ముచున్నవి. ఉగ్రసేనుడు మరల తలవాల్చికొన్నాడు. భగవంతుడు మరల ఈలా అనినాడు · "ఈ రాజ్యం నాకు కార్యంకాదు. రాజు కావడం అన్నది నా కాంక్షితం కాదు రాజ్య లుబ్ధుడనై నేను కంస హంతను కాలేదు. ఆ కంసుణ్ణి నేను చంపినది అందుకుకాదు. కంసుని కులం ఏమిటి ? కంసుడు ఎవడు ? వానికి కులం లేదు. వాడు ఎవ్వడూకాడు. అందుకు అతనిని సంహరించాను. నేను సంహరించింది గూడా లేదు. వాని కర్మమే వానిని సంహరించినది. "స్వకర్మైవ నరం హంతి నశస్త్రరిపు మృత్యవః, న భేతవ్యం నవాసభ్యం చోరహత్యావలంబతే" ఇక ఇప్పుడు ఆ కంసుడు తిరిగిరాడు. తిరిగిరాని చోటునకు ఆ కంసుడు పోయినాడు. ఇప్పుడు ఈ రాజ్యం, ఇంతవరకు కంసరక్షితమై వున్న రాజ్యం. ఏమి కావలసివుంది ?" సభలో మతిమంతులు అనుకున్నారు "ఇది కంసరక్షితమైన రాజ్యమా ? కంసుని చేత బలాత్కారముగా ఆక్రమించుకొనబడిన రాజ్యమా ? "వారికి ఆ ఆలోచన రాగా భగవంతుడు గల్లున నవ్వినాడు "సభాస్తారులంతా విన్నారుగదా ! కంసునకు పశ్చిమాధ్వర కార్య సరణులు నడుపవలదని నేను అన్నానా ? ఉగ్రసేన మహారాజు భృశదుఃఖితుడు గనుక, నేను అట్లా అనినాననుకొన్నాడు ! లేదా అట్లా అనగలననుకొన్నాడు మహారాజా ! నీవు నన్ను ఇట్లా అడగవలెనా ! కాని కార్యం ఏదో చెబుతున్నట్లు మాట్లాడటం నీకు తగునా ! నీవు మాత్రం తెలియనివాడవా! కాని కార్యాన్నిపూని చెబుతావా ? కంసునకు, అతని సోదరులకు, అవ్వకు, అందరికి పశ్చిమాధ్వర కార్యసరణులు నడిపించు రాచ మర్యాదలకు ఉచితంగా నడిపించు. కంసుడు దుష్టుడే కావచ్చు కాని మహా వీరుడు. అతనిని గురించిన పశ్చిమాధ్వర కార్య సరణులు వీరోచితంగా జరిగేట్లు చూడు మహారాజా ! నీ మనస్సు వేరొక తెరగైంది. కనుక అట్లా ఆడినావు. ఏమి ! నారద ! నేను మాట్లాడినది ఉచితమా ! కాదా ?"

నారదుడు కన్నులలో నవ్వులుగా భగవంతుని దిక్కై ఇట్లా అన్నాడు : దేవకీ నందన ! నీ మాట్లాడిన దానిలో ఉచితముకానిదేది ! కానియదువృష్ణిభోజాంధక రాజచక్రం అధినేత ఎవ్వరో నిర్ణయముకాక, పశ్చిమాధ్వరకార్య సరణులు నడవడం ఎట్లా ? దేవకీనందన ! ఇది ఆలోచించినావా ?"

శ్రీ కృష్ణదేవుడు మెల్లన హసించినాడు. "నారద ! ఆ విషయం ముందే నిర్ణయించినాను గదా! ఈరాజ్యం ఎవరిది ? ఉగ్రసేనునిది. ఆ రాజ్యాన్ని కంసుడు నీచాత్ముడై కాజేసినాడు తండ్రినిత్రోలి ఆక్రమించుకున్నాడు. ఇప్పుడు ఆకంసుడు పోగా, ఆ రాజ్యం తిరిగి మహారాజైన ఉగ్రసేనుణ్ణి చేరుతున్నది. ఇందులో ఆయాసం ఏమి వుంది ?" అన్నాడు. అంతా ఆయనవంక ఆశ్చర్య దృక్కులై చూస్తున్నారు. శ్రీ కృష్ణదేవుడు మెల్లని మందహాసంతో లిరిగి ఇట్లా అన్నాడు : "నేనేమో వనేచరుణ్ణి. రాజ్యాలు చేయడం నేర్చినవాడనుకాదు గోవుల మధ్య గోపకుడనై

హారిత శివశర్మ

హరివంశము

తిరుగవలసినవాడిని గజం ఎట్లా కామచారియై, ప్రీతిమత్త్వంతో వనాలలో సంచరిస్తుందో అట్లా తిరగవలసిన వాడిని. నాకు ఈ రాజ్యాలు ఎందుకు ? మరి ఉగ్రసేనులో ! యదువులకు ఆయన అగ్రణి. ఈ రాజ్యం ఆయన గ్రహించ వలసింది. పాలించవలసింది. ఈ రాజ్యాన్ని, ఈ సిరిని, నేను కంసుణ్ణి చంపి గెల్చుకొన్నాను అంటే చెల్లదు. నేను అట్లా అనడంలేదు. మీరూ అనవద్దు. కాదు. గెలిచినానే అంటారు. సరే నేను గెలిచిన సిరిని యావత్తూ ఉగ్రసేన మహారాజునకు ఇచ్చివేస్తున్నాను. ఆయన సర్వాన్వయ ప్రభుడు" అని భగవంతుడు ఉగ్రసేనుని దిక్కు ఇట్లా అన్నాడు : తాత ! నామీద నీకు ప్రియం వున్నదా ? వత్సలత వున్నదా ? వుంటే నా ప్రార్థనాన్ని నీవు త్రోసివేసేందుకులేదు. తాత ! నీవు రాజువు. నేను నీకు లెంకను అరిగాపునై నిన్ను నేను కొలుస్తాను. నేను అంటూ వుండగా దేవతలవలన గూడా నీకు భయం కలుగదు. ఇక మానవమాత్రులయిన అన్యరాజుల సంగతి యెందుకు ? నాకు కావలసింది ఒక్కటే. అది నీవు జనపాలన శీలివి కావడం "

నారదుడు "జయ శ్రీ కృష్ణ ! జయవాసుదేవ ! జయ దేవకీనందన : నీ నిర్ణయం బాగున్నది" అన్నాడు. సభను కలయచూచి ఇంకా ఇట్లా అన్నాడు ! "బాగున్నది దేవకీనందనుని నిర్ణయం. బాగున్నది శ్రీ కృష్ణదేవుని త్యాగ మహిమ. బాగున్నది వాసుదేవుని వాగ్వైభవం ఇక్కడ ఒక ధర్మ సూక్ష్మం గూడా వున్నది. యదువీరులకు నరేశ్వరాసనమున వుండగా అర్హతలేదు అనిమన్నుయయాతి శాపం ఒక్కటి వుంది. అందువల్ల ఇప్పుడు ఈయదుసింహుడు ఆడిన మాట ధర్మ విహితం అవుతున్నది ఉగ్రసేన ! నీవు మనుమని ఈ ముద్దు చెల్లించు. సర్వ యదువృష్ణిభోజాంధకాధీశుడవు కా. నిన్ను మన్నించి శ్రీ కృష్ణదేవుడు రాజును చేసినాడు. మరి నీవు సామాన్యుడవా. సత్యావధానుడవు. విశ్రుత దానుడవు సన్నుత మానుడవు. కదనచ్ఛిన్నాహిత సేనుడవు. నీ కన్నను ఈ యదు సంసత్తులో ఇందుకు అర్హుడు ఎవడు వున్నాడు ?"

సర్వయదువృష్ణిభోజాంధక సంసత్తు ఆ మాటలు విని జయ జయ ధ్వానాలు చేసింది. శ్రీ కృష్ణదేవుని నిర్ణయాన్ని శిరసాధరించింది. ఆ నిర్ణయాన్ని అవధరించి మహారాజు ఉగ్రసేనుడు ప్రత్యుత్తరం ఏమీ చెప్పలేకపోయినాడు. అతి



చిత్రకారుడు: మండల గోవర్ధనరావు (విశాఖపట్టణం)

లజ్జా వినమ్రవదనుడైనాడు. శ్రీ కృష్ణదేవుడు వెంటనే అభిషేక సన్నాహాలు కావించినాడు. సర్వ యదుమధ్యంలోను తాను స్వయంగా ఉగ్రసేనుణ్ణి భద్రాసనంమీద ఉంచి సముచితంగా అభిషేక కార్యం నిర్వహించినాడు బద్ధమకుటుడై ఉగ్రసేనుడు సర్వ శ్రీమంతునివలె ద్యుతిమంతుడై ప్రకాశించినాడు.

యదువృష్ణి భోజమరుదాశార్హకుకురాంధకాది రాజచక్రం అధినేత ఎవరో తేలిపోయింది. ఆ అనంతరం కంసునకు, అతని సోదరులకు, తల్లికి నిధన క్రియలు ఆరంభం అయినవి. శ్రీ కృష్ణదేవుడు, సర్వ బాంధవులు, లర్హ పురోహిత భూసురేంద్రులు, పురజనులు, సమేతులుగాఉగ్రసేనుడుపుత్రులకు, భార్యకు, పశ్చిమాధ్వర క్రియాసరణులకుపూనుకున్నాడు శ్రీ కృష్ణుని శాసనాన్ని లనుసరించిఅన్నిఏర్పాట్లు అతిలోకంగా జరిగినవి శ్రీ కృష్ణదేవుడు సర్వ యదువృష్ణ్యంధకాది రాజన్య లోకంతో పురీమార్గంలో పోతూవుంటే, పురుహూతుడు దేవతలతో క[illegible] సడుస్తున్నట్లుంది. సూర్యోదయం అయిన తర్వాత కంసునకు, అతని సోదరులకు, తల్లికి, పశ్చిమ సంస్కారాలు ప్రారంభమైనవి. కంసుని దేహాన్ని, అతని సోదరుల దేహాలను, కంస మాతయొక్క దేహాన్ని శిబికలమీద నెలకొల్పారు జరగవలసిన క్రియ లన్నీ యథాశాస్త్రంగా ఆచరించారు. రాజులకు అయిన ప్రేత భూమి యమునా తీరంలో వుంది అక్కడ నైధనకర్మలు ఆచరించారు. యథాన్యాయంగా అన్ని పనులు జరిగిపోయినవి శ్రీ కృష్ణదేవునితో సర్వయాదవ లోకము ఆ కర్మలను తిలకించింది. ప్రేతములకు అక్షయం అవుతుందిగాక అంటూ అందరు ధర్మోదకాలు వదిలినారు. ఉగ్రసేనుడు బ్రాహ్మణులకు హిరణ్య దానములు, సువర్ణ దానములు, బహుళంగాచేసి, వారిని సంతృప్తి పరచినాడు. తానును సంతృప్తిపడినాడు. గోవులు, రత్నములు, నూతన వస్త్రములు విరివిగా భూదేవతలకు పంచి ఇచ్చినాడు. కంసుని ఆత్మకు, అతని సోదరుల ఆత్మలకు, తన భార్య ఆత్మకు శాంతి చేకూరగల విధంగా ఉగ్రసేనుడు ఇంకను బహుదానములు చేసినాడు. ప్రేతములకు అక్షయం అవుతుంది గాక అని పలుమార్లు అంటూ ఈ బహు దానములను ఆచరించినాడు. ఆ కర్మలు ఎట్టి లోపము లేకుండా నెరవేర్చబడినవి. సమస్త సంస్కరణములు యథోక్తములుగా ఒనరించి ఉగ్రసేనుడు కృతార్థుడైనాడు.

శ్రీ కృష్ణదేవుడు ఉగ్రసేనుని రాజునుచేసి, సర్వ రాజ్యమునకు ప్రవర్తకుడు తానై, అఖిల నియోగములు అభియోగములుగా ప్రయోగించి, మధురా పురాన్ని తొల్లిటికంటే విభవ బంధురం కావించినాడు.

వాసుదేవుని సత్కరుణా మధురాలోకన విముక్త మానసభయులై, మధురా నగరం ప్రజలు సర్వ సుఖ సమంచితులై, నిర్భయులై విలసిల్లుతున్నారు

పూర్వం కంసుని భయంవలన కాందిశీకులై విదేశాలకు ప్రవాసం పోయిన యదువృష్ణిభోజ కుకురాంధక ప్రముఖులయిన జ్ఞాతి సంబంధులను అందరిని శ్రీ కృష్ణదేవుడు రావించి వారి చిత్తములు అలరే విధంగా విత్తము లిచ్చి, ఎవరి నివాసములలో వారిని తిరిగి నెలకొల్పినాడు.

మధుర, అధరీకృత విరోధిజన విధురంగా, మధురంగా, పృథుసమజ్ఞాబంధురంగా, పరరాజన్య భిదురంగా, శ్రీ కృష్ణ బలరామ బాహుబల సమాపాదిత సకల సుఖ విలాస హేలా లీలా సుందరంగా విలసిల్లుతున్నది.

భావముపుట్టి భావ మరిభావ మభావముగాగనైన
నానావలసంబులన్ పడిన నామనమీశ్వర వల్లకాడురా
భావపు భస్మమీయెడ నివాళులు రేగును
మేనదాల్చెదో
శ్రీ విలసన్నవాంబుదశరీరునితో
పురివిప్పి ఆడెదో !

ఇది మధురా పర్వము

పెండుగులో మాణిక్యాలు

అనగనగా ఒక కోతి. దానికి జ్యోతిషం బాగా తెలుసు. అందుకని తక్కిన కోతులకు ఈ 'జ్యోతిషం కోతి' అంటే ఎంతో భక్తి, గౌరవమున్నూ...

ఒకనాడు కోతులన్నీ చెట్లమీద కూచుని ముచ్చటలాడుకొంటున్నాయి. ఆడకోతులు పేలు కుక్కుకుంటున్నాయి. ఈ సమయంలో ఆవూరి రాజుగారి ఏడుగురు కొడుకులూ ఏంచేశారూ?—ఒక గొర్రెపిల్ల వెంట పరిగెడుతూ, ఆటలాడుతున్నారు. ఆ ఆటలన్నీ కోతులు విడ్డూరంగా చూస్తున్నాయి.

అందులో ఒకకోతి, "చూశారా, ఆ గొర్రెపిల్ల ఎంత పుణ్యంచేసుకుందో!—ఏనాడో పెట్టిపుట్టింది. అందుకనే రాజకుమారులతో కలిసి సమంగా ఆడుకుంటూ రాజభోగం అనుభవిస్తోంది" అంది.

"ఓస్ !—ఇదీ ఒక ఆశ్చర్యమే?—మన 'జోస్యం కోతి'దాని గుట్టు యావత్తూ చెప్పేస్తుంది. 'ఏది, శాస్తుర్లూ!—మన గొర్రె జాతకం కాస్త చక్రం వేసి చెప్పూ'" అంది మరొక కోతి.

"జోస్యంకోతి" పంచాంగాలన్నీ తిరగేసింది. లెక్కలేసింది. గుణించింది. గళ్ళుగీసి గ్రహాల్ని గుర్తించింది. కాస్తంత అలా పైకిచూసి, "ఆ, తెలిసింది, తెలిసింది. ఈ గొర్రెపిల్లజాతకం అంతా తెలిసిపోయింది," అంటూ కాస్త ఆలోచించి, "ఆఁ!—ఆపద, గొప్ప ఆపద. మహాప్రళయంవస్తూంది"అందిఉలిక్కిపడి.

"శాస్తుర్లూ, ఏమిటీ కథా?—" అంటూ కోతులన్నీ 'జోస్యంకోతి' చుట్టూ మూగాయి.

"అయ్యో!— ఏం చెప్పమంటారు?-మీ తెలివి తెల్లారినట్లేఉందిటు. ఆ వెధవగొర్రెను చూసి మీరు సంతోషిస్తున్నారా? — అది మృత్యువు. మనపాలిటి మృత్యువు!- కొద్దిరోజుల్లోనే అది మనందర్నీ మింగుతుంది'" అంది, జోస్యం కోతి.

"ఆఁ!—"అని కోతులన్నీ ఆశ్చర్యపోయాయి.

జయలక్ష్మి

"అంతేకాదు. ఆ గొర్రెజాతకం మహాదుష్టజాతకం. ఈరాజ్యం అంతటినీ పొట్టబెట్టుకునేటట్టు కూడా కనిపిస్తూంది" అన్నది జోస్యం కోతి.

"మరైతే శాస్తుర్లూ మనకేమిటి గతి?—దానిపీక నులిమేద్దామా, పీడ వదిలిపోతుంది?—" అని అడిగాయి కోతులు.

"అయ్యో!—మీ వెర్రిగానీ, అది అంత తేలిగ్గా చస్తుందా?—ఊహుఁ, చావదు. దానికిప్పుడు చచ్చేయోగం లేదు. మీరు దాన్నేమీ చేయలేరు" అంది జోస్యం కోతి.

"ఇంకేది దారి?—"అంటూ కోతులన్నీ ముఖాలు వేలవేశాయి.

జోస్యం కోతి బాగా ఆలోచించి, "ఇంకా చూస్తూ కూచుంటారేం?—లెండి, లెండి. ఎక్కడికేనా పోయి ఏ దుంపలో తిని బతుకుదాం, రండి. ఇక్కడుంటే మాత్రం ఈ గొర్రె మిమ్మల్ని మింగేతీరుతుంది" అంది.

అంతావిని కోతుల నాయకుడిలా అన్నాడు:—

"శాస్తుర్లూ!—నీ జోస్యం గీస్యం అన్నీ నమ్మినవాళ్ళనే గాని నమ్మనివాళ్ళనేం చెయ్యవు. ఎప్పుడో ఏదో ఆపదవస్తుందని, సుఖానున్న ప్రాణం దుఃఖాన్ని పెట్టుకుంటామా?—పోపో. బలే జోస్యం చెప్పావులే. ఇక్కడ మాకు హాయిగానే వుంది. ఇక్కణ్ణుంచి మేం రానేరాం" అంది.

ఈ మాటలకు కోతులన్నీ కిక్కురు మనకుండా ఊరుకున్నాయి. కానీ జోస్యం కోతి మాత్రం అలా అలా ఎక్కడికో వెళ్ళిపోయింది !

రాజుగారిగొర్రెపిల్లకు వంటింట్లో దూరి అల్లరిచెయ్యటం అలవాటు. వంటవాళ్ళు దాన్ని చేతిలో ఏదివుంటే అది పుచ్చుకుని తరుముతారు.

ఆవేళ గొర్రెపిల్ల వంటింట్లో దూరింది. ఇష్టమొచ్చినట్టూ చిందులు తొక్కింది. వంటవాడు కోపంతో మండే కట్టెపేడు ఒకటితీసి విసిరాడు. గొర్రెవంటిమీది బొచ్చు అంటుకుంది. అది కోటంతా తిరిగింది. గుర్రాలసాలలోకి వెళ్ళింది. పశువులపాకలలోకి పరుగెత్తింది. దాంతో, లంకాదహనంలాగా నాలుగు మూలలా నిప్పంటుకుంది.

ఊరంతా వచ్చి మంటలన్నీ ఆర్పారు. కానీ, చూడగా—గుర్రాలకూ పశువులకూ వళ్ళు కాలి పుళ్ళయ్యాయి. వాటికి వైద్యంచెయ్యటానికి పేరుపొందిన పశువైద్యులు వచ్చారు. వాటికి మందు తయారు

చెయ్యటానికి కోతి మాంసం ముఖ్యంగా కావాలన్నారు. ఆమట్టున, "మనరాజ్యంలో వుండే కోతులన్నిటినీ చంపి తీసుకురండి," అని రాజుగారు ఆజ్ఞాపించారు.

ఆ ప్రకారం రాజ్యంలో కోతులు మచ్చుకు లేకుండా అన్నీ నాశనమయ్యాయి. చస్తూ చస్తూ అవి, "అయ్యో!— ఆనాడు మనం ఆకోతిని కాదన్నామే. దానిమాట అక్షరాలా నిజమయిందే!" అని దుఃఖించాయి.

ఈ చిత్రవధ చూసి కొన్ని రామచిలుకలు పోయి 'జోస్యం కోతి'తో చెప్పాయి. తనవాళ్ళకు జరిగిన అన్యాయానికి ఆకోతివలవలా ఏడ్చింది. "నా జాతినే సర్వనాశనం చేస్తాడా రాజు?—కానీ, అతనిసంగతి నేను చూస్తాను" అంటూ తను మునుపు ఉండిన బసకు బయల్దేరింది.

దోవలో 'జోస్యం కోతి'కి దాహంవేసింది. దగ్గరే ఒక చెరువుంది. కానీ, గట్టుమీద చూస్తే మనుష్యులు చెరువులోకి వెళ్లిన జాడలేగాని మళ్లీ తిరిగివచ్చిన జాడ మట్టుకు దొరకలేదు. ఇదిచూసి 'జోస్యం కోతి'కి అనుమానం పట్టుకుంది. 'ఈ చెరువులో ఏదో మొసలి వుంటుంది' అని అనుకుంది. ఆ దగ్గరే వెదురుపొద ఒకటుంది.


ఒక వెదురుతో పొడుగుపాటి గొట్టం తయారుచేసింది. ఒకకొస నీళ్ళలో పడేసి, రెండోచివర నోట్లో పెట్టుకుంది. నీళ్లు తాగడం మొదలెట్టింది. అంతలో—"సెహబాస్, కోతిబావా!—" అంటూ ఒక మొసలి బయటికి వచ్చింది. నవరత్నాలు పొదిగిన మణిహారమూ, మరికొన్ని రత్నాలూ కోతిబావకిచ్చి, "బావా!—నీ ఉపాయానికి ఎంతో సంతోషించాను" అంది.

'జోస్యం కోతి', "సరేగానీ, మీ కందరికీ గొప్ప విందు చెయ్యబోతున్నాను. నువ్వూ, నీ పిల్లలూ అంతా సిద్ధంగా వుండండి" అని చెప్పి వెళ్ళిపోయింది.

అక్కణ్నుంచి కోతి తిన్నగా ఒక బాజావాడి దగ్గరి కెళ్లింది. వాడికి కొన్నిరత్నాలిచ్చి ఒక డోలు కొన్నది. మణిహారం మెళ్లోవేసుకుని డోలువాయించుకుంటూ కోతి రాజుగారిసభకు వెళ్లింది. ఆవేళ సభలో చిన్నాపెద్దా, ఆడామగా, అంతావున్నారు. అక్కడికివెళ్లి కోతి డప్పువాయిస్తూ:

"మణిహారాలూ మాణిక్యాలూ
నవరత్నాలూ చూపిస్తాం
నాతో వస్తే కోరినవిస్తా
వస్తారా?—వస్తారా?—
మారాజా, మీరొస్తారా?—"

ఇలా పాడుతూ, తనదగ్గరవున్న రత్నాలన్నీ విరజిమ్మింది. ఇది చూసి, రాజు గభీమని లేచాడు. మంత్రులూ లేచారు. ప్రజలంతా లేచారు. ఒకళ్ల వెంట ఒకళ్లు వరసను కోతివెంట బయల్దేరారు. కోతి



మళ్లీ:—

"మణిహారాలూ, మాణిక్యాలూ
నవరత్నాలూ చూపిస్తా
మారాజులకూ చూపిస్తా
కోరినవన్నీ కొల్లలు కొల్లలు
కొల్లలు కొల్లలు కొల్లలు కొల్లలు!-"

అంటూ పాడింది. వాళ్లందర్నీ తిన్నగా చెరువుగట్టుకు తీసుకుపోయింది. "అందరూ కళ్లకు గంతలు కట్టుకోండి! గమ్మత్తు చూపిస్తా," అంది. తమాషాయేమిటో చూదామని అందరూ ఆత్రంతో గంతలు కట్టుకున్నారు.

వరుసగా ఒక్కొక్కళ్లనే నడవమని చెరువులోకి దోవచూపిస్తూ—

"మాణిక్యాలూకోరి, మణులన్నికోరి
రారాజులొచ్చారు రతనాలు కోరి
మరియాద చెయవయ్య మాటదక్కించు
పగవారు కారయ్య ప్రియమైనవారు
వచ్చిన పెద్దలు మళ్లీపోకుండ
మాట మాణిక్యమ్ము దక్కించవయ్యా!"

అంటూ పాడింది.

"జోస్యం కోతి"చెప్పినట్టే అంతా వరసను చెరువులోకి దిగారు. దిగినవాళ్ళు ఒక్కళ్లూ పైకిరాలేదు. చివరికి ఆ రాజు ఒక్కడూ మిగిలాడు. అప్పుడు "జోస్యంకోతి" రాజుకి గంతలువిప్పి, "మహారాజా— ఇప్పుడు నువ్వూ, నేనూ ఒక్కటే!" అంది.

"ఏమిటీ" అని అడిగాడు రాజు.

అందుకు జోస్యంకోతి "ఇంకా తెలియలేదా రాజా?— నువ్వు మాకోతులన్నింటిని సర్వనాశనం చేశావు. నేనూ నీ వాళ్లనందర్నీ నాశనం చేశాను. మణులూ లేవు, మాణిక్యాలూ లేవు. అంతా అబద్ధం. కానీ, ఒక్కటిమాత్రమే నిజం. నీజాతికి నువ్వు ఒక్కడివి. నా జాతికి నేనూ ఒక్కణ్ణే" అంటూ, చెంగుమని గెంతి పారిపోయింది. రాజు వెలవెలపోయాడు— ★

కవిసార్వభౌముడు శ్రీనాథుని ఎరుగని తెలుగుబిడ్డలుండరు. ఆంధ్రమాతకన్న అఖండ శేముషీ ధురంధరులలో, మహాకవిపండితులలో, రసికాగ్రేసరులలో అగ్రేసరుడాయన క్రీస్తుశకము 1380 నుండి 1460 వరకు, ఈ మహాకవి జీవించి ఉన్నట్లు చాలా ఆధారాలు ఉన్నాయి ఈయన కృష్ణాతీరగ్రామమయిన 'కలుపటము' ఒండె కాళీ పట్నమున జన్మించినాడు శృంగారనైషధము, హరవిలాసము, కాశీఖండము, భీమఖండము, పల్నాటి వీరచరిత్ర మొదలయినమహాగ్రంథాలు రచించినాడు కొండవీటి రేడులయిన రెడ్ల ఆస్థానకవిగా శ్రీనాథుడు రెడ్డి రాజ్యానికి తెలుగు సాహిత్యంలో అద్వితీయమయిన స్థానం సంపాదించిపెట్టాడు వివాదంలో గౌడ డిండిమ భట్టారకుడి కంచు ఢక్కా డొక్కా బద్దలు చేసిన బ్రహ్మాండ నాయకుడు.

శ్రీనాథుడు వ్రాసిన కావ్యాలన్నీ ఒకయెత్తు, ఆయన దేశాటనంలో చెప్పిన చాటువులన్నీ ఒకయెత్తు ఈ చాటువులు తెలుగు చాటుపద్య మణిమంజరిలోని నాయకమణులు.

శ్రీనాథుడు కొండవీటి నుండి పల్నాటికి అడపాదడపా పోయి రావలసి వచ్చేది పల్నాటిమీద మక్కువ, అక్కడి మొరటు తనమైన ఏవగింపు అయినా పల్నాడంటే అతనికున్న అభిమానం ఏవగింపులో కూడా వ్యక్తమయ్యేటట్లు అనేకచాటువులు చెప్పాడు.

రసికుడు పోవడు పల్నా
డెనగంగారంభమైన ఏకులె వడకున్
వసుధేశుడైనదున్నును
కుసుమాస్త్రుండైన జొన్నకూడేకుడుచున్

ఇందులో పల్నాటివారి మోటుతనంతో పాటు దీటుతనం కూడా శ్రీనాథుడు వెల్లడించాడు పల్నాటిలో రంభ సైతం ఏకులయినావడకి జీవిస్తుందే కాని నీచానికి పాల్పడదు గొప్ప భూస్వాములు కూడా కాయకష్ట గౌరవం గ్రహించి నాగలి పట్టి దున్నుతారేగాని సోమరులై కాలం గడపరు. పొరుగింట పుల్లకూర రుచికి మన్మథుని వంటి సుకుమారుడయినాసరే ఆశపడడు. తన సొంతనాటి జొన్నకూడే తింటాడు. పల్నాటివారి దేశభక్తి అట్టిది అని దాని తాత్పర్యం అందుకనే రసికులయిన కులాసా పురుషులకు సోమరులకుపరచింతాపరాయణులకు పల్నాట పల్లెల్లో చోటు లేదని శ్రీనాథుడు ఆ చాటువులో చాటినాడు

> "ఏమోయ్, నిన్న డాక్టర్‌ను చూడాలని సెలవు తీసుకుపోయావు మరి ఫుట్ బాల్ ఆట ఎలా ఆడగలిగావు ?"
>
> "అదేనండి. మా ఎదిరిపక్షం గోల్ కీపరేనండి మా డాక్టరుగారు"
>
> జమ్మలమడక వేంకటసుబ్రహ్మణ్యం
> (హైదరాబాదు)

పల్నాడు రాళ్లనాడు నీటియెద్దడి నీటుతక్కువ పల్నాటిపల్లెల స్థితి ఇది

అంగడియూర లేదు వరియన్నము లేదు
శుచిత్వమేమిలే
దంగనలింపులేరు ప్రియమైన వగంబులు
లేవు నీటికై
భంగపడంగ వాల్పడు కృపాతరు లెవ్వరు
లేరు దాతలె
న్నంగను సున్న గాన పలినాటికి మాటికి
పోవనేటికిన్

ఇక పలనాటి పల్లెటూళ్లు ఇవి.

చిన్నచిన్నరాళ్లు చిల్లరదేవుళ్లు
నాగులేటినీళ్లు నాపరాళ్లు
సజ్జజొన్నకూళ్లు సర్పంబులును తేళ్లు
పల్లనాటిసీమ పల్లెటూళ్లు

శ్రీనాథుడు పల్నాటిసీమలో పర్యటన చేస్తున్నప్పుడు ఒకసారి దారిలో మంచినీరు దొరకలేదు. కరవైపోయినది. నాలిక పిడచగట్టుకునిపోయినది. కవిరాజు కంఠంలో అప్పుడు కూడా కవితారసం ఇలా తొలుకాడసాగింది.

సిరిగల వానికి చెల్లును
తరుణులు పదియారువేల దగ పెండ్లాడన్
తిరిపెమున కిద్దరాండ్రా?
పరమేశా గంగవిడుము పార్వతిచాలున్.

(ఇంకా వుంది,)

చిక్కుతెచ్చిన చిక్కుడుగింజ

మద్దులూరి రామకృష్ణ

అనగా అనగా ఓ ముసలితాత. ఆ తాతతోపాటు మరెవరూ లేరు. ఓతోట, తోటలో ఓ పుంజూ కోడి పెట్ట—ఇవే తాత ఆస్తి పాస్తులు.

ఒకరోజున పుంజు, పెట్ట తోటలో దిబ్బని కెళ్లగించాయి. పుంజుకో చిక్కుడుగింజ దొరికింది.

"ఇదుగో చిక్కుడుగింజ! తిను!" అంది పుంజు.

"నువ్వే తిను" అంది పెట్ట.

పుంజు చిక్కుడుగింజ మింగింది కాని, అదికాస్త గొంతుకి అడ్డం పడింది. లోపలికి పోదు. బయటికి రాదు. మా చెడ్డ కష్టం వచ్చిపడింది.

"నువ్వు నదిదగ్గరకు వెళ్లి కాసిని నీళ్లు అడిగి పట్టుకురా!" అంది పుం~

పెట్ట పరిగెత్తింద. నదని చూసింది. "నదీ! నదీ! మా పుంజుగొంతులో చిక్కుడుగింజ చిక్కుకుపోయింది. కాసిని నీళ్లు ఇవ్వు అనడిగింది. నది నవ్వింది.

"నిమ్మచెట్టునడిగి ఆకు తీసుకురా! నీళ్లిస్తాను!" అని అన్నది నది.

పెట్ట పరిగెత్తింది. నిమ్మచెట్టుని చూసింది. "నిమ్మా! నిమ్మా! ఒక ఆకు ఇవ్వమ్మా! నిమ్మాకుయిస్తే నది నీళ్లిస్తుంది. నీళ్లుతాగితే పుంజు గొంతులో చిక్కుడుగింజ పోతుంది." అని చెప్పింది పెట్ట.

నిమ్మచెట్టు నవ్వింది.

"నిమ్మాకు ఇస్తాను కాని కాపుకన్నెవద్దకుపోయి దారం ముక్క అడిగి తెచ్చిపెట్టు" అంది నిమ్మచెట్టు.

పెట్ట పరిగెత్తింది. కాపుకన్నెని చూసింది. "అక్కా! అక్కా! కాస్త దారం ముక్క ఇవ్వు. దారంముక్క ఇస్తే నిమ్మచెట్టు ఆకు ఇస్తుంది. నిమ్మాకు నదికిస్తే నీళ్లుస్తుంది. నీళ్లు తాగితే పుంజు గొంతులో చిక్కుడు గింజ పోతుంది." అని అన్నది పెట్ట.

"దారంముక్క ఇస్తాను కాని వడ్రంగివద్దకుపోయి గిలక తెచ్చి పెట్టు" అని అన్నది కాపుకన్నె.

పెట్ట పరిగెత్తింది. వడ్రంగిని చూసింది. "అన్నా! అన్నా! ఒక గిలక ఇవ్వు. గిలక ఇస్తే కాపుకన్నె దారంముక్క ఇస్తుంది. దారంముక్క తీసుకుని నిమ్మచెట్టు ఆకు ఇస్తుంది. నిమ్మాకు నదికిస్తే నీళ్లిస్తుంది. నీళ్లు తాగితే పుంజుగొంతులో చిక్కుడు గింజ పోతుంది." అని అన్నది పెట్ట.

వడ్రంగి నవ్వి అన్నాడు.

"రొట్టెలవాడి దగ్గరకువెళ్ళి ఒక రొట్టె తెచ్చిపెట్టు! గిలక ఇస్తాను!"

పెట్ట పరిగెత్తింది. రొట్టెలవాణ్ణి చూసింది. "అన్నా! అన్నా! ఒక రొట్టె ఇవ్వు. రొట్టిస్తే వడ్రంగి గిలక ఇస్తాడు. గిలక తీసుకుని కాపుకన్నె దారంముక్క ఇస్తుంది. దారంముక్క తీసుకుని నిమ్మచెట్టు ఆకుఇస్తుంది. నిమ్మాకు నదికిస్తే, నీళ్లిస్తుంది. నీళ్ళుతాగితే పుంజుగొంతులో చిక్కుడుగింజ పోతుంది" అని అన్నది పెట్ట.

రొట్టెలవాడు నవ్వి అన్నాడు కదా:

"కట్టెలవాణ్ణి అడిగి కట్టెలు తెచ్చి పెట్టు. నీకు రొట్టె ఇస్తాను."

పెట్ట పరిగెత్తింది. కట్టెలవాణ్ణి చూసింది. "అన్నా! అన్నా! ఒక కట్టెల మోపు ఇవ్వు. కట్టెలు ఇస్తే రొట్టెలవాడు రొట్టె ఇస్తాడు. రొట్టె తీసుకుని వడ్రంగి గిలక ఇస్తాడు. గిలక తీసుకొని కాపుకన్నె దారం ముక్క ఇస్తుంది. దారంముక్క ఇస్తే నిమ్మచెట్టు ఆకు ఇస్తుంది. నిమ్మాకు నదికిస్తే నీళ్లిస్తుంది. నీళ్లు తాగితే పుంజుగొంతులో చిక్కుడు గింజ జారిపోతుంది" అని అన్నది పెట్ట.

కట్టెలవాడిదగ్గర కట్టెలున్నాయి. వాడికి తినడానికి ఏమీలేదు. పెట్ట జాలిపడి ఒక కోడిగుడ్డు ఇచ్చింది.

గుడ్డు తీసుకుని కట్టెలవాడు కట్టెలు ఇచ్చాడు. కట్టెలు తీసుకొని రొట్టెలవాడు రొట్టెలిచ్చాడు. రొట్టె తీసుకుని వడ్రంగి గిలక ఇచ్చాడు. గిలక తీసుకుని కాపుకన్నె దారం ఇచ్చింది. దారం ముక్క తీసుకుని నిమ్మచెట్టు ఆకు ఇచ్చింది. నిమ్మాకు తీసుకుని నది నీళ్లిచ్చింది. నీళ్ళు తాగింది పుంజు. చిక్కుడుగింజ జారి పోయింది.

కోడిపుంజు ఆనందంగా రెక్కలు రెపరెప లాడించి "క్కొక్కొరోక్కో" అని కూసింది.

కోడికూతవిని తాత మేల్కొన్నాడు! ★

న్యూఢిల్లీ లేఖ

(16-వ పేజీ తరువాయి)

రాష్ట్రాల పథకాలు తగ్గించబడితే, తమ పరిస్థితి ఇరకాటంలో పడుతుందని వారు భావిస్తున్నారు. అందువల్లనే ఆ పథకాలను ప్రణాళికా సంఘం కత్తిరించడానికి పూనుకునేసరికి, వారు ఎదురు తిరిగారు. తృతీయ ప్రణాళిక అమలుకు ప్రభుత్వం రు. 7500 కోట్ల కంటే ఎక్కువ సమకూర్చలేదని ఆర్థిక మంత్రి శ్రీ మొరార్జీదేశాయ్ స్పష్టం చేశారు. ప్రణాళికాసంఘం కూడా ఇలాగే చెప్పింది. అస్సాం భాషా వివాదం, బెరుబారి ఉదంతం పర్యవసానంగా డా. బి. సి. రాయ్‌ని బుజ్జగించక తప్పిందికాదు. తృతీయ ప్రణాళికా కాలంలో అదనపుపన్నుల ద్వారా రు. 350 కోట్లు సమకూర్చుకో గలమని తాము హామీ యిచ్చినప్పటికీ, తమ రాష్ట్రం పథకాలను ప్రణాళికా సంఘం ఆమోదించలేదని డా. రాయ్ కోపగించుకున్నారు. ఏమైతేనేమి ప్రణాళికాసంఘం తమ నిర్ణయాన్ని సడలించుకుని, ప్రభుత్వ రంగంలో ఖర్చు చేయవలసిన మొత్తాన్ని రు.8000 కోట్లకు పెంచేందుకు ఆమోదించింది. గరిష్ఠ పరిమితిని ఈవిధంగా రు. 8000 కోట్లకు పెంచినా, కేటాయింపులు రు. 7500 కోట్లకు మాత్రమే పరిమితం అయి ఉంటాయని సంఘం ప్రకటించింది. అంటే ఆయా రాష్ట్రాలు తమ ప్రణాళికలలో చేర్చుకోదలచిన అదనపు పథకాలకు స్వయంగా ధనం సమకూర్చుకోవాలన్న మాట. తృతీయ ప్రణాళికలో "తగ్గించడానికి వీలుకాని పథకాలు"ఏవో, "తగ్గించడానికి వీలు అయ్యే పథకాలు" ఏవో, "ఇదమిత్థంగా లేని పథకాలు"ఏవో, ప్రణాళికా సంఘం అప్పుడే నిర్ణయించింది.

కేంద్ర మంత్రివర్గంలో ఆహార, వ్యవసాయ, సమాజాభివృద్ధి, సహకార, విద్య, ఆరోగ్య, కార్మిక, సాంస్కృతిక వ్యవహారాల శాఖలతో కూడిన చిన్నసైజు రాజ్యం ఒకటి ఉన్నదనీ, ఏదో ఒక వంక పెట్టుకొని, వీటి ద్వారా కేంద్రం నుంచి డబ్బు గుంజవచ్చుననీ, రాష్ట్రాలకు బాగా తెలుసు. ఉదాహరణకు విద్యాశాఖనే తీసుకుందాం. ప్రజలకు పన్నుల భారం తగ్గించడానికి బదులుగా ఈ శాఖ 80 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలకు అవకాశం కల్పించింది. శ్రీ ఎస్. కె. డే నిర్విరామంగా గ్రామ సేవకుల దళాలను తయారుచేయిస్తున్నారు. ఈ పూరేగింపు ఇలా సాగిపోవలసిందే. ఈలోగా ప్రధానమంత్రి పొదుపు అలవరచుకో వలసిందని ప్రజలకు ఉద్బోధిస్తూ ఉంటారు.

*　　*　　*

ఇటీవలకొన్ని వారాలనుంచి ఢిల్లీలో 'గూఢచారుల"ను గాలించి పట్టుకుంటున్నారు. ఇంతవరకు అందిన వార్తలనుబట్టి, నాలుగు గూఢచారుల ముఠాలు పట్టుబడ్డాయని తెలిసింది. ఈ ముఠాలన్నింటికి కమ్యూనిస్టు దేశాలతో సంబంధం ఉన్నదని విశ్వసిస్తున్నారు.

అస లీజాడ్యానికి మూలం వేరే ఉన్నది. పైకి అసంబద్ధంగా కనిపించినా, ప్రభుత్వ రహస్యాలు బయట పడటానికి మద్యనిషేధం కూడా ఒక కారణమని చెప్పక తప్పదు. ప్రతి ఆరుమాసాలకు మద్యం ఖరీదు పెరిగిపోతోంది. మరొక వంక ఢిల్లీలో మద్యపానం అలవాటు చేసుకునేవారి సంఖ్య నానాటికి అధికం అవుతోంది. అధికారులు, అనధికారులు నిత్యం సాయంత్రం గుమిగూడేందుకు విదేశీ రాయబారుల కార్యాలయాలు చక్కని "ఒయాసిస్"లుగా తయారయ్యాయి. వాటిలోపే రాత్రీ విస్కీ మంచినీళ్ల ప్రాయంగా ప్రవహించే విందులు జరుగకుండా వుండవు. విదేశీ దౌత్య ప్రతినిధులతో పలానావర్గం ఉద్యోగులు మాత్రమే కలసి మెలసి ఉండవచ్చునని ప్రభుత్వం నిర్ణయించలేదు. అంతేకాక, రామలీలా ఉత్సవాలకు సైతం విదేశీ దౌత్య ప్రతినిధులకు ఆహ్వానాలు వెడతాయి. నిజం చెప్పవలసివస్తే, ఈ ఉత్సవాలు మహా రభసగా తయారవుతున్నాయి. ఉదాహరణకు ఉత్సవ నిర్వహణ సంఘాల సభ్యులు, రాష్ట్రపతి భవనంనుంచేగాక, విదేశీ రాయబారుల కార్యాలయాలనుంచి కూడా తమకు ఆహ్వానాలు వచ్చే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వ్యాపారస్తులు ఏదో విధంగా ఆహ్వానాలు తెప్పించుకొనిగాని, లేక గేట్లు పడగొట్టిగాని విదేశీ దౌత్య ప్రతినిధుల విందులకు హాజరవుతున్నారు. ఇలాగే మరికొంత కాలం గడిస్తే, ఎవరో ఒక విదేశీ దౌత్య ప్రతినిధి హాజరు కానిదే వివాహం జరిపించనని పురోహితుడు కూడా భీష్మించుకొని కూర్చునే రోజులు రావచ్చు.

క్లబ్బులు ప్రధానంగా బ్రిటిష్ సంప్రదాయానికి సంబంధించినవి. ఇవి బ్రిటన్‌లోను, దాని వలస రాజ్యాలలోను మాత్రమే బాగా అభివృద్ధి చెందాయి. భారతదేశంలో వీటిని బ్రిటిష్‌వారు తమ కోసమే ఏర్పాటు చేసుకున్నారు. 1921 రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత, భారత-బ్రిటిష్ ప్రజల మధ్య సద్భావం పెంపొందింపజేసేందుకు బ్రిటిష్ రాజ ప్రతినిధి చమ్సుఫర్డ్ తమ పేరు మీదుగా ఒక క్లబ్ నెలకొల్పారు. ఢిల్లీ, సిమ్లా నగరాలలోఉన్న ఈ క్లబ్ ప్రాముఖ్యం పండిత మోతీలాల్ నెహ్రూ నాయకత్వాన స్వరాజ్యపార్టీ కేంద్ర శాసన సభలో ప్రవేశించిన తరువాత నశించింది.

రాజధాని ఢిల్లీకి మారిన కొద్ది కాలానికే 1912లో హెయిలీ ప్రభువు "ఇంపీరియల్ ఢిల్లీ జింఖానా క్లబ్"ను స్థాపించి, తామే దానికి అధ్యక్షుడుగా వ్యవహరించారు. ఐదవ జార్జి రాజు పట్టాభిషేకం సందర్భంలో, తపాలా కార్యాలయం కోసమని పాత ఢిల్లీలో నిర్మించిన భవనంలో మొదట ఈ క్లబ్ ఏర్పాటు అయింది. న్యూఢిల్లీ నిర్మింపబడిన తరువాత, కింగ్‌జార్జి ఎవెన్యూలో ప్రస్తుతం "కాశ్మీర్ భవనం" అని అంటున్న భవనంలోకిదీనిని తాత్కాలికంగా తరలించటం జరిగింది. క్లబ్‌కు సొంత భవనం కావలసివచ్చి, నిర్వాహకులు ప్రభుత్వాన్ని రు. 3 లక్షలు ఋణం అడిగారు. ఈలోగా 1921 రాజ్యాంగం అమలులోకి వచ్చి, ఆర్థికస్థాయీ సంఘం ఏర్పడింది. భారతీయులు అధిక సంఖ్యాకులుగాఉన్న ఈ సంఘం, క్లబ్ నిర్వాహకులు కోరిన ఋణాన్ని ఆమోదించవలసి వచ్చింది. ఋణం మంజూరుచేస్తూ, క్లబ్‌లో యూరపియన్లతోపాటు భారతీయులకు కూడా ప్రవేశంఉండాలని షరతు పెట్టారు.

1947 వరకు ఈక్లబ్ దాదాపు సమైక్య ప్రభుత్వశాఖల సంస్థగా ఉండేది. సంస్థానాదీశ్వరులనుంచి, పబ్లిక్ వర్క్సుశాఖ కాంట్రాక్టర్లనుంచి ఒక డజను మంది మాత్రమే అనధికార సభ్యులుగా ఉండేవారు.

ప్రస్తుతం ఈ క్లబ్ సభ్యులలో అధిక సంఖ్యాకులు అనధికారులే అయినా, నిర్వాహణ సంఘంలో ఎక్కువ మంది అధికారులే ఉన్నారు. ఏటా అనధికార సభ్యులు, నిర్వహణ సంఘంలో 100 కి 80 మంది అధికారులు ఉండేట్లుగా ఎందుకు ఎన్నుకుంటారో ప్రభుత్వం పరిశీలించటం అవసరం.

*　　*　　*

భావనగర్ కాంగ్రెస్ సమావేశంవల్ల కాంగ్రెసువాదులకు కొన్ని ముఖ్య విషయాలు తెలిసివచ్చాయి. గుర్జాతీలు ఎంతో క్రమశిక్షణ కలవారనీ, నియమబద్ధంగా వ్యవహరించేవారనీ వీరు (కాంగ్రెసువాదులు) గ్రహించారు. మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్ ఉద్బోధలు వృధా కాలేదని కూడా దీనివల్ల స్పష్టమవుతోంది. సమావేశంలో విసుగు విరామం లేకుండా సిద్ధాంతాలుఏకరువు పెట్టారు. మద్యనిషేధం విఫలమైనదని, ఒకే ఒక రాష్ట్రం ప్రకటించినా, ఎన్నికల ప్రణాళికనుగూర్చి ఆమోదించిన తీర్మానంలో ఈ విషయాన్ని ముందు పేర్కొన్నారు. వాణిజ్య శాఖ ఒక వంక మిల్లు వస్త్రాల ధరల తగ్గింపు కోసం ధర్మ యుద్ధం కొనసాగిస్తూ, మరొక వంక నిల్వఉన్న ఖాదీ వస్త్రాన్ని అమ్మించేందుకు నూటికి రు. 33 ముదరా ఇస్తోంది. ★

"మరేనండి. ఇక్కడినుంచి అలహాబాద్ వరకూ ఉన్న ఈ సెక్షనులో ఇంకా పట్టాలు వెయ్యలేదు. అలహాబాద్‌నుంచి మళ్లీ బయ ల్దేరుతుంది" అన్నాడు కండక్టరు.

"మరి ఈ మార్గం అంతా పూర్తి అయ్యి రైళ్లు నడుస్తున్నాయని పేపర్లో రాశారే ?"

"దానికేముందండి. పేపర్ల పొరబాటది."

సర్ ఫ్రాన్సిస్‌కు చిరుకోపం వచ్చింది — కండక్టరు పేపర్లను తిట్టినందు క్కాదు, ఈ పరిస్థితి మీద. "ఇది ఇలా ఉన్నా, మీరు బొంబాయి

80 రోజుల్లో భూప్రదక్షిణం

(14 వ పేజీ తరువాయి)

నుంచి కలకత్తాకు టిక్కెట్లు అమ్మేస్తున్నారా ?" అన్నాడు తీవ్రంగా.

"దానికేముందండీ. ఖోల్బి నించి రైలు లేదనీ, అలహాబాదు వరకూ మార్గాంతరం చూసుకుని ఇంకో సాధనం చేసుకో పోవాలని జనం అందరికీ తెలుసుగా" అన్నాడు కండక్టరు.

సర్ ఫ్రాన్సిస్‌కు ఉవ్వెత్తున కోపం వచ్చేసింది. పాస్పార్టుకు కూడా ముఖం ఎఱ్ఱబడిపోయింది. ఒక్క దెబ్బతో కండక్టర్‌ను దిమ్మ తిరిగేలా పడగొట్టేవాడే ... యజమాని ముఖం చూడడానికి కూడా జంకు పుట్టింది పాస్పార్టుకు.

కాని ఈ ఉపద్రవానికి ఫిలియాస్‌ఫాగ్ ఆవేశంతో వణకడం లేదు. కండక్టర్ భుజం తట్టి మెచ్చుకోవా లనిపించక పోయినా, తన్నాలని మాత్రం అనుకోలేదు.

"సర్ ఫ్రాన్సిస్! మీరు దయచేసి ఇక్కడి నించి బయల్దేరి అలహాబాద్‌కు వెళ్ళే సాధనం సంగతి చూస్తే మంచిది. రండి వెళదాం" అన్నాడు నెమ్మదిగా.

"మిస్టర్ ఫాగ్! ఈ జాప్యం మీ యాత్ర మీద ఎంత దెబ్బ తీస్తుందో కనుక్కున్నారా!"

"ఫరవాలేదు. ఇం దు కు ము ం దే జాగ్రత్త పడ్డాను."

"ఏమిటీ? ఈ రైలు ఇక్కడ ఆగిపోతుందని మీకు ముందరే —"

"తెలీదు. బొత్తిగా తెలీదు. కాని ఇది కాపోతే ఇలాటిదే మరోటి — ఏదో ఒకటి విఘ్నుకు పడుతుందని మాత్రం నాకు తెలుసు. అందువల్ల ఇప్పుడొచ్చిపడ్డ ఇబ్బందేమీలేదు. ఇంతవరకు జరిగిన యాత్రలో నేను రెండు రోజులు ఆదా చేసుకున్నాను. ఓడలు త్వరగా రావడంవల్ల అది కలిసొచ్చింది. కలకత్తానుంచి హాంకాంగ్‌పోయే ఓడ అక్టోబరు 25 మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరుతుంది. ఇవాళ ఇంకా ఇరవైమూడే గదా. ఇక్కడ ఈ ఆలస్యం అయినా, కలకత్తా వేళకి చేరుకోగలం" అన్నాడు ఫాగ్.

ఇంత ధీమాగా, ఖచ్చితంగా ఆలోచించి లెక్కలు వేసి చెప్పిన మనిషికి ఇక చెప్పేదేమీలేదు.

రైలు దారి అక్కడ ఆగిపోయినమాట నిజంగా నిజమే. పత్రికలు ఆ మాట చెప్పలేదంటే అది వేరే సంగతి. ఎప్పుడు ఒక గంటో ఎంతో ముందడుగు వేయాలని ఉబలాటపడి పరిగెత్తే కొన్ని గడియారాలలాటివి పత్రికలు. అందువల్ల దారి పూర్తి కాకుండానే అయిపోయిందని ప్రకటించేశాయి ఉత్సాహం కొద్దీ. రైలు ఇక వెళ్ళదని ఎరిగున్న జనం అంతా అప్పటికే బండి దిగి గబగబ ఊళ్ళోకివెళ్ళి, బళ్ళు కట్టించేసుకుపోతున్నారు. ఎద్దుబళ్ళు, నాలుగుచక్రాల పల్లకీ బళ్ళు, చక్రాలున్న గుళ్ళలా, రథాలలాఉన్న భారీ బళ్ళు, పల్లకీలు, మేనాలూ ఎక్కిపోతున్నారు. కొందరు గుర్రాలు, కంచర గాడిదలు కిరాయికీ మాట్లాడుకుంటున్నారు. ఫాగ్, సర్‌ఫ్రాన్సిస్ వెళ్ళేసరికి ఉన్న అన్ని రకాల వాహనాలూ కదలివెళ్ళిపోయాయి. వీళ్ళకేం దొరకలేదు.

"నేను నడిచి వెళ్తాను" అన్నాడు ఫాగ్. అక్కడికి అప్పుడే వచ్చిన పాస్పార్టు గతుక్కుమన్నాడు. తన చక్కని, సుకుమారమైన జోళ్ళు చూసుకున్నాడు. ఇంకా నయం. తను వాహనాలకోసం వెతకబట్టి సరిపోయింది. ఎటొచ్చితను చూసివచ్చినది నచ్చుతుందో నచ్చదో.

"నాకో సాధనం కనబడిందండి" అన్నాడు కాస్సేపు తటపటాయించి.

"ఏమిటీ?"

"ఏనుగండి. ఏనుగు. ఇక్కడే వో నూరడుగుల దూరంలో ఉంది. ఈ దేశపు అసామీ ఒకడున్నాడు. అతనిదిట."

"వెళ్ళిచూదాం పదండి" అన్నాడు ఫాగ్.

ఐదు నిముషాలలో అక్కడికి చేరుకున్నారు ముగ్గురూ. ఎత్తైన బద్దలతో ఒక పెద్ద కంచె వేసి ఉంది. పక్కనే చిన్న గుడిసె ఉంది. కంచెలో గజం, ఇంట్లో గజపతి ఉన్నాడు. అతను వీళ్ళని తీసుకెళ్ళి ఏనుగును చూపించాడు. ఏనుగు బాగా మదించి ఉన్నట్టుంది. కనీసం మచ్చిక అయినదిలా కనబడలేదు. నిజానికి యజమానికి దాన్ని కిరాయికిత్తిప్పే ఉద్దేశం లేదు. యుద్ధాలకి సిద్ధపరచాలని. అందుకని, సాత్వికమైన ఆ జంతువుని అతను మెల్లిగా మదపు టేనుగుగా దిద్దుతున్నాడు. హిందువుల పరిభాషలో దీన్ని "మస్తు" అని అంటారు. ఆ మదం ఎక్కితే దాన్ని పట్ట పగ్గాలుండవు. అందుకనే, మూడు నెలలుగా అతను దీనికి చెరకు, వెన్న మస్తుగా పెడుతున్నాడు. నిజానికి, అందు కిది సరైన పద్ధతికాదుగాని, చాలామంది ఈ పద్ధతులే అవలంబిస్తారు— ఫలితాలూ సాధిస్తారు.

ఆ ఏనుగు పేరు కియోని. సాటి ఏనుగు లన్నిటిలాగే కియోనీ కూడా దూర ప్రయాణాలు అలుపు సొలుపూ లేకుండా ధాటీగా సాగించగలదు. వాహనాంతరం లేదు కాబట్టి, ఫాగ్ ఆలోచించి, చివరికి గజ వాహనం తప్పదని తీర్మానించుకున్నాడు. ఏనుగులు చాలా విలువైనవి. వాటి సంఖ్య చిక్కి శల్యమైపోతున్న ఇండియాలో మరీను. ఏనుగుని పట్టి మచ్చిక చేయడం అంటూ జరిగితే ఇక అది పిల్లల్ని కనడం బహు అరుదు. అందువల్ల ఇంకో ఏనుగు కావాలంటే వెళ్ళి వేటాడి తెచ్చుకోవడమే మార్గం. అందువల్ల ఏనుగుల గిరాకీ ఎక్కువ. బహు జాగ్రత్తగా చూసుకుంటారు. అంచేతనే ఫాగ్ ఏనుగ నడగగానే, యజమాని ఇవ్వనని నిష్కర్షగా చెప్పేశాడు.

ఫాగ్ పట్టుబట్టి ఒకటికి పదిసార్లు అడిగాడు. కావలసినంత కిరాయిస్తానన్నాడు. గంటకి పది పౌండ్లు తీసుకో అన్నాడు. అబ్బే వద్దండి....ఇరవై పౌండ్లు... అక్కరలేదు...నలభై...వూహూఁ....ఫాగ్ రేటు పెంచినపుడల్లా అంకెలు విని గుండె గుబేలుమని పాస్పార్టు ఎగిరెగిరి పడుతున్నాడు. ఇండియన్ మాత్రం లొంగిపోవటంలేదు. డబ్బు తక్కువేంకాదు. అలహాబాద్ చేరడానికి సుమారు 15 గంటలు పడుతుంది. ఆ లెక్కని అతనికి ఆరువందల పౌండ్లు దోసిట పడతాయా మరి.

ఇంత జరిగినా ఫలియాస్ ఫాగ్ ఉసురసురనలేదు. చిరాకు పడలేదు. పోని కొనేస్తాం అమ్ముతావా"? అని అడిగాడు. వెయ్యి పౌండ్లు ఇస్తానన్నాడు మొదటి బేరానికి.....అబ్బే లాభం లేదండి...ఒకవేళ బాగా డబ్బు పిండాలని ఆశ పడుతున్నాడేమో.

సర్ ఫ్రాన్సిస్‌కి ఈ ధోరణిచూడగా కంగారు పుట్టింది. ఫాగ్‌ని పక్కకి పిలిచి, కొంచెం ఆలోచించి మరీ బేరం పాడమని హితవు చెప్పాడు. ఆలోచించకుండా ఏ పనీ చేసే అలవాటు తన కెన్నడూ లేదని చెప్పాడు ఫాగ్. అవతల పందెం ఒడ్డినది. 20 వేల పౌండ్లు. అది నెగ్గాలంటే ఇపుడు ఏనుగుండి తీరాలి. అంచేత దాని అసలు విలువకు ఇరవై రెట్లు డబ్బు పారేసినా నష్టంలేదు. ఇదీ ఫాగ్ వాదం.

మళ్ళీ ఇండియన్ దగ్గరకు వెళ్ళాడు. చింతాకులంతవున్న, వాడి సన్నటి చిన్న కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి. కళ్ళుగాదు. వాటిలో ఆశ మెరుస్తోంది. బెట్టుకి కారణం డబ్బేననీ, ధర కుదిరితే ఒప్పేసుకుంటాడనీ వాడి వాలకం చెబుతూనే ఉంది.

ఫిలియాస్‌ఫాగ్ బేరం పాడ సాగాడు. స్వరం మెల్ల మెల్లగా పైకి వెళ్తోంది. 12 వందలు, 15 వందలు, 18 వందలు చివరికి రెండు వేలు అనడంతో తార స్థాయిని అందుకుంది. కనీసం కళ్ళప్పగించి నోరు వెళ్ళబెట్టి చూస్తున్న పాస్పార్టు ప్రాణాని కది తార స్థాయే అనిపించింది. ఎప్పుడూ గులాబీ ఛాయలో కలకలాడే అతని ముఖం ఒక్కసారిగా తెల్లబోయి పాలిపోయింది.

రెండు వేలు అన్నమాట వినగానే, ఇండియన్ ఒప్పేసుకున్నాడు.

"దీని అసాధ్యంగులా! ఏనుగుమావసాని కెంత ఖరీదు గిట్టింది" అన్నాడు పాస్పార్టు ఉండబట్టలేక.

బేరం, తద్వారా వాహనం కుదిరిపోయాయి. ఇక కావలసింది నిర్వాహకుడు. మావటీడుగా రావడానికి ఒక పార్సీ పడుచువాడు కుదిరాడు. చురుకైన ముఖం, బుద్ధి ఇంకా చురుకు చేరడంకోసం ప్రయాణం చురుగ్గా సాగిస్తే చాలా పెద్ద మొత్తం బహుమతి ఇస్తానని ఆశ పెట్టాడు ఫాగ్. పార్సీకి మావటీడు పని కూడా తెలిసినట్టే ఉంది. ఏనుగుని ఇవతలికి తెచ్చాడు. వీపుమీద అంబారీ దుప్పటీ పరిచారు. ఆ పైన ఎడాపెడా రెండు హౌదాలు అమర్చాడు. హంసతూలికాతల్పాల సౌఖ్యం చవిచూపేటంత టివి కాకపోయినా, ఏదో కూర్చుందికి అమరాయి.

తివాచీ సంచిలోంచి, పెళపెళలాడుతున్న సరికొత్త బ్యాంకు నోట్లుతీసి ఇండియన్‌కు రెండు వేలూ చెల్లించాడు ఫాగ్. అవి లెక్కపెడుతూంటే ఆచప్పుడు పాస్పార్టుకు తన ఎముకలు విరిగి నట్టనిపించింది. ఇచ్చేస్తూ ఉంటే ప్రాణాలే పోయినట్టనిపించింది. ఊపిరి ఆడలేదు.

"మీరూ మాతో రండి అలహాబాద్‌లో దిగబెడతాను" అంటూ సర్ ఫ్రాన్సిస్‌ను ఆహ్వానించాడు ఫాగ్. ఆయన సమ్మతించాడు. ఇంత పెద్ద వాహనానికి మరొక్క మనిషి పెద్ద బరువేం కాబోడు. బయల్దేరేముందు గ్రామంలోకివెళ్ళి, కావలసిన భోజన పదార్థాలు కొనుక్కొన్నారు. సర్‌ఫ్రాన్సిస్ ఒక హౌదాలోనూ, ఫాగ్ రెండో దాంట్లోనూ ఎక్కి కూర్చున్నారు. ఇద్దరికీ నడుమన, ఏనుగు వీపుమీద పాస్పార్టు కూర్చున్నాడు. కాళ్ళు బార జాపు కు ని మావటీడు ముందెక్కి కూర్చున్నాడు.

తొమ్మిది గంటలకి గజవాహనం కదలి ముందడుగు వేసింది. నెమ్మదిగా చిక్కటి తోటితోపులో ప్రవేశించింది.

(పై వారం —'సతి')

ఆనందంతో దబకలెత్తి పోతూనే ఉంది. అప్పుడెప్పుడూ మానసాకాశంలో తటిల్లతలా మెరసి మాయమైపోతూ వచ్చిన తన ఊహాసుందరి విస్పష్టమైన రూపాన్ని ధరించి తన కోసం వేచి చూస్తోందన్న భావన మదిలో మెదలిన ప్రతిసారీ హృదయవీణ పైన ఆనంద భైరవి రవళించినట్టు తను పరవశుడైపోయాడు. ఆ పరవశత్వం వెనుక మళ్ళీ కొన్ని సందేహాలు — తన జీవితాన్ని పంచుకోనున్న ఆ అమ్మాయి ఎలాంటిది ? ఎలా ఉంటుంది ? తల్లి ఆమెను ముత్తెమంటుంది. పగడమంటుంది. చిదిమి దీపం పెట్టవచ్చునంటుంది. స్వరూపాన్ని కళ్ళఎదుట నిలపదు గానీ ఆ వర్ణన పండుగనాటికి గానీ చేతికి రాబోని తినుబండంలా మనసును వూరిస్తూంది.

అసలు వేచివుండడంలోనే మోదమూ, ఖేదమూ, పాలూ, నీరులా కలిసి వున్నాయేమో ! సమాగమాన్ని గురించి తలచుకున్న కొద్దీ మోదం, ఆలస్యమనిపించిన కొద్దీ ఖేదం.

ఏలాగైతేనేం, మూడుమాసాల వ్యవధి ముగింపుకు వచ్చింది.

ఐతే తన గ్రహచారం మాత్రం తనపట్ల వక్రించింది.

ఆవిడ నవ్వితే తనిప్పుడు ముత్యాలు ఏరుకోగూడదట ! ఆవిడ పెదవి కదిపితే ఆ మాటల మకరందాన్ని ఆస్వాదించ గూడదట ! ఆ మంచి రోజు కోసం తనింకా నాలుగు రోజులు వేచివుండాలని ఆంక్ష విధించారు పెద్దలు !

సంధ్యా సౌందర్యాన్ని విలోకిస్తూ ఏటి యిసుక తిన్నెపైన కూర్చున్నాడు శేషాద్రి. ఆకసంలో మబ్బులు, గాలిలో పక్షులు, నీటి పాయలో చేపలు అన్నీ జంటలు జంటలుగా పరుగెడుతున్నాయి. శేషాద్రి కళ్ళు మూసుకున్నాడు. ఏటి ప్రక్కన చెట్లగుబురులోనుంచి క్రొత్తగా జంటకట్టిన కోయిల ఒకటి రసాలకిసలయంతో పదునెక్కిన పంచమస్వరంతో తన ప్రియురాలిని పిలుస్తోంది. శేషాద్రి చెవులుమూసుకున్నాడు !

శేషాద్రి మళ్ళీ కళ్ళు తెరచి చూచేసరికి కొండలపైన నడయాడే పొగమబ్బుల్లా వెన్నెల వెలుగులు సందె చీకట్లలోకి వ్యాపిస్తున్నాయి.

వూళ్ళోకి తిరిగి వస్తూ మార్గమధ్యంలో దారి తప్పాడు శేషాద్రి. శేత వెన్నెల్లో పొలాల గట్లు వెంబడి తిరిగితిరిగి ఏవో కొండ గుర్తుల మూలంగా మళ్ళీ దారిలోబడి అత డిల్లు చేరుకునేసరికి రాత్రి తొమ్మిది గంటలైంది. ఆపాటికి మగపెళ్ళివాళ్ళందరూ భోజనాలు ముగించి తమ కోసం ప్రత్యేకించిన విడిదికి వెళ్ళిపోయారు. సాయంత్రం అయిదు గంటలనుంచీ కంటికి కనిపించకుండా పోయిన పెళ్ళికుమారుడి కోసం వూరు వూరంతా గాలించిన ఆడ పెళ్ళివారికి అతడి పునర్దర్శనం లభించగానే ప్రాణాలు లేచి వచ్చాయి. బహుశా ఏదో నిరాదరణ జరిగి ఉంటుందనీ, అందుపైన అలక సాధించడానికని పెళ్ళికుమారు డిలా మాయమై వుంటాడనీ వూహాగానం చేసుకున్న ఆడపెళ్ళివారు, శేషాద్రి కనిపించగానే రెట్టింపు మోతాదులో వినయాలు

కమ్మతెమ్మెర

(34 వ పేజీ తరువాయి)

ప్రదర్శింప సాగారు. ఈ తెచ్చికోలు వినయాల తాకిడికి తట్టుకోలేకపోయాడు శేషాద్రి. ఖాద్య పదార్థా లన్నింటినీ ఆకులోనే వదిలిపెట్టి, తొందర తొందరగా తిన్న శాస్త్రం ముగించి పైకి లేచాడు. అల్లుడికి కోపం వచ్చిందని అవతలివాళ్ళు భావించడానికి అతడు భోజనం చేసిన పద్ధతి గూడా కొంత వరకూ సహకరించింది .

“ఎక్కడ పడుకుంటావు బావా” అన్నాడు బావమరది.

“ఎక్కడైనా సరే. కానీ కొన్ని షరతులున్నాయి. మనుషులు మాటాడుతుంటే నాకు కన్ను మూతపడదు. చీమ చిటుక్కుమంటే మెలకువ వస్తుంది. గాలి బాగా వీస్తూండాలి. నాకు తెలిసినంతలో వసారాలో మంచం వేయిస్తే బాగుంటుంది .... ” అన్నాడు శేషాద్రి.

“అబ్బే, మా వూళ్ళో చలి ఎక్కువ బావా ! నువ్వు నిభాయించుకోలేవు. పైగా .... ”

బావమరిది మాటకు అడ్డుతగిలి “పరవాలేదులేవోయ్ ! నీ కెందుకూ, నేనెలాగో సర్దుకుంటానులే” అన్నాడు చిరాకుగా శేషాద్రి.

రెండు మూడు రాత్రులుగా నిద్రలేని కారణం వల్ల పడుకోగానే నిద్రపట్టవచ్చు ననుకున్నాడు

పత్రికా విలేఖరి—“మీరు ఇంత డబ్బు ఎలా కూడబెట్టగలిగారో చెబుతారా ?”

కోటీశ్వరుడు — “అబ్బో, అదో పెద్దకథ. చాలాసేపు పడుతుంది. అయినా చెబుతాను. ఉండండి” అని “అన్నట్లు ఎందుకు ఈదీపం? ఆర్పేస్తాను. నూనైనా మిగులుతుంది” అంటూ దాన్ని ఆర్పివేశాడు.

ప. విలేఖరి-“అయితే మీరు చెప్పనక్కరలేదు ! నాకు అర్థమైంది” అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

రియాజ్ పాషా, (కాకినాడ).

శేషాద్రి. ఆ ఆశ అడియాసే అయింది. బావమరది మాటను బలపరుస్తూ చలిగాలి జోరుగా వీస్తోంది. అందుకు తోడుగా దోమల సంరంభం కూడా ఉద్ధృతంగా ఉంది. శేషాద్రి దుప్పటి కోసం పడకవైపు తడివి చూచాడు. తలగడను పైకెత్తి చూచాడు. మంచంపైన పరుపు మాత్రం ఉంది. దుప్పటి లేదు.

శేషాద్రి కా క్షణాన నిజంగానే కోపం వచ్చింది.

ముసుగు బిగదన్నుకొని పోతే తనకు నిద్ర పట్టదు. ఈ రాత్రి కిక తనకు నిద్రపట్టే యోగం వ్రాసిపెట్టలేదేమో ! లేకుంటే తనపట్ల మితిమీరిన మరామరిక చూపెడుతున్న ఆడ పెళ్ళివారు దుప్పటి విషయం ఎందుకు విస్మరిస్తారు ?

మడతలు విప్పి అంగవస్త్రాన్ని కప్పుకోడానికి ప్రయత్నించాడు శేషాద్రి. కానీ అది ఆపాదమస్తకానికీ చాలడంలేదు. పాదాలపైకి లాక్కుంటే తల బయట వుండిపోతుంది. తలపైకి తీసుకుంటే పాదాలు బయట ఉండిపోతాయి.

ఇక చేసేదిలేక కాళ్ళను కడుపులోకి తీసుకొని చేతుల్ని రొమ్ముపైన దాచుకుని, మాతృగర్భస్థ శిశువులా మంచంపైన ముడుచుకుపోయాడు శేషాద్రి.

కాలం మెల్లగా దొర్లిపోతూంది.

శేషాద్రికి మాగన్నుగా నిద్ర పట్టింది గూడా!

మగతనిద్రలోనుంచి ఉలికిపడిన వాడిలా ఉన్నట్టుండి మేలుకున్నాడు శేషాద్రి. శరీరంపైన ఏదో మెత్తని వస్తువు మెల్లగా పరుచుకుంటున్నట్టు ఓ స్పృహ కలిగిం దతనికి ! విప్పారిన శేషాద్రి కళ్ళకు అంగవస్త్రపు పొరలోనుంచీ మంచం దాపున ఓ ఆకారం నిల్చుని ఉన్నట్లు లీలగా భాసించింది. ముఖం పైనుంచీ బట్టను తొలగించడానికి అతడి చేతులు కదిలాయో లేదో, ఆ చలనాన్ని పసిగట్టి తన చేతుల్లోని శాలువా అంచుల్ని అలాగే శేషాద్రిపైకి వదిలిపెట్టి, మంచం దాపున నిల్చున్న ఆకారం చీకటిలోకి జారిపోసాగింది. శేషాద్రి తటాలున చేయిసాచి ఆ ఆకృతిని ఒడిసి దగ్గరికి లాక్కోబోయాడు.

కానీ అప్పటికే ఆ నీడలాంటి ఆకారం చేయి దాటి పోయింది. శేషాద్రి చేతికి జడ మాత్రం దొరికింది. ఆ జడ కూడా ఒకటి రెండు క్షణాలు గిలగిలలాడి చేతి వ్రేళ్ళమధ్యనుంచీ జారిపోయింది. జడ పొడుగునా గ్రుచ్చుకున్న చేమంతుల్లో నాలుగు పువ్వులు మాత్రం శేషాద్రికి దక్కాయి.

అరచేతిలో విరిసి నవ్వుతున్న చేమంతుల్ని చూస్తున్నాడు శేషాద్రి. చేమంతులు కావు — ఇవి నవజీవనానందానికి చిహ్నాలు. పవిత్రమైన అనురాగ బంధానికి సాక్ష్యాలు. మనసిచ్చి మనసు పుచ్చుకోగల అర్ధాంగి కోసం వరపడగా, భగవంతుడు తన కిచ్చిన వరాలు !

చేమంతి పువ్వుల కమ్మని తావిలో తన్మయుడౌతూ, వెచ్చని శాలువా కింద ఒళ్ళు విరుచుకున్నాడు శేషాద్రి !

సినిమా

కొత్త చిత్రాలు

వస్తున్నవి

విశ్వరూపా (మాతురు కాపురం) ప్రొడక్షన్స్‌వారు "కులగోత్రాలు" అనే చిత్రం నిర్మిస్తున్నారు. 'పెళ్లికానుక' చిత్రంలో ఆంధ్ర ప్రేక్షకుల అభిమానం సంపాదించిన బి. సరోజాదేవి నాయిక. జగ్గయ్య ముఖ్య నటుడు. దేవిక, కాంతారావు, గుమ్మడి, రమణారెడ్డి, సి. ఎస్. ఆర్., కె. వి. ఎస్. శర్మ మొదలగువారు ప్రముఖ పాత్రలు నిర్వహిస్తున్నారు. దర్శకుడు వి. (సతీతులసి అన్నపూర్ణ) మధుసూదనరావు. సంగీత దర్శకుడు మాస్టర్ వేణు.

యువదర్శకుడు మధుసూదనరావు తీస్తున్న మరో చిత్రం ఎం.ఎం. పిక్చర్స్‌వారి "అతకని బతుకులు". జగ్గయ్య, జమున, రమణమూర్తి, రమణారెడ్డి, కె. వి. యస్. శర్మ, చదలవాడ కుటుంబరావు, హేమలత, రాధిక (మాంగల్య బలం), వై. వి. రాజు, రామకోటి మొదలగువారు నటిస్తున్నారు. రాజసులోచన అతిథిగా పాల్గొంటుంది. రచయిత డి. వి. నరసరాజు. సంగీతం బి. గోపాలం.

పినిశెట్టి నవల 'మమత' ఆధారంగా హైదరాబాద్ (జల్సారాయుడు) మువీస్ వారు అదే పేరుతో చిత్రం నిర్మిస్తున్నారు. సినిమాకు కథ, మాటలూ కూడా పినిశెట్టి వ్రాస్తున్నారు. జమున, జగ్గయ్య నాయికా నాయకులు. దర్శకత్వం సి. ఎస్. (అభిమానం) రావు. సంగీతం వేణు.


బి. వి. ఎస్. (రాణి రత్నప్రభ) ప్రొడక్షన్స్‌వారి కొత్తచిత్రం 'భీష్మ' అగ్రశేణి తారాగణంతో తయారవుతూంది. ఎన్. టి. రామారావు ముఖ్యపాత్ర నిర్వహిస్తున్నారు. (లోగడ వచ్చిన చిత్రంలో ఈ పాత్రను కీ. శే. జంధ్యాల గౌరినాధశాస్త్రి చిరస్మరణీయంగా ధరించారు). అంజలీదేవి, గుమ్మడి రేలంగి, మొదలగు వారు ప్రముఖ భూమికలు నిర్వహిస్తున్నారు. ఎ. నాగేశ్వరరావు అతిధిగా పాల్గొంటున్నారు. రచయితలు తాపీ ధర్మారావు, ఆరుద్ర. సంగీతం రాజేశ్వరరావు. దర్శకత్వం బి. ఎ. సుబ్బారావు. ఇప్పటికి మూడు సెట్లపై పని పూర్తి అయింది.

త్వరలో వస్తున్నవి

డి. బి. ఎన్. వారి తొలిచిత్రం "పెండ్లి పిలుపు" నిర్మాణం పూర్తి కావచ్చింది. రామారావు, దేవిక, కన్నాంబ, గిరిజ, రేలంగి, సి. ఎస్. ఆర్. పాల్గొన్న ఈ చిత్రం ఆమంచర్ల శేషగిరిరావు అనే యువ దర్శకుడిని పరిచయం చేస్తుంది.

భరణీవారి 'బాటసారి' చిత్రానికి పతాక సన్నివేశాలు డిసెంబరు నెలాఖరున అమరావతివద్ద చిత్రించడంలో షూటింగ్ కార్యక్రమం దాదాపు పూర్తి అయిపోయింది. శరచ్చంద్రుడి నవల 'బడదీదీ' ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో భానుమతి, నాగే

(58-వ పేజీ చూడండి)



చేతనావారి గుళ్ళోపెళ్ళిలో కృష్ణకుమారి.



'భక్తజయదేవ' చిత్రంలో అంజలీదేవి

కట్టు తప్పిన పిల్ల

"ఆహా! వెర్రివాళ్ల, ఈ రోజున తెలుగు సినిమా కథ క్లయిమాక్సు కొచ్చేసిందని నా ఘట్టి నమ్మకం" అన్నాడో నిర్మాత—ఆయన మనోనేత్రానికి గోచరించిన తెలుగుసినిమా విశ్వరూపానికి ఒక పెద్ద నమస్కారం పెట్టి రెండురీళ్ళు (ఎడిట్ చేసినవి) పొడుగున నిట్టూరుస్తూ.

ఆయన స్వయంగా తీస్తున్న చిత్రం నిర్మాణం, అందులో కథా కూడా అయినట్టు క్లయిమాక్సు కొచ్చేశాయి. బహుశా అందువల్లనే ఇంత విలవైన ముక్క వచ్చిందేమో ఆయన నోటివెంట.

"ఈనాడు ఫిలిమ్మేకింగు ఖర్చులు లెక్క చూడగా, ఈ వరసన సినిమా తీస్తే పిక్చరు బ్రహ్మాండమైన హిట్టయితే తప్ప పెట్టుబడి గిట్టుబడి కాదని తేలిపోయింది" అన్నాడాయన.

నిజమే. లోగడ ఒక చిత్రం ఏ డెనిమిది వారాలాడితే లాభసాటి అనిపించుకొనేది. నూరురోజులు పండుగ చేసుకుంటే దారుణమైన లాభాలొచ్చేశాయని "గిట్టని" వాళ్ళు చెప్పుకునేవారు. పాతికవారాలాడితే, ఆ తరవాత పది ఫ్లాపులు తీసి పకపక నవ్వొందుకు కూడా వసతిగా ఉండేది. ఈ రోజు కథ తీరు వేరు. నూరురోజులు ఆడితే అంతంత మాత్రం లాభాలలాంటివి గిడుతున్నాయట. నూర్రోజుల పండుగ చేసుకోవడం దండగ నేరం అనిపించేటంత కొద్ది లాభాలుట. పోతే అసలు విషయం—అపాటి నూర్రోజులాటలాడేవి నూటికి పది పన్నెండుకన్న ఉండవు. మిగతావన్నీ విషాదాంత గాథలే. దీనికి కారణాల తోరణాలు సాగదీసిన కొద్దీ సాగుతాయిగాని టూకీగా అందరూ చెప్పేది అనాదిగా వినబడేది—స్టార్ బిల్లింగు బిల్లు. కాస్త పేరుండి నలుగురికీ తెలిసిన మొహాలుగల తారలను నటీనటు



ఫిల్మాలయా వారి 'హమ్ హిందూస్థానీ' లో ఆశా పరేఖ్

యులే మూడులకొౌగాల పై చిలుకుతున్నాయి. వాటినిబట్టి కింది అంతస్తులలో కూడా అంతస్తులు, రేట్లు పెరిగాయి. (పెరగనివల్లా ఒక్క కవిగారికి ఇస్తామనేవీ, ఇచ్చేవీనుట) ఆలస్యాలు పెరిగాయి. ఫిలిం కట్-కటలు పెరిగాయి. డబ్బు వడ్డీలు పెరిగాయి. కాపీలు పెరిగాయి. కాపి-'రైట్లు' (కాపీ యూ బర్త్‌రైట్) పెరిగాయి. పెరిగి పట్టపగ్గాల్లేకుండా విజృంభిస్తున్నాయి.

"కట్టుతప్పిన పిల్లలా ఉంది తెలుగుసినీమా వగస" అన్నాడు పరిశ్రమకు పితృపాగుడన దగ్గ ఒక సినీ మనీషి విచారంగా.

'కుటుంబ నియంత్రణం"

ఇన్ని పెరిగినా, వీనితోపాటు నమకాలేదు. సినిమా తీసే జనానికి తగ్గ నిష్పత్తిలో చూసే జనం పెరగలేదు.

"కావున దేశంలో కుటుంబనియంత్రణం అర్జెంటుగా తీసేయాలి" అన్నాడు అఖండ కళాఖండ పరంపరలో పాల్గొని అలసిపోయిన ఒకాయన. జనభా పెరక్కపోవడమే తన చిత్రాలు దెబ్బతినడానికి కారణమని ఆయన అనుమానం.

"అంతకన్న చిత్రకుటుంబనియంత్రణం పెడితే మెరుగ్గాదూ?" అన్నాడో నరసింహారావుగారు.

నిజమే. ప్రేక్షకులకు ఇన్ని చిత్రాలను పోషించడం ఇబ్బందే—ఒక ఎగ్జిబిటర్ అన్నట్టు అందువల్ల స్తోమతుకు తగ్గట్టుగా చిత్రాల సంఖ్యను పరిమితం చేసుకోవాలని అర్జెంటు పనులేమీ లేనివారు దీని గురించి గంటల కొద్దీ కాఫీలూ, సిగరెట్లూ తాగుతూ చర్చించుకోవచ్చు.

ఫ్రాంకెన్‌స్టీన్ భూతం

డా॥ ఫ్రాంకిన్‌స్టీన్ సదుద్దేశంతో చేతులాగా తయారుచేసిన రాక్షసప్రవృత్తిలాటిది స్టార్ సిస్టం" అని సినిమా ఫ్రాంకిన్‌స్టీన్‌లు వన్స్‌మోర్ అనకపోయినా చెబుతూనే ఉంటారు. భూతం అంటూ వచ్చాక దాన్ని స్వచ్ఛందంగా అల్లరి క్రౌర్యం తగ్గించుకోమనిందని సలహా చెప్పడం, బకాసురుడితో ఏకచక్రపురవాసులు ఒప్పందం చేసుకున్నట్టు పాలుకో నిర్మాతతో సర్దుకోమని బతిమాలడం వృధాయాసం. తిట్టుకుంటూ

ఆ భూతానికి పట్టుబడ్డ మేటినటులు కూడా ఇపుడు ఆ తారస్థాయినించి దిగి రావాలన్నా రాలేరు. ఒకరు హఠాత్తుగా పదివేలు చాలు అంటే మిగతా వారు అలా అంటారని నమ్మకం లేదు. పైగా తగ్గించుకున్న వాళ్లు అలుసై పోవచ్చునన్న భయం.

నీతివాక్యాలూ, సలహాలూ, సిద్ధాంతాలూ వినున్నా, అనుకున్నా, మానవ సమాజమైన దౌర్బల్యాన్ని ధైర్యంగా అంగీకరించదలిస్తే ఈ సమస్య నిజరూపం బోధపడుతుంది. అపుడు తారాబలంనమ్ముకుని గంగలో దిగడం కన్న, మంచికథ, కమామిషూ అనే తెప్ప పట్టుకుని ఈదడం క్షేమకరం అని విశదం అవుతుంది.

కాని సరిగ్గా ఇదే లేదు.

"మనం నలుగురు స్టార్లని వేసుకు పిక్చరు తీసి పారేదాం, వాళ్ళకి డబ్బు గుమ్మరించేది డిస్ట్రిబ్యూటరుగదా మన సొమ్మేం పోయె" అన్నట్టుగా, పెట్టుబడి పట్టుకునిలబడని నిర్మాతలు వ్యవహరిస్తున్నారు. అందువల్లనే శాశ్వతి లేకుండా, అడగనివాడిది పాపం

కట్టుతప్పిన పిల్ల

అన్నట్టుగా అడిగినంత రేటూ ఇచ్చేసి సంతకాలు పెట్టించేసుకుంటున్నారు ఒప్పందాలపై.

అందికే ఒక స్టార్ (ఆడా? మగా?) ఇటీవల (మద్రాసా? బొంబాయా?) లక్ష రూపాయల జోక్ చెప్పడం జరిగింది.

ఒక నిర్మాత ఆ స్టార్‌ని తన పిక్చరులో వేషం కట్టమన్నాడు.

స్టారుకి తీరిక లేదుట. ఆ సంగతి చెప్పి "అయినా నా రేటు పెంచానండీ" అనడం జరిగింది.

"ఎంత?"

"పాతిక వేలు హెచ్చించాను."

"ఓస్ ఇంతేనా! నేను 30 ఎక్కువిద్దామనుకున్నాను" అన్నాడు నిర్మాత.

షూటింగుకు వెళ్లడానికి మేకప్ వేసుకుని ఎర్రటి రూజ్ పూసుకున్నా, స్టార్ మొహం తెల్లబోయింది.

"మంచిది ... అలాగే ... తప్పకుండా." అన్న మాటలు ఆత్రేయ డైలాగుల్లా భారంగా వెలువడ్డాయి.

నిర్మాత ఉత్సాహంగా ఇవతలికి వచ్చాడు.

"కట్టుతప్పిన పిల్లలా ఉంది తెలుగు సినిమా వరస" అంటున్నారెవరో!

మిగతావారంతా ముక్కున వేలేసుకుని నిర్ఘాంతపోయి చూస్తున్నారు. అందులో ఇందాకటి పెద్దమనిషి ముందు వరసలో ఉన్నాడు.

"హరా!" అంటున్నాడు. ★



ఆర్. ఆర్. పిక్చర్స్‌వారి "ఇంటికి దీపం ఇల్లాలే"

కొత్త చిత్రాలు

(55-వ పేజీ తరువాయి)

శ్వరరావు ముఖ్యపాత్రలు నిర్వహించారు. దర్శకుడు రామకృష్ణ. రచయిత సముద్రాల సంగీతం వేణు.

శాంతికళా ఫిలింస్ వారి తొలిచిత్రం 'శాంతి' కూడా చాలావరకూ పూర్తి అయింది. రామారావు, అంజలీదేవి, రేలంగి, గుమ్మడి కృష్ణకుమారి, గిరిజ, చలం, సూర్యకాంతం, సురభి బాలసరస్వతి మొదలగు వారంతా నటిస్తున్నారు. రచయిత సముద్రాల జూనియర్. సంగీతదర్శకుడు రమేష్‌నాయుడు. దర్శకుడు మానాపురం అప్పారావు.

చేతనావారి 'గుళ్లో పెళ్ళి' ఫిబ్రవరి 7న విడుదల అని తెలిసింది. కె. ఎస్. ప్రకాశరావు దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో బాలయ్య కృష్ణకుమారి, రమణమూర్తి, కొత్త నటి పార్వతి నటించారు. రచయిత అనిసెట్టి సంగీతం రమేష్‌నాయుడు.

విజయావారి భారీజానపదం "జగదేక వీరుడు" నిర్మాణం నిర్ణీత కార్యక్రమం ప్రకారం చకచక జరిగి పోతూంది. మార్చి నెలాఖరుకు పూర్తి అవుతుంది. కె. వి రెడ్డి దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రానికి రచయిత పింగళి నాగేంద్రరావు. రామారావు, బి. సరోజాదేవి, రేలంగి మొదలగు వారు పాల్గొంటున్నారు.

కృష్ణచిత్రవారి తొలిచిత్రం 'బావమరదళ్ళు' త్వరలోనే విడుదల కాగలదని తెలుస్తూంది. రమణమూర్తి, కృష్ణకుమారి, మాలిని నటించిన ఈ చిత్రానికి దర్శకుడు పద్మనాభరావు.

శ్రీకాంత్ ప్రొడక్షన్స్‌వారి పౌరాణికం 'సతీసులోచన' నిర్మాణం పూర్తి అయింది. అంజలీదేవి, రామారావు, రంగారావు, కాంతారావు, రమణాచలం, మిక్కిలినేని, రమణారెడ్డి, రాజనాల, రామకృష్ణ, రాజశ్రీ సంధ్య పాల్గొన్నారు. రచయిత సముద్రాల, సంగీతం టి. వి. రాజు. దర్శకుడు ఎస్. రజనీకాంత్. ★



కె. పి. ఆర్ట్స్ వారి "తన్నకొడుకు" లో అజ్ఞాతవాసంలో ఉన్న జగ్గయ్య, దేవిక. - ప్రేమికుల జంట.

గిరీశం లెక్చర్లు

బంపర్ క్రాప్ - లేక అగ్నిహోత్రావధాన్లు ప్రతాపం

చూశారా! చూశారా! చూశారా బుచ్చమ్మ వదినా! ఇవన్నీ ఈ పేపర్లన్నీ చూశారా? ఏంగనిపించింది? వాండ్రు యూ సీ? విడోస్ విడోస్ విడోస్. ఈ సీజను సీజనంతా అదే పెట్టె, బంపర్ క్రాప్! మైగాడ్! ఒక గిరీశానికే సింపతీ అనుకున్నారు గదూ ఇన్నాళ్లూ? నేను చెబితే నమ్మేరూ? అపోఫోస్ ఈ గిరీశంగారు ఏవో కల్లబొల్లి కబుర్లు చెబుతారే తప్ప ఇవన్నీ నిజాలా యేవిటీ విద్దూరంగా పోతే అనుకున్నారు. అంతేనా. ఇపుడైనా నమ్మండి. ప్లీజ్ బిలీవ్ మీ. నాకళ్లల్లా కపటం తెలీదు. మా నాయనమ్మ ముప్పొద్దులా మొత్తుకునేదదేగదా. హామ్మో నేనేం చేతునమ్మా ఈ గిరడీకళ్లల్లా కపటంబోతిగా తెలిస్తొచ్చాయిగదేం దారమ్మా. వీడెలా బతికి బట్టకడతాడమ్మా అంటూని.

మై డియర్ సిష్టర్స్! బిలీవ్ మీ. నాకే గనక మాయదారి కబుర్లు, కపటబుద్ధులూ పట్టుపడుంటే ఈ పాటికి మిమ్మల్నందర్నీ పళ్ళంగా ఎగరేసుకుపోయి ఏ అయిఫిల్ టవర్ మీదనో కూర్చుని పలుకుతూ మిమ్మల్నానందపరుస్తూ ఉండేవాణ్ణి. ఏం దారి మరి. మంచి గురించి మంచిగా చెబితే విన్నంతే మాయజేసయినా దార్లో పెట్టవోయ్ అన్నారు పరబ్రహ్మ శాస్త్రులవారు. నాకిన్నాళ్లూ తెలీక అజ్ఞానం కొద్దీ ముద్దుగా చెబుతూ వచ్చాను. పోన్లెండి. ఈ పాటికైనా

తెలిసింది గద. లోకవంశే ఈ అగ్రగారవే కొదనీ, ప్రపంచకవంతా మన కొంప పెరడుతతలేదప్పు ఇవతల్లేదనీ ఇప్పటికైనా తెలిసింది గదా. ఒక్క మీనాయనగారే తప్ప మిగతా యావన్మంది ప్రజలున్నూ కోడై కూస్తున్నారు విడో మారియేజెస్ జరగాలోయ్ అని. లేకపోతే, ఇంతమంది ప్రొడ్యూసర్లు ఒక్కసారిగా ఈ యొక్క 'విడో' అను రెండక్షరాలమీద, ఈ సబ్జెక్టుమీద యిన్ని చిత్రాలు—అదిన్నీ లక్షలు గుమ్మరించి తీస్తారా! తీస్తారా మీరే చెప్పండి?

వీళ్లంతా ప్లయిట్ అఫ్ ది విడోస్ అనగా మీ యొక్క స్థితి గురించి యంత దుఃఖం కలగకపోతే ఇంతకలిసి కట్టుగా ముక్తకంఠంతో దుఃఖపడి మరీ పిక్చర్లుతీశారో మీరే చెప్పండి. అక్కడితో ఆగారా. పిక్చర్లు తీసిన్నీ వాపోతున్నారింకా.

చక్కవో నే చెప్పినట్టువిని, మీరం డోదినా అనగానే సరేనని నాతో బయల్దేరి మద్రాసొచ్చేస్తే ఈ పాటికి మీ మీద నేరెండు పిక్చర్లు లాగిపారేదును గదా.

వదినా మీరు చరచరవంటింట్లోకెళ్లిపోండి - కొంప మునిగింది. నాన్నగారొచ్చేస్తున్నారు...

ఆయా చిన్న వాణ్ణయినా తమకు వయ్యోల్లోయ్యేవక తప్పదు. మీనాశే అనుకుంటున్నాం అమ్మాయీ నేనూను. మాటలో దయచేశారు. సాక్షాత్తు అగ్నిహోత్రులే తమరు. ఆయొక్క ముఖవర్చస్సలాంటిది గదా. విశేషమేమిటంటే అటుపవిత్రత మీ బిడ్డలకూడా అబ్బుతం. అమ్మాయి ఇప్పుడేమంటో చిన్నాగూ? అయ్యా గిరీశం గారూ నలమహారాజు కథలో దమయంతికి రెండో పెళ్లి ప్రకటన చాటింపేయించారుగదా-మరి అది అజ్ఞాతంలో ఉన్న భర్తను రప్పించుకుందికే అయినప్పటికిన్నీ-అట్టే ఊహాపోవడమే మహాపాపం గాదుటండీ. పరిహాసానికయినా అలా అనరాదు గదా అంటారేమో, ఓహో అగ్నిహోత్రావధాన్లుగారింట పుట్టినపడు మరి నీగ్గాపోతే మారెవరికింత గొప్ప ఊహలు కలుగుతాయమ్మా అని ఇందాకట్నించొక్కలాగ ఉబ్బిపోతున్నాను. ఇదిగో మద్రాసు నించి డబ్బు రెడీ అని కబురాగానే ఈ విషయమ్మీదనే ఒక బైస్కోపు ఆరంభం చేస్తాను. తమరు తప్పక దైచేసి ఆశీర్వదించాలి.

వింటున్నారూ. ఇలాంటి ఊహల్ని బస్తీలో వింటూలా అంటారా? ఫం పేశారు. ఇంకా వయం. తమవంటి పెద్దలు ఈ దేశంలో ఓ మూల ఉండంగా అంటి పోగరు ఎలా సాగుతుందండీ. ఆ నుడ్డు నేనో పికిలి విషాలు వేశారుగాని ఇబ్బ తేల మళ్లీ దాగి కొచ్చేశాగ్లండి. ఇప్పుడు తీస్తున్న బైస్కోపులన్నీ

గిరీశం లెక్చర్

సాక్షాత్తు మీ నోట్లోంచి ఊడిపడ్డవే అంటే నమ్మండి. వెర్రివది ముఖప్రీతిమాటల చేతనై చావ్వగాని ఈ పాటికి తెగపొగిడి పారేశేవాణ్ణి మిమ్మల్ని.

రైటే రైటే. మళ్ళి పెళ్లంటి పిక్చరొచ్చిన మాటరైటే. అప్పుడేదో కూశారు. విడోకి మళ్లీ పెళ్ళి అవసరం అని. ఇప్పుడదేం లేదులెండి. చెంపలేసుకున్నారు. పవిత్రతగ్రటా థీమ్సులో కొచ్చేశాయి. ఇపుడు పిక్చరులో విడోకి మొగుడు పోగానే హాయ్యోనా కూతరా యంతపన్జరిగిందే అంటారు ఒక నేపథ్యపాటపాడి. ఆపైన పోయిన వాడితో నువ్వుపోక తప్పదు అనేంత వరకూ వచ్చేవారేమోగాని సహగమనమ్మీద సర్కారువాళ్ళ రూలోటి అహోరించింది చూడండి. అంచేత అంతమాట అనలేకపోయినా, "ఏం చేస్తాం. ఎలాగో బతుకు వెళమార్చుకో" అని ఓదారుస్తూ పిక్చర్లు దీస్తున్నారనమాట. రెండో పెళ్లంటే, మనం-అనగా జనం-మండిపడతామని వాళ్ల కెంత భయం అనుకున్నారూ. అంచేత అంతమాట భస్తేఅన్ను. ప్రేమంటారా? దానికి సోదరి ప్రేమ ఉండనే ఉంది. అచ్చాలు- కాసేపు అపోహల్లుకుందికి. ఈ లోగా గడియారం ఆరూ కొట్టేస్తూంది. ఎవళ్ళకి వాళ్లు పోవచ్చు.

చిత్రం-అంతేనండి. మీమీ దొట్టు. అక్షరాలా ఇంతకన్నా ఏం చెప్పటం లేదు. ప్రేమలూ గీమలూజాంతానై. సెకండు మారేజి సెంటిమెంటుకి ఎగినెస్టయిపోయాక ఆ మాటెత్తడాని కెవడికి దమ్ములుంటాయండీ! అదే చెబుతున్నాను. తేవరిలా దేశంలో ఓ మారుమూల ముక్కు మూసుకు జపం చేసుకుంటూన్నా తమ ప్రభావం అక్కడ చెన్నపట్నంలో కథల నిండా అలుముకుని ఉంది.

ఉప్పూ కారం తింటూన్న మనుషులయినప్పుడు, వయసులో ఉన్న మొగాడూ ఆడదీ (విడోలనుకోండి) పవిత్రతంటూ పడే వేంవిటి నాశారథవని ఒహ దుష్టుడు దూకుడుగా అనేశాడుగాని, వంటనే సలుగురూ వాడి గట్టెట్టారు-అందికేనోయ్ పెద్దలు విడోస్కి చప్పిడి పిండి తిండిగా నిర్ణయించారూ అని. పిండి గిట్టకపోతే ఇంగిలీషు వాడి బిస్కత్తులు తిని యోడవచ్చుగా అనిన్నీ అన్నారు. దెబ్బకి డంగైపోయాల్లెండా దుష్టుడు.

అయ్యా అదీ సంగతి. అంచేత మనం ఇంతకుముందనుకున్నట్టుగా, ఈ సబ్జెట్టు మీద ఓ పిక్చరు లాగిపారేదాం. మీకూ ఇందున ఒక శ్రద్ధా ప్రపత్తి ఉన్నాయి గాబట్టి మీయందు నాకున్న గురినిభక్తి మిమ్మల్నిగూడా ఇందులో ఓ పావలా వాటా తీసుకోనిస్తాను. అంతకన్న ఎక్కువ ఇవ్వడానికి వీల్లేదండి. అవతల మూడులక్షలు రెడ అయిపోయాయి. చాల్లెస్తురూ. ఈ పావలా వాటాకే, మీకు దాదాపు యాభై వేల రూకలు దోసిటపడతాయి. ఐగుగు రాండపిల్లల్నమ్ముకున్నా ఇంతరాదు. యామంటారు. చిత్తం అలాగే ఆలోచించండి సావధానంగా. మాశారూ ఈలోగా ఈ యొక్క కథాగ్రటా ముందర ముసాయిదా రాసుకుంది క్లైమాక్సో లూగ్రటాకో నాలి మీ రొండిరోన్న దాంట్లోంచి ఒక్కహస్తం ఇటు పారేస్తిం పని ఆరంభిస్తాను. యెనిటో సెంటిమెంటోహం జేడిసింది. ఓం ప్రథమంగా శ్రీకారం చుట్టడానికయ్యే డబ్బు పవిత్రమైన మీ హస్తాల్లోంచి వస్తేనే రేపు లక్షలు కురుస్తాయని.

వ్యాండర్ ఫుల్ థాంక్యూ...

వాట్ మై డియర్ వెంకటేశం! నువ్వింత సేపూ ఆ భోషాణం వెనకే ఉన్నావా. ఏవిటి గుమ్మ గారిమీదే స్పయింగు చేస్తున్నావా? డామిట్! గ్రాడ్ ఒనాలిటియ్యాకా కాపోతే మరేవిటి చెప్పు. యెప్పుడే నిన్న చౌదరీగారికి చెప్పిన స్టోరి అంతా మార్చేశానంటావా. అవును మరి మార్చకుండా. ఆకథ ఫాదరిల్లాకి చెబితే సొమ్మా లెక్కదీసి తంతె డు పైగా కేసరూపీసు ఇచ్చేవాడా!... నాన్సెన్స్. మనకి ఒపినియన్సేవిట్రోయ్. పీపుల్స్ ట్రెండ్ అని మనకి తోచిందాన్ని బట్టి పోతాం. బిజినెస్ లో, ముఖ్యంగా ఫిలింబిజినెస్ లో ఉన్నవాడు పొలిటీషియన్లా, పారిస్ పడతిలా, గ్లాసులో నీరులా ఉండాలి. సమయాన్ని బట్టి శాల్టిజో ఫిరాయించాలి. అభిప్రాయాలేవిటి నాన్సెన్స్. అవి చాలా డేంజరస్ సరుకులు. చూస్తావుండగా అవే మూఢ నమ్మకాల యూరుకుంటాయి.

వాట్! ఇందులో షేరా! వెంకటేశం! అయామ్ అషేమ్డ్ ఆఫ్ యూ. దిస్ ఈజ్ గ్రాస్ ట్రూయలీ. ఈకంఠశోషలిజపు కాలంలోను నువ్విలా వాదించకుండా 'కనీసం డబాయించకుండా' చేతిలో డబ్బులాగేసుకొని వాటా తీసుకోవడం ఏం బాగు లేదు. చూస్తూ వుండు నా నెక్స్ట్ పిక్చర్లో నీకు పదొంది వేల అమాకులో ఒకవిడోతో రొమాన్సు పెట్టించి, చివర్ని అంఘాసిషరీ అఫెక్షన్ ఓఫ్ఫ్-అనగా సోదరీ ప్రేమకోవోయ్ శివలాయ్ అని తేల్చి అవతల పారేస్తాను. ఏడుస్తూ హాగైజన్ లోకి పోతావు. అంతే. ★

నర్మద ఇంటివేపు బయలుదేరాడు. సిగరెట్ కాలుస్తూ, సిమెంటురోడ్డుమీద పార్కుపక్కగా వెళ్తూంటే ఉత్సాహంగా ఉంది. హాయిగా, చల్లగా గాలి వీస్తోంది. అలా ఓ మైలుదూరం నడిచి నర్మద ఇంటిని సమీపించాడు.

వసారాలో బట్టలు ఆరవేస్తూ నుంచున్న నర్మద కనిపించింది. సారథిని చూసింది. ఆమె మొహం విప్పారింది. జారిపోతున్న పమిట సర్దుకుని సారథిని ఆహ్వానిస్తూ లోపలకు దారి తీసింది.

నర్మద ననుసరించాడు సారథి. అందమయిన ఆమె భుజాలు, వీపూ, సన్నని నడుమూ ఆకర్షవంతంగా కనిపించాయ్ సారథి కళ్ళకు. ఈ ఊహకు చకితుడయ్యాడు. తన మనస్సులో ఎన్ని ఊహలున్నై ఏ. ఇవన్నీ నర్మదకు తెలిస్తే ?

కుర్చీ చూపించింది నర్మద. ఆసీనుడయ్యాడు సారథి. లోపలకెళ్ళి కప్పులో కాఫీ తీసుకువచ్చింది. కాఫీ కప్పు అందుకునేటప్పుడు ఆమె సన్నని, నాజూకయిన వ్రేళ్ళు తగిలాయ్. అతని మనస్సుదోలా అయింది. ఏదో పనుండి లోపలి కెళ్ళింది నర్మద.

చుట్టూ చూశాడు, సారథి. గది నిరాడంబరంగా ఉంది. గదిగోడలకు నాలుగైదు ఫోటోలు తగిలించబడి ఉన్నయ్. దగ్గరే ఓ టేబుల్, దానికి కాస్త పైగా హోషెల్ఫు. బల్లమీద, షెల్ఫులో ఎన్నో పుస్తకాలున్నై ఏ. ఇవన్నీ నర్మద చదువుతుందా ? బల్లమీద రెండు, మూడు ఇంగ్లీషు నవలలు పడివున్నై ఏ. పరిశీలనగా చూశాడు. ప్రయిడ్ అండ్ ప్రిజుడీస్, నానా మొదలైన పుస్తకాలు, అప్పుడుకాని సారథికి తోచలేదు. నర్మదతోబాటు ఇంకా ఎవరైనా ఉంటున్నారా ? తెలుసుకోవాలన్న కుతూహలం ఎక్కువయింది.

సారథి కూచున్న గదిలోకి వచ్చింది నర్మద. దూరంగా ఓ కుర్చీలో కూచుంది. నర్మదకేసి చూశాడు. ఆమె తనవేపు చూస్తోంది. ఇద్దరికళ్ళూ కలుసుకున్నయ్. మెరపు మెరసినట్లయింది. సర్దుకున్నాడు సారథి.

"మీరొక్కరే ఉంటున్నారా" అడిగాడు సారథి.

"లేదండీ. మరో అమ్మాయి ఉంటోంది. కాలేజీలో బి. యే. చదువుతోంది. ఆ పుస్తకాలన్నీ ఆ అమ్మాయివే" అంది బల్లమీది పుస్తకాలవైపు చూపించి. "నానా" అన్న పుస్తకంమీది ముఖచిత్రం సారథిని వెక్కిరించింది. చిరుగాలికి టపటపా కొట్టుకున్నయ్ పుస్తకంలోని పేజీలు.

కాసేపు నిశ్శబ్దం తాండవించింది.

"మిమ్మల్ని ఈఊళ్ళో ఓసారి చూశానని రమకు ఉత్తరం రాశాను" అన్నాడు సారథి.

ఆమెమొహంలో ఆశ్చర్యం గోచరించింది.

"చిత్రం. చూశారా, నేనూ అలాగే రాశాను. రెండు ఉత్తరాలూ రమకు చేరిఉంటై" అంది.

సారథి గతుక్కుమన్నాడు. రమ ఏమని ఊహించి ఉంటుందోనని ఆలోచించసాగాడు.

అతని మనస్సులోని ఆలోచనల్ని గుర్తించిన దానికి మల్లే "మళ్ళీ చిన్నతనంలోని రోజులూ, హైస్కూల్లో రమతోబాటు చదివిన రోజులూ జ్ఞాపకానికి వస్తున్నయ్" అంది.

జీవితగీతం

(10వ పేజీ తరువాయి)

సారథి నవ్వాడు. మునుపు నర్మదతో మాట్లాడడానికి బిడియపడ్డ సారథిహృదయంలోని సిగ్గూ, భయం తొలగిపోయ్యాయ్. మామూలుగా, సహజంగా నర్మదతో సంభాషణ కొనసాగించగలుగుతున్నాడు.

"నాకు బాగా జ్ఞాపకం. ఓసారి నేను నా గదిలోకి వచ్చేసరికి మీరూ, రమా మాఇంట్లో నా పుస్తకాల బీరువాదగ్గరనుంచుని పుస్తకాలు చూస్తున్నారు. నన్ను చూసి తడబడి పుస్తకం కిందపడేశారు. రమ బిగ్గరగా నవ్వింది" అన్నాడు సారథి. పూర్వం ఎప్పుడో జరిగినవిషయాలు జ్ఞాపకం చేసుకుంటూ.

నర్మద పకపకా నవ్వింది. వెన్నెల కాసినట్లు, విద్యుద్దీపాలు వెలిగినట్లు, పాలరాతి కొండల్లో గలగల శబ్దంచేస్తూ, నర్మదానది ప్రవహిస్తున్నట్లు నర్మద నవ్వింది.

ప్రసంగవశాత్తూ ఒకరు మరొకరితో "చేతులు కాలాక ఆకులుపట్టుకొని ఏమి ప్రయోజనం?" అన్నాడు.

అతడు పరధ్యానంగా "సెల్లు ముట్టుకుంటే బొబ్బలు ఎక్కుతాయి కనుక" అన్నాడు.

—ఎం. వెంకటశాస్త్రి (వసంతవాడ)

నవ్వినప్పుడు నర్మద మొహంలో ప్రజ్వరిల్లిన కాంతి పుంజాన్నీ, నైర్మల్యాన్నీ, స్వచ్ఛతనూ, అమాయకత్వపు వెలుగును చూసి, అనుభవించి, నిర్ఘాంతపోయాడు సారథి.

ఇలాంటి నిర్మలమూర్తి నర్మదమీద విష్ణుమూర్తిలాంటి వాళ్ళు ఎలాంటి నిందలు మోపుతున్నారు ? తలుచుకుని కుమిలాడు సారథి.

ఇవన్నీ కొన్ని క్షణాలలో సారథి హృదయసాగరంలో ఉవ్వెత్తుగా లేచిన భావ తరంగాలు.

"అవును. నాకు బాగా జ్ఞాపకం ఉంది. మీ రచనల షెల్ఫులకోసం వెతుకుతున్నాము రమా, నేనూ" అని ఊరుకుంది నర్మద.

జీవితంలో హాయి, ఆనందం, ఆహ్లాదం ఏదైనా ఉంటే అదిప్పుడనుభవించ సాగాడు సారథి. ఆరోజంతా నర్మదతో మాట్లాడుతూ కూచుంటే?

నిర్లిప్తంగా, నిరుత్సాహంగా లేచాడు సారథి వెళ్ళడానికి.

నర్మద లేచి నుంచుని "మరో విషయం చెప్పాలి. మరిచిపోయాను. రేపు సేవాసమాజంవాళ్ళు గురజాడ వర్ధంతి సందర్భంలో నాటకం వేస్తున్నారు. మీరు, రాకూడదూ ? సుందరశివరావు దర్శకత్వం వహిస్తున్నారు" అంది నర్మద.

ఇదేమిటి ? ఇదేదో ఉప్పెనలా ముంచుకొస్తోంది. ఈ పరిచయం మరింత ధృడతరం కావాలని వాంచిస్తోందా నర్మద ? సుందరశివరావెవరు ? లక్ష ప్రశ్నలుదయించినై. కాని ఆక్షణంలో కారు మేఘాలకు మల్లే విష్ణుమూర్తి నాటిన అనుమానం సారథి హృదయాకాశాన్నలుముకుంది. సర్దుకున్నాడు సారథి. నర్మద కళ్ళల్లోకి చూశాడు. ఆమె కళ్ళల్లో అమాయకత్వపు నిర్మలకాంతులు ఉజ్వలంగా ప్రకాశించాయ్.

"వీలయితే వస్తాను తప్పకుండా" అన్నాడు సారథి తడబడుతూ, ఏమీ తోచక.

"అలాకాదు. మీరు వచ్చితీరాలి. మరో కోరిక. మీరోపాట రాసుకురావాలి. నేను పాడతాను. నేను నాటకంలో పాల్గొనడంలేదు. రంగానికి, రంగానికీ మధ్య విరామ కాలంలో పాటలు పాడటమే నా పని" అంది నర్మద. ఒక్కబిగిని ఉపన్యాస ధోరణిలో చెప్పింది. సారథిని మధ్యలో మాట్లాడనివ్వలేదు.

సారథి కదలబోయాడు.

"నాటకం క్రౌను హాల్లో. సరాసరి గ్రీను రూములోకి వచ్చేయండి. అక్కడ మీకోసం వెయిట్ చేస్తుంటాను" అంటూ సారథితోబాటు వసారాదాటి బయటికి వచ్చింది నర్మద.

సెలవుతీసుకుని రూముకేసి వెళ్ళాడు సారథి.

అతని హృదయం పిల్ల తెమ్మెరకు కదిలే అలలతో ప్రవహించే సెలయేరయింది. చిరుగాలికి అటూ, ఇటూ ఊగే పూలమొక్క అయింది. ఇంద్రధనుస్సు అలంకరించిన ఆకాశం అయింది.

సారథి ఇంతవరకూ నర్మదస్నేహాన్నే వాంఛించాడు. స్నేహాన్ని మించిన దివ్యసాన్నిహిత్యం ఏదో బలవత్తరంగా పరిణమించి తనను ఆమె వేపు లాగుతోంది. కానీ లోక దృష్టి అతన్ని వెనక్కు లాగింది. నర్మదతో తా నిలా స్నేహంగా ఉండటం విష్ణుమూర్తిలాంటి నిందారోపకచక్రవర్తులకు అభాండాలు వెయ్యటానికి వీలు కలుగ చేస్తోంది. లోకంలో ఒంటరిగా జీవిస్తున్న నర్మదలాంటి అమ్మాయిల జీవితప్రవాహం సాఫీగా ప్రవహించదు. ఒడిదుడుకులతో కూడుకొని ఉంటుంది. అప్పుడు జ్ఞాపకానికి వచ్చింది. నర్మద తనను ఓపాట రాయమని కోరింది. సారథి హృదయం ఆవేశపూరితం అయింది.

ఓ గులాబీపువ్వుంది. మామూలు గులాబీకి మల్లే, దీనికి ముళ్ళులేవు. లోకుల క్రూరదృష్టి నుండి తనను కాపాడుకోవటం కష్టమయింది. దైవంమీద భారం వేసింది. సౌశీల్యం అనే కాంతిపుంజాన్ని తన చుట్టూ నిర్మించుకుంది. ఆ కాంతిపుంజానికి భయపడి లోకులు దూరంగా పోయారు. అదే అర్థం స్ఫురించేలా ఓ పాట రాశాడు.

అతని హృదయంలో ప్రబద్ధమైన అగ్నిపర్వతం శాంతించింది. ఉన్నత పర్వతశిఖరంనుండి మహా

వేగంతో ప్రవహిస్తున్న నది మైదానప్రాంతంలో వహించిన ప్రశాంతత్వానికి మళ్లే అతని హృదయం ప్రశాంతపూరితం అయింది.

సారథి విచిత్రమయిన నిర్ణయానికి వచ్చాడు. తను నాటకానికి వెళ్ళడు. నర్మదను మళ్ళీ చూడడు. ఆమె ప్రశాంత జీవితంలోకి ఒక మహా ఉధృతతరంగానికిమల్లే ప్రవేశించడు.

మర్నాడు ఉదయం ఆ పాటను పోస్టు చేశాడు నర్మద విలాసానికి.

* * *

పదిహేను రోజులు గడిచాయ్.

జీవితగీతం

అతి కష్టంమీద సారథి తన్ను తాను సంబాళించుకున్నాడు. నర్మద సుతిమెత్తని చిత్తాన్ని నొప్పించాడు. ఆమె హృదయాన్ని గాయపరిచాడు.

మరోవిధంగా ఆలోచిస్తే తను చేసినపని మంచిదే అనిపించింది.

ఆఫీసు పనిలో నిమగ్నుడయ్యాడు. నిరంతరావేశం ఏదో అతన్ని కదిలించసాగింది. ఆ వేడిలో రెండు, మూడు కథలు రాశాడు. ఆవేశం కొంత తగ్గినట్లు తోచింది. మళ్ళీ మామూలుగా ప్రశాంతమయిన సాయంత్రాలు పార్కులో గడుపసాగాడు.

ఓరోజు ఉదయం సారథికి ఉత్తరం వచ్చింది. నర్మద రాసింది. అతని గుండె వేగంగా కొట్టుకో సాగింది. చదివాడు.

"మీ పాట పోస్టు ద్వారా అందింది. నా మనస్సదోలా అయింది. మీరు నాటకానికి రారని అర్థమయింది. నేనేం నేరం చేశానని ? పోనివ్వండి. మీ పాట నా జీవితపథాన్ని మార్చివేసింది. ఎంత గొప్పపాట రాశారు.

నేనా రోజు నాటకానికి వెళ్ళలేదు. ఇక జీవితంలో అలాంటి కార్యకలాపాలలో పాల్గొననేమో.

మరో సంగతి. రెండు రోజులక్రితం స్కూలుకు వెళ్తూ, కారుకిందపడ్డాను. ప్రమాదం తప్పింది. కొన్ని చిన్నగాయాలతో బయటపడ్డాను. హాస్పిటలులో ఉన్నాను. మీ పాదాలకు సమస్కృతులు"

చకితుడయ్యాడు సారథి. తన పాదాలకు సమస్కారాలెందుకు ?

సారథి బాధపడ్డాడు. ఆమె తననుంచి మాలిన్యం లేని మహత్తరస్నేహాన్ని కోరింది. తను ఆమె మనస్సును నొప్పించాడు. ఆమెను చూడాలి.

ఆ మధ్యాహ్నంహోటల్లో భోజనంసహించలేదు. సాయంత్రం హాస్పిటల్‌వేపు వెళ్ళాడు. కాంపౌండులోకి అడుగు పెట్టాడు.

హాస్పిటలు తెల్లటిగోడలు సాయంత్రం నీరెండకు మెరుస్తున్నయ్. పక్కనేవున్న పొలాలమీది నుంచి నిర్మలమైన గాలులు వీస్తున్నయ్. ఆకాశం ఎర్ర రంగు పూసుకుంది. తెల్లటి మబ్బులు పసిడి అంచులతో మెరుస్తున్నయ్.

సమస్త ప్రకృతి నర్మద హృదయ నైర్మల్యాన్ని చాటుతున్నది'' అనిపించింది సారథికి.

విచారించి నర్మదఉన్న వార్డులోకి వెళ్ళాడు. సారథినిచూసి లేచి కూచుంది నర్మద. ఆమెకళ్ళు సంతోషంతో మెరిసినై. హృదయం ఆనందభరితం అయింది. చూపులు కృతజ్ఞతాభావస్ఫోరకాలయ్యాయ్.

ఆమె మొహంలోని మార్పును గుర్తించాడుసారథి.

ఆమెతలకు కట్టు కట్టారు.

పక్కనే కూచున్నాడు. పడక పక్కనేవున్న కిటికీ కర్టెన్ లాగింది. కిటికీలోంచి చూశాడు. నీరెండలో పచ్చని పొలాలు మెరుస్తున్నయ్. ప్రశాంత వాతావరణం ఆహ్లాదకరంగావుంది.

సారథే మొదట పలుకరించాడు.

"క్షమించండి. నాటకానికి రావడానికి వీలులేక పోయింది. మీరెందుకు మానేశారు'' అన్నాడుసారథి.

నర్మద చిరునవ్వు నవ్వింది.

"మీపాట నా రహస్య హృదయనిధి. నలుగురికీ ఎలా వినిపించను. అందుకనే జీవితమంతా నాకు నేనే ఆపాట పాడుకుంటూ గడిపేస్తాను. నా జీవితమే ఆ పాట. ఆపాటే నా జీవితం''తీయని ఆవేశం ఆమెను ఆవహించింది. కాసేపు కళ్ళు మూసుకుంది. మళ్ళీ విశాల నీలినేత్రాలు తెరిచి సారథి వేపు చిలిపిగా చూసింది.

ఆమె కళ్ళల్లోని కాంతులు సారథి హృదయంలో వెన్నెల కాంతుల్ని వెదజల్లాయ్.


అప్రయత్నంగా ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయ్. సారథి హృదయం ఆనందగీతం పాడింది.

గళ్లనుడికట్టు-37

ఆధారాలు

అడ్డము

1. పాపం చలితో వణుకుతున్నాడు కట్టు బట్టేనా చూపించండి.
3. పూర్వాశ్రమంలో అత్తగారు ఈవిడే.
5. 5 నిలువును అనుభవించే వాడిపేరు మొన్నొచ్చి వెళ్ళిన పండగ.
6. గొప్పవాడిలో ఉట్టి పడే వినయాన్ని ఇంతమాట అంటారు.
8. సాయుధ మృగం.
10. వెనకాల ముందు మధ్య ప్రతిక్షణం మారేది.
11. వీటికి చెవులుంటాయంటారు గాని, కొన్ని చెవులకి మొలుస్తాయి.
13. శ్రావ్యమైన మోణుకు!
15. పరిశోధనలు బాగాసాగి గొప్పమందులు రావడంతో రోగాలు తిరుగుముఖం పట్టాయి.
16. పైపై ప్రేమభక్తి పైపైకి కనబడిపోయినా, గాఢమైనది ఇలా ఉంటుంది.
*17. డాలు చివర విరిగి పోయినదిగాని లేకపోతే జగడాలొచ్చేవే.
19. లెక్కకొచ్చేది చూడండి.
20. ముందు కాదు కనక—
23. ఈ విరి సంగతి తెలీదుగాని ఆ పువ్వులో తేమ మాత్రం ఇగిరి ఎగిరి ఇడై పోయింది.
24. కొత్త బద్ధకించినందువల్ల కాబోలు నీమం కొస్తా తలకిందులై పోయింది.
25. సంస్కృతంలో వచ్చిన చావే ఇది అంటారు గిట్టనివాళ్లు.
26. చివర కట్టు కడితేగాని ఈ శీర్షికలో పేరు పూర్తికాదు.
28. ముదరరంగు కాదు.



30. అవ్వా కావాలి బువ్వా కావాలంటే ఎలా? కడుపునింపే దారి చూడండి.
31. కొసవాడిగా చెక్కి దిగవేసికట్టేకొయ్య.
32. సర్వుడికి తలా తోకా ఉంచి, మధ్య తీసేసినా చప్పుడు కాకమానదు.


నిలువు

2. ఇంకోసారి రుచి చూడండి.
3. అవతలివాడు సాధించావన్నది ఇవతలి వాడికిలా కనిపిస్తుంది.
4. ఖలేజా ఉంటే ఉత్తరం ఎక్కడుందో చెప్పకో అన్నాడు డిటెక్టివ్ రావు.
*5. వైష్ణవాలయంలో ప్రసాదం రోజూ ఇది చేయిస్తారు.
7. వినయముగా మాటలాడడంలోనే మంచి తనం కనిపిస్తుంది.
9. భారతీయ వాద్యాలు మూడిటిలో మూడవది పూర్వం మట్టితో చేసేవారు.
10. ఇదికాక మోక్షగామి కాడు అన్నాడు వేమన్న.
11. ధనమో పేరో రాగానే కొంతమంది జనము ఇది బాగా చూపిస్తారు గీరగా.
12. వెలుగూ నీడా కలగలుపయి పోయాయి.
14. ఖంగుమని మోగేది.
18. అది సరిగ్గా వేసుకోండి.
19. మాకొద్దీ తెల్ల దొరతనము అన్న పాట వ్రాసిన ఆయని.
21. నికరంగా కనబడే జాలి.
26. ఈ నాటి ముసలవ్వల చిన్నతనంలో ఇవి కానుల్లా చెలామణీ అయేవి. కోటికి రెండు చొప్పున మారేవి.
27. గడితిరగడింది. మరగయ్యండి.
28. ఇదిగాని అదిగాని అనడానికి ఇదికి లేదా అది అంటారు, లేదా-అని కూడా అంటాం.
29. ఇది బహువచనం అయితే రహస్యాలన్నమాటే.


ఆధారాల పోటీ

గళ్ళ నుడికట్టు - 37 లో 17 అడ్డం మాటకు, 5 నిలువు మాటకు మేము ఇచ్చిన ఆధారాలకన్న ఉత్తమమైనవి పంపినవారికి రు 5 లు బహుమతి ఇస్తాము. ఆధారాలు మాకు చేరవలసిన ఆఖరి తేది ఫిబ్రవరి 4, 1961.

36-వ గళ్ళనుడికట్టుకు జవాబులు



బహుమతి పొందిన కార్టూన్



"పుల్లయ్య కేర్ ఆఫ్ మహాత్మా గాంధీ నేనే నయ్యా"

-చిత్రకారుడు - శిష్టా జగన్నాథం (హైదరాబాదు)

ఫీజే తక్కువ!

ఒకరోజు రాత్రి మూడు గంటలవేళ ఒకానొకవ్యక్తి ఒక డాక్టరును లేపి "డాక్టరు గారూ, ఇక్కడికి పదిమైళ్ళ దూరంలో ఒకరోగి ఉన్నాడు. మీరు వెంటనేవచ్చి అతనిని చూడా"లని కోరాడు.

డాక్టరు వెంటనే తన కారులో ఆ వ్యక్తి చూపిన ప్రదేశానికి వెళ్ళాడు. రోగిని చూపమన్నాడు.

రోగిని చూపకుండా "డాక్టరుగారూ, మీ విజిటింగ్ ఫీజెంత" అనడిగాడు ఆ వ్యక్తి.

"పది రూపాయలు" అన్నాడు డాక్టరు.

పది రూపాయల నోటు ఆయన చేతిలో పెట్టతూ "చాలా చవకే! ఆ టాక్సీవాడు ఇరవై అడిగాడు" అని విస్తుపోయాడు ఆ వ్యక్తి.

—ఎమ్. చంద్రమౌళి (రేపల్లె)

* * *

తండ్రినా, తల్లినా?

ఒకాయన భార్యను పురుడు కోసం ఆస్పత్రిలో చేర్చాడు ఆమెకు అదే మొదటికాన్పు.

కాన్పు వచ్చేవేళ అయింది. ఆయన అఫీసులో ఉండబట్ట లేకపోయాడు. హడావిడిగా ఆస్పత్రికి టెలిఫోన్ చేశాడు. నర్సుతో కంగారుగా ఇలా అన్నాడు:

"ఏమండీ, త్వరగా చెప్పండి. నేను తండ్రినయ్యానా, తల్లినయ్యానా?"

-'కృష్ణవేణి మైథిలి' (హైద్రాబాదు)

* * *

మరుపుతెచ్చిన పొదుపు

స్కాచ్ వారు పిసినిగొట్టులు. ఒకఊళ్ళో నలుగురు అన్నదమ్ములు ఉండేవారు. ఒకసారి వారిలో ముగ్గురు విదేశాలకు వెళ్లారు.

మూడేళ్లతరువాతముగ్గురూ తిరిగివస్తూ స్టేషనులో కలుసుకోమని తమ్ముడికి వ్రాశారు. తమ్ముడు స్టేషన్‌కు వెళ్లాడు. రైలుబండిలోనుంచి ముగ్గురు గడ్డపువాళ్ళు దిగారు. ఆ బవిరి గడ్డాలు చూచి "ఏమిటీ కథ" అని అడిగాడు తమ్ముడు.

"మేము ఊరువిడిచి వెళ్ళేటప్పుడు మనమంతా వాడుకొనే రేజర్ తీసుకెళ్లడం మరిచిపోయాము" అన్నారు అన్నలు.

-'కృష్ణవేణి మైథిలి' (హైద్రాబాదు)

Printed and Published for NageswaraRao Estates (Private) Ltd,. by S. Radha Krishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad